అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శనివారం 07-01-2023 సమగ్ర తెలుగు దినపత్రిక



26న రిపబ్లిక్ డే సందర్భంగా సీఆర్‌పీఎఫ్ మహిళా జవాన్ల రిహార్సల్స్

సంపుటి : 9 సంచిక : 7 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు వెల : 6.50

స్త్రీ విముక్తి, మహిళా సమానత్వం, సమసమాజ స్థాపన లక్ష్యంతో అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్న ఐద్వా 13వ అఖిల భారత మహాసభలు కేరళలోని తిరువనంతపురంలో ఉత్సాహపూరిత వాతావరణంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. మహాసభ ప్రారంభ సూచికగా ఉదయం 9:30 గంటలకు ఆ సంఘం అఖిల భారత అధ్యక్షులు మాలినీ భట్టాచార్య ఐద్వా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 12 ప్రాంతాల నుంచి వచ్చిన 'జ్యోతు'లను నాయకులు అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ వైజాగ్ నుంచి 'విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని వ్యతిరేకిస్తున్నాం' అంటూ ఆంధ్ర ప్రతినిధులు తెచ్చిన జ్యోతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జెండా ఆవిష్కరణ అనంతరం 'ఐద్వా జిందాబాద్, ఐద్వా లాంగ్ లివ్' అన్న నినాదాలతో ప్రాంగణం మారుమోగింది.



సమానత్వం కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం

ఐద్వా 13వ అఖిల భారత మహాసభ ప్రారంభ సభలో నేతల పిలుపు

- మతోన్మాద బీజేపీని గద్దె దించితేనా మన మనుగడ : బృందాకరత్
- న్యాయం, చట్టం కొందరికే పరిమితమైంది : తీస్తాసెతల్వాద్
- క్యూబాలో మహిళలకే అత్యధిక ప్రాధాన్యత : ఎలైడా గువేరా
- మనం రాజకీయాల్లో లేకపోతే సమాజాన్ని మార్చలేం : మల్లికా సారాబాయి



ఎలైడా గువేరా



బృందాకరత్

తిరువనంతపురం,
మల్లు స్వరాజ్యం ప్రాంగణం నుంచి సలీమ

ప్రారంభసభకు ముఖ్య అతిథిగా వచ్చిన ఐద్వా మాజీ జాతీయ కార్యదర్శి బృందాకరత్ మాట్లాడారు. ప్రస్తుతం మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు అనుగుణంగా కొత్త లక్ష్యాలు, ఆశయాలతో ఐద్వా ముందుకు సాగుతున్నదన్నారు. ఇందుకు కేరళ ఓ మంచి ఉదాహరణ. ఎంతో ఉత్సాహపూరిత వాతావరణంలో 13వ మహాసభలు నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన వారికి బృందాకరత్ అభినందనలు తెలిపారు. 1981లో ఐద్వా మొదటి మహాసభ చెన్నైలో ...10లో

కేంద్రం జాప్యం..

కొలీజియం సిఫారసు చేసిన పేర్లు వెనక్కి

- ఆమోదించని పేర్లు పరిశీలనకు
- మోడీ సర్కారు తీరుపై సుప్రీం ఆగ్రహం



న్యూఢిల్లీ : న్యాయమూర్తుల నియామకం కోసం కొలీజియం సిఫారసు చేసిన పేర్లను కేంద్రం వెనక్కి పంపుతున్నదనీ, అలాగే కొలీజియం ఆమోదించని పేర్లను పరిశీలనకు పంపుతున్నదని భారత అత్యున్నత న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తంచేసింది. సుప్రీంకోర్టు, హైకోర్టుల న్యాయమూర్తుల నియామకాలపై కేంద్రం జాప్యాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకాలతో కూడిన ధర్మాసనం విచారించింది. కొలీజియం సిఫారసులను ఆమోదించటంలో కేంద్రం జాప్యం చేయడంతో న్యాయమూర్తులుగా రావాల్సిన వాళ్లు తమ సమ్మతిని ఉపసంహరించుకోవడం, పూర్తిగా వెనక్కి తగ్గడం జరుగుతుందని ధర్మాసనం విచారం వ్యక్తం చేసింది.


ప్రభుత్వ మొదటి రౌండ్ అభ్యంతరాల తర్వాత... కొలీజియం ఇప్పటికే పునరుద్ఘాటించిన అభ్యర్థుల పేర్లను కూడా కేంద్రం వెనక్కి పంపుతున్నదని ధర్మాసనం తెలిపింది. '22 పేర్లను కేంద్రం వెనక్కి పంపింది. కొన్ని పునరుద్ఘాటించిన వారి పేర్లూ వెనక్కి పంపారు. వెనక్కి పంపిన వాటిలో కొన్ని మూడోసారి కూడా తిరిగి పంపారు. కొన్నింటిని కొలీజియం ఆమోదించనప్పటికీ... వారిని మాత్రం పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పేర్లను క్లియర్ చేయడంలో ప్రభుత్వం చేసిన జాప్యంతో ప్రతిభావంతులైన న్యాయవాదులు.. న్యాయమూర్తులు కావడానికి వారి సమ్మతిని ఇవ్వలేదని వివరించింది.

'కొలీజియం ఆమోదించిన పేర్లను వెబ్‌సైట్‌లో ఉంచారు. కేంద్రం వాటిని ఆమోదించదు. ఇది కొంత ప్రభావం చూపుతున్నది' అని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా అన్నారు. 'కేంద్రం జాప్యంతో నాకు తెలిసిన ఓ న్యాయమూర్తి ఉపసంహరించుకున్నారు. మరొకరు.. కొలీజియం వద్ద పెండింగ్‌లో ఉన్నందున ఉపసంహరించుకున్నారు' అని జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ అన్నారు. 'ప్రతిభావంతులైన వ్యక్తులు సమ్మతి ఇవ్వడానికి సంకోచించే వాతావరణాన్ని మనమే సృష్టిస్తున్నామా?.. అన్న సందేహం కలుగుతున్నది' అని ఆయన అన్నారు.రాజకీయ అంశాలతో సంబంధం లేకుండా న్యాయమూర్తులు కేసులను విచారిస్తారని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ విషయంలో జస్టిస్ విఆర్ కృష్ణయ్యర్‌ను ఉదహరించింది. 'మేము జస్టిస్ కృష్ణయ్యర్‌ను గొప్ప సహకారి అని ప్రశంసిస్తాం. అతను ఎక్కడ నుంచి వచ్చాడో చూడండి. మేము న్యాయమూర్తులు అయినప్పుడు రాజకీయ పరిగణనలతో సంబంధం లేకుండా మా కర్తవ్యం నిర్వర్తిస్తాం. జస్టిస్ కృష్ణయ్యర్ కేరళలో మంత్రిగా ఉన్నారు. అతను న్యాయవాదిగా ఉన్నప్పుడు రాష్ట్రంలో వామపక్ష ప్రభుత్వానికి అనుబంధంగా ఉన్నారు. ఆయన న్యాయమూర్తి అయిన తరువాత రాజకీయాలకు సంబంధం లేకుండా వ్యవహరించారు' అని జస్టిస్ కౌల్ వ్యాఖ్యానించారు. కొలీజియం వ్యవస్థకు వ్యతిరేకంగా కొంతమంది న్యాయమూర్తుల అభిప్రాయాలను ఉటంకిస్తూ, కొలీజియం ప్రతిపాదించిన పేర్లను ఆమోదించకుండా ఆలస్యం చేయడానికి ప్రభుత్వం ఒక సాకు చూపుతుందని అన్నారు. 'ప్రతి వ్యవస్థకు దాని సొంత లోపాలుంటాయి. అయితే ప్రస్తుత చట్టాన్ని అనుసరించాలి. మీరు కొత్త ...5లో

చెన్నైకి మొదటి స్థానం

మహిళా శ్రామిక శక్తికి అనుకూల నగరాల్లో..

- పూణె, బెంగళూరు, హైదరాబాద్, ముంబయి తర్వాతి స్థానాల్లో..



న్యూఢిల్లీ : మహిళా శ్రామిక శక్తిని అనుకూలమైన నగరాల్లో మొదటిస్థానంలో చెన్నై నిలిచింది. తర్వాతి స్థానాల్లో వరుసగా పూణె, బెంగళూరు, హైదరాబాద్, ముంబయిలు నిలిచినట్టు ఓ అధ్యయనంలో తేలింది. భారత్‌లోని పదిలక్షలకు పైగా జనాభా కలిగిన ప్రధాన నగరాలపై ఈ సర్వే చేపట్టింది. ఈ జాబితాలో దేశ రాజధాని ఢిల్లీ 14వ స్థానంలో నిలిచింది. జీవన సౌలభ్యం, భద్రత, మహిళల ప్రాతినిథ్యరేటు, మహిళా సాధికారత కార్యక్రమాలు అనే ఐదు అంశాల ఆధారంగా అవతార్ అనే సంస్థ ఈ సర్వేను చేపట్టింది. వివిధ సంస్థలు, యాజమాన్యాలు మహిళలకు ఎంతవరకు సౌలభ్యతను అందిస్తున్నాయనే అంశంపై కూడా సర్వే చేపట్టారు.లక్ష కన్నా తక్కువ జనాభా కలిగిన చిన్న నగరాల్లో తమిళనాడులోని ఐదు నగరాలైన తిరుచిరాపల్లి, వెల్లోర్, ఈరోడ్, సేలం, తిరుప్పూర్‌లు అత్యున్నత స్థానంలో నిలిచాయి. మొత్తం ...5లో

ప్రతి పేదవాడి గడపకూ సంక్షేమ పథకాలు

ప్రజల భవిష్యత్ కోసమే బీఆర్‌ఎస్ అప్పులు



- పెద్దలకు దోచిపెట్టిన మోడీ ప్రభుత్వం
- తెలంగాణ నిధులతోనే బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధి పనులు
- ఎన్నికలప్పుడే రాజకీయాలు
- బీజేపీ ప్రమాదకరమైన పార్టీ.. దాని ఉచ్చులో పడొద్దు
- ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్
- మునుగోడు నియోజకవర్గం, హుజూర్‌నగర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

నవతెలంగాణ- హుజూర్‌నగర్ /చండూరు

ప్రతి పేదవాని గడపకూ సంక్షేమ పథకాలు అందాలన్నదే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యం.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకున్న రుణాలతో తెలంగాణ ప్రజల భవిష్యత్ కోసం పెట్టుబడులు పెడితే.. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రూ.100 లక్షల కోట్ల అప్పు చేసి ఏం మంచి పనులు చేసిందని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. మునుగోడు నియోజకవర్గం పరిధిలోని చండూరు పట్టణంలో రూ. 40 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యే కూసుకుంట్ల ...5లో

మేయర్ ఎన్నిక వాయిదా?


ఢిల్లీ కార్పొరేషన్ సమావేశంలో బీజేపీ, ఆప్ బాహాబాహీ



న్యూఢిల్లీ : ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) మేయర్ ఎన్నికలు వాయిదాపడ్డాయి. తొలి సమావేశంలోనే ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ కౌన్సిలర్లు ఒకరిపై ఒకరు దాడి చేసుకుని, కుర్చీలు విసిరేసుకోవడంతో ఎన్నికలను వాయిదా వేసినట్టు ఎంసీడీ సీనియర్ అధికారి తెలిపారు. శుక్రవారం నాటి సమావేశంలో కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం చేయాల్సి వుంది. సభలో అత్యంత సీనియర్ సభ్యుడిని తాత్కాలిక స్పీకర్‌గా నియమించాల్సి ఉండగా, బీజేపీ కౌన్సిలర్ సత్య శర్మను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకె సక్సేనా నియమించడంపై ఆప్ సభ్యులు ఆందోళన చేశారు. కౌన్సిలర్ల కంటే ముందుగా ఎల్‌జి సిఫార్సు చేసిన నామినేటెడ్ సభ్యులతో తాత్కాలిక స్పీకర్ ప్రమాణ స్వీకారం చేయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ సభ్యులు కూడా ఆందోళన చేయడంతో సమావేశం వాయిదా పడింది.

ఆ ఫైళ్ల కోసం ఒత్తిడి చేయొద్దు..

సీబీఐకి హైకోర్టు ఆదేశాలు...




- ఎమ్మెల్యేల ఎర కేసుపై విచారణ సోమవారానికి వాయిదా

నవతెలంగాణ - హైదరాబాద్

ఎమ్మెల్యేల ఎర కేసుకు సంబంధించిన ఫైళ్లు, ఇతర డాక్యుమెంట్లను ఇవ్వాలని కోరితే ఇవ్వడం లేదంటూ సీబీఐ హైకోర్టుకు తెలిపింది. ఆయా దస్త్రాలను ఇస్తే వెంటనే కేసును విచారిస్తామంటూ స్పష్టం చేసింది. సంబంధిత వివరాలను సమర్పించాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినా స్పందించడం లేదని కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ) శుక్రవారం హైకోర్టుకు తెలిపింది. సీబీఐ ఉత్తర్వుల తీర్పుపై అప్పీల్‌ను దాఖలు చేశామనీ, దానిపై తీర్పు వెలువరిచేంత వరకు విచారణ జరపకుండా ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వం ...5లో





ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణ దరఖాస్తుదారుల్లో టెన్షన్

రెగ్యులరైజేషన్‌కు ఫీజు చెల్లించాలంటూ నోటీసులు

- 90రోజుల్లో మూడువాయిదాలుగా చెల్లించాలంటూ ఆదేశాలు
- ఇప్పటికిప్పుడు పంపించినవి కాదు : కలెక్టర్

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జూన్ 2, 2014కు ముందు ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకుని ఇండ్లు నిర్మించుకున్న నిరుపేదలను ఆ స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలని ప్రభుత్వం జీవోలు 58, 59 జారీ చేసిన విషయం విధితమే. దీనిలో 125 గజాలలోపు స్థలంలో ఇండ్లు నిర్మించుకున్న దారిద్ర్యరేఖ దిగువన ఉన్నవారి స్థలాన్ని ఉచితంగా క్రమబద్ధీకరణ చేసేందుకు జీవో నంబర్ 58 జారీ చేసింది. 125 గజాలకు పైగా ఇండ్ల స్థలం ఉన్న నిరుపేదల కోసం జీవో 59ని విడుదల చేసింది. అయితే జీవో 59 కింద అప్లికేషన్ చేసుకున్న దరఖాస్తుదారులకు ఖమ్మం జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నోటీసులు జారీ అయ్యాయి. జిల్లాలో 2వేల మందికి పైగా ఈరకమైన దరఖాస్తులు ...5లో



ప్రయివేటీకరణ ఆపాలి

స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి

- రాష్ట్ర పరిధిలోని సమస్యలపైనా నిర్లక్ష్యం
- రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు, ధర్నా



నవతెలంగాణ- విలేకరులు

స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్త నిరసనలో భాగంగా రాష్ట్రంలోనూ శుక్రవారం ర్యాలీలు, ధర్నా చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని స్కీంల ప్రయివేటీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పరిధిలోని సమస్యలపైనా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేసి వినతిపత్రాలు అందజేశారు. అంగన్వాడీలు, ఆశాలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఐకేపీ సిబ్బంది, వివోఏలు తదితర విభాగాల్లో పని చేస్తున్న స్కీంవర్కర్లు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్ క్రాస్ రోడ్డు నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వి.రమ మాట్లాడుతూ.. స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ స్కీంల ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తన పరిధిలోని సమస్యలను పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నదని తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర నాయకులు ...5లో

13,14 తేదీల్లో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి సబిత
- ప్రారంభోపన్యాసం చేయనున్న కేరళ మాజీ మంత్రి శైలజా టీచర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర ఐదో మహాసభలు ఈనెల 13,14 తేదీల్లో రంగారెడ్డి జిల్లా సాగర్ రోడ్ మన్నెగూడలో బీఎంఆర్ సార్థా కన్వెన్షన్‌లో నిర్వహించనున్నారు. ఈ మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర విద్యామంత్రి పి సబితా ఇంద్రారెడ్డి తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డితో కలిసి శుక్రవారం ఆవిష్కరించారు. మహాసభల సందర్భంగా ఈనెల 13న తొలిరోజు ఉపాధ్యాయుల మహాప్రదర్శన, బహిరంగ సభను నిర్వహిస్తారు. ముఖ్యఅతిథిగా సబితా ఇంద్రారెడ్డి హాజరవుతున్నారు. కేరళ మాజీ మంత్రి కెకె శైలజా టీచర్ ప్రారంభోపన్యాసం చేస్తారు. అతిథులుగా ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, ఆహ్వానసంఘం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కె నాగేశ్వర్‌తోపాటు రంగారెడ్డి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు హాజరవుతారు. ఈ సందర్భంగా మంత్రి సబిత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. ఉపాధ్యాయులందరూ సహకరించాలని కోరారు. పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి చర్యలు చేపడుతున్నామన్నారు. ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం టీఎస్‌యూటీఎఫ్ నిరంతరం కృషి చేస్తున్నదని వివరించారు. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, నియామకాలు వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి మాట్లాడుతూ విద్యా కేంద్రీకరణ, వ్యాపారీకరణ, కాషాయీకరణకు దోహదం చేస్తున్న జాతీయ విద్యా విధానానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఉద్యోగుల కుటుంబాలకు శాపంగా మారిన సీపీఎస్ విధానానికి వ్యతిరేకంగా నిరంతరం కార్యాచరణ చేస్తున్నదని వివరించారు. ఈ మహాసభల్లో నిర్దిష్ట పోరాట కార్యక్రమాలను రూపొందించు కుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అభ్యర్థి పి మాణిక్ రెడ్డి, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఈ గాలయ్య, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె గోపాల్ నాయక్, ఎం వెంకటప్ప, నాయకులు కల్పన, జగన్నాథ్, గణేష్ పాల్గొన్నారు.

ఘనంగా యూకో బ్యాంక్ 80వ వ్యవస్థాపక దినోత్సవం



హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని యూకో బ్యాంక్ శుక్రవారం దేశ వ్యాప్తంగా తన 80వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంది. ఈ క్రమంలోనే హైదరాబాద్ జోన్ లో బోడుప్పల్, జగిత్యాల్‌లో రెండు కొత్త శాఖలను ఏర్పాటు చేసింది. వీటిని ఆ బ్యాంక్ హైదరాబాద్ జోనల్ మేనేజర్ సందీప్ శర్మ లాంచనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంలు మోతిలాల్, శశి భూషన్ రావు, లోకేంద్ర శర్మలు పాల్గొన్నారు. బ్యాంక్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా అభి సాయి దత్తా ట్రస్ట్ అనాథ పిల్లల ఆశ్రమాన్ని సందర్శించి.. నిత్యవసర సరుకులను అందజేశారు. బంజారా హిల్స్ జోనల్ ఆఫీసులో రక్తదాన కార్యక్రమాన్ని చేపట్టారు.

పోలీసుల నిర్లక్ష్యం..

14 రోజులు మార్చురీలో యువకుడి శవం

- కుళ్లి కంపుకొట్టాక స్పందించిన పోలీసులు, ఆస్పత్రివర్గాలు
- 18న రోడ్డు ప్రమాదం.. 23న సంగారెడ్డి ఆస్పత్రిలో మృతి
- పట్టించుకోని పోలీసులు.. సమాచారమిచ్చి వదిలేసిన వైద్యులు
- రాజు ఆచూకీ కోసం వెతికిన భార్య, బంధువులు
- న్యాయం చేయాలని ఆస్పత్రి ఎదుట ఆందోళన
- స్పందించిన మంత్రి.. ఆర్థిక సాయం, భార్యకు ఉద్యోగం



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఓ యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించగా, మృతదేహాన్ని మార్చురీలో పడేసి వైద్యులు చేతులు దులుపుకున్నారు. సమాచారమిచ్చినా పోలీసులు పట్టించుకోలేదు. నిర్లక్ష్యం ఫలితంగా మార్చురీలోనే శవం కుళ్లిపోయిన సంఘటన సంగారెడ్డి పట్టణంలో చోటు చేసుకుంది. ఝరాసంఘం మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన ఎర్రోళ్ల శ్రీను అలియాస్ చిన్న (28) టీవీ సీరియల్స్‌లో కెమెరామెన్‌గా పనిచేస్తున్నాడు. గత నెల 18న హైదరాబాద్ నుంచి పల్సర్ బైక్‌పై (టీఎస్15ఈటీ4409) ఇంటికి వెళ్తున్నాడు. నాందేడ్ రహదారి సుల్తాన్‌పూర్ సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. స్థానికులు 108కు ఫోన్ చేయగా అతన్ని సంగారెడ్డి జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. తీవ్ర గాయాల పాలైన చిన్నాను వైద్యులు పరీక్షించి చికిత్స చేశారు. పరిస్థితి విషమించి డిసెంబర్ 23న మృతి చెందాడు. ఈ విషయాన్ని స్థానిక సంగారెడ్డి టౌన్ పోలీసులకు ఆస్పత్రి వైద్యులు సమాచారమిచ్చారు. ప్రమాదం జరిగిన ప్రాంతం తమ పరిధి కాదని పట్టించుకోలేదు. ఆ తర్వాత పక్కనే ఉన్న పుల్కల్ మండల పోలీసులకు సమాచారమిచ్చారు. వాళ్లు సైతం పట్టించుకోలేదు. దాంతో శవాన్ని ఆస్పత్రిలోని మార్చురీ ఫ్రీజర్‌లో ఉంచారు. 14 రోజులైనా ఎవరూ ఆ శవం గురించి రాలేదు. దాంతో శవం కుళ్లి, కంపు కొడుతుండటంతో ఆస్పత్రి సిబ్బంది గమనించి వైద్య అధికారులకు చెప్పారు. సూపరింటెండెంట్ డాక్టర్ అనిల్‌కుమార్ ఈ నెల 5న మళ్లీ పుల్కల్ పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేసినా పోలీసులు అశ్రద్ధ వహించడంతో సూపరింటెండెంట్ కాస్త గట్టిగా చెప్పడంతో పోలీసులు ఆస్పత్రికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. అతని జేబులో ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ లభించగా, ఝరాసంఘం మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన చిన్నగా గుర్తించారు. వెంటనే బంధువులకు సమాచారం ఇవ్వగా గురువారం రాత్రి బంధువులు, భార్య ఆస్పత్రికి చేరుకున్నారు. వైద్యుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆస్పత్రి ఎదుట రాత్రి ఆందోళన చేశారు. తన భర్త ఆచూకీ కోసం వెతుకుతున్నామని, అతను చనిపోయిన విషయం తమకు ఎవరూ చెప్పలేదని బోరున విలపించారు. అతని ఫోన్ కూడా స్విచ్‌ఆఫ్ అవడంతో బంధువులు, స్నేహితులు, తెలిసినవారిని అడిగామని తెలిపారు. ఈ నెల 2 స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామని, ఇంతలోనే సంగారెడ్డి ఆస్పత్రిలో శవం ఉన్నట్టు సమాచారం వచ్చిందని భార్య సంగీత తెలిపారు. అయితే, భర్త ఇంటికి రాకుండా పోయిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసి ఉంటే అతని విషయం తెలిసేదని పోలీసులు తెలుపుతున్నారు.

ఆస్పత్రి సిబ్బంది, పోలీసుల తీరుకు నిరసనగా శుక్రవారమూ ఆస్పత్రి, పోలీస్ స్టేషన్ ఎదుట బైటాయించి ఆందోళన చేశారు. పక్కనే ఉన్న జిల్లా పరిషత్ కార్యాలయంలో మంత్రి సమక్షంలో జరుగుతున్న జెడ్పీ మీటింగ్‌లోకి జొరబడేందుకు ప్రయత్నించారు. దాంతో పోలీసులు ఆందోళనకారుల్ని చెదరగొట్టి అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. జెడ్పీ సమావేశంలో పాల్గొన్న మంత్రి హరీశ్ రావు.. సంగారెడ్డి ఆస్పత్రిలో జరిగిన సంఘటన గురించి కలెక్టర్ ఎ.శరత్‌తో మాట్లాడారు. ఏం జరిగిందో విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసులు స్పందించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాల్సిందని ఆస్పత్రి అధికారులను మందలించారు. అనంతరం మృతుని బంధువులు, భార్యను కలెక్టరేట్ కు పిలుపించుకున్నారు. మృతుని కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం, చిన్న భార్య సంగీతకు ఉద్యోగం, సొంతూరులో డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని సొంతూరికి తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

దేశీ రకం మిర్చికి రికార్డు ధర

- క్వింటాకు రూ.80,100

నవతెలంగాణ-కాశిబుగ్గ

వరంగల్ వ్యవసాయ మార్కెట్లో గురువారం దేశీ రకం కొత్త మిర్చికి రికార్డు ధర పలికింది. గతంలో ఎప్పుడు లేని విధంగా క్వింటాకు ధర రూ 80,100 పలికింది. మార్కెట్ చరిత్రలో ఇప్పటివరకు కొత్త మిర్చికి ఈధర పలకడం ఇదే మొదటిసారి. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం రావి చెట్టు తండాకు చెందిన తేజవత్ రాములు అనే రైతు శుక్రవారం 4 బస్తాలు కొత్తరకం దేశీ మిర్చిని తీసుకురాగా అన్నపూర్ణ ట్రేడర్స్ అర్తి ద్వారా శ్రీ చైత్ర ఎంటర్‌ప్రైజెస్ ఖరీదుదారు అత్యధిక ధర రూ.80,100 పెట్టి కొనుగోలు చేశారు. శుక్రవారం వరంగల్ వ్యవసాయ మార్కెట్ కు తేజ రకం మిర్చి 1755 బస్తాలు రాగా గరిష్ఠ ధర రూ.20,000 పలుకగా కనిష్ఠ ధర రూ.16,000, వండర్ హాట్ 48 బస్తాలు రాగా ధర రూ.37,000 కనిష్ఠ ధర రూ.31,000, యుఎస్ 341 265 బస్తాలు రాగా ధర రూ.26,000, కనిష్ఠ ధర రూ.20,000, తాలు 267 బస్తాలు రాగా ధర రూ.10 వేలు పలుకుగా కనిష్ఠ ధర రూ.5000 పలికింది.

మిషన్‌భగీరథ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

- కనీసవేతనాలిచ్చి రెగ్యులర్ చేయాలి : జేఏసీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మిషన్ భగీరథ కార్మికులకు పెండింగ్ బకాయి వేతనాలను చెల్లించాలనీ, కనీస వేతనమివ్వడంతో పాటు రెగ్యులర్ చేయాలని తెలంగాణ మిషన్ భగీరథ కాంట్రాక్టు, ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్స్ రాష్ట్ర ఐక్య కార్యాచరణ కమిటీ(జేఏసీ) నాయకులు వంగూరు రాములు(సీఐటీయూ), ఆర్.చంద్రయ్య(ఏఐటీయూసీ), ఎం.రవి(టీఆర్ఎస్‌కేవీ), సూర్యం (ఐఎఫ్‌టీయూ) డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో జేఏసీ సమావేశం జరిగింది. అనంతరం మిషన్‌భగీరథ ఈఎన్సీ కృపాకర్‌రెడ్డికి జేఏసీ నాయకులు వెళ్లి వినతిపత్రం అందజేశారు. మిషన్ భగీరథ పథకంలో పనిచేస్తున్న 16వేలకు పైగా కార్మికులు (పంపు ఆపరేటర్లు, ఫిట్టర్లు, లైన్‌మెన్లు,ఎలక్ట్రిషియన్లు, తదితర క్యాటగిరీలు) సమస్యలను ఈఎన్సీ దృష్టికి తీసుకెళ్లారు. కనీస వేతనాలు, చట్టబద్ధ హక్కులు అమలు కావట్లేదని వాపోయారు. పలు జిల్లాల్లో పథక నిర్వహణను ప్రయివేటుకు అప్పగించడం వల్ల ఒక్కో కంపెనీ ఒక్కో విధంగా వేతనాలిస్తున్న తీరును వివరించారు. ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ, బోనస్ వంటి చట్టబద్ధ హక్కులు అమలు కావడం లేదని తెలిపారు. స్కిల్డ్ కార్మికులకు అన్‌స్కిల్డ్ వేతనాలు చెల్లించడం దారుణమని పేర్కొన్నారు. ఎనిమిదిగంటల పని విధానం అమలు చేయడంతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలనీ, హెల్త్‌కార్డులు, గుర్తింపుకార్డులివ్వాలని కోరారు. విధి నిర్వహణలో చనిపోతే వారి కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికునికీ ఫోన్, పెట్రోల్ అలవెన్స్‌ల కోసం రూ.5 వేలు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జంజిరాల శ్రీనివాస్(సీఐటీయూ), నర్సింహ్మ(ఏఐయూటీసీ), బాబురావు (టీఆర్ఎస్‌కేవీ), కిరణ్(ఐఎఫ్‌టీయూ), తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వానికి, దున్నపోతుకు తేడా లేదు

- ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి
- వినూత్నంగా దున్నపోతుకు వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వానికి, దున్నపోతుకు తేడా లేదని ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి విమర్శించింది. శుక్రవారం హైదరాబాద్‌లోని హబ్సిగూడలో 'మా గోడు వినండి టీఎస్ఎల్‌పీఆర్‌బీ చైర్మెన్' అంటూ వినూత్నంగా దున్నపోతుకు పలువురు అభ్యర్థులు వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యల పరిష్కార పోరాట సమితి కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు వలీ ఉల్లా ఖాద్రీ, కె. ధర్మేంద్ర (ఏఐవైఎఫ్), సలీంపాషా (యువజన సమితి), రెహ్మాన్, ఉదయ్, సతీష్ కుమార్ (ఏఐఎస్ఎఫ్), అశోక్ రెడ్డి(ఎస్ఎఫ్ఐ), శివానంద్ (టీఎన్ఎస్ఎఫ్), అరుణ్ కుమార్ (విద్యార్థి జన సమితి) ఒక ప్రకటన విడుదల చేశారు. ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్ష విభాగాల్లో జరిగిన నష్టంపై న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై అధికారులు, మంత్రులను వివిధ రూపాల్లో కలిసి అభ్యర్థించినా పట్టించుకోలేదని విమర్శించారు. కనీసం సమీక్ష సమావేశం కూడా నిర్వహించలేదని తెలిపారు. మొద్దు నిద్రలో పయనిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలనే ఉద్దేశంతో దున్నపోతుకు వినతిపత్రం సమర్పించామని పేర్కొన్నారు. ఎన్నో ఆకాంక్షలతో పోలీసు ఉద్యోగాలను సాధించాలనే అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. టీఎస్ఎల్‌పీఆర్‌బీ చైర్మెన్ ఏకపక్ష నిర్ణయాలతోనే అభ్యర్థులకు నష్టం జరుగుతున్నదని తెలిపారు. ఆ చైర్మెన్‌ను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఈనెల తొమ్మిదో తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 1,600, 800 పరుగుపందెంలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులందరికీ మెయిన్స్ పరీక్షకు అవకాశం కల్పించాలని కోరారు. ప్రిలిమ్స్ ప్రాథమిక పరీక్ష మల్టీపుల్ పరీక్షలో తప్పుగా వచ్చిన ఏడు ప్రశ్నలకు మార్కులు కలపాలని తెలిపారు. ప్రిలిమ్స్ పరీక్షలో తప్పుగా వచ్చిన ప్రశ్నలన్నింటికీ మార్కులను కలపాలని కోరారు.

ప్రత్యక్ష, పరోక్ష పన్ను చెల్లింపుల స్వీకరణ :సిటీ యూనియన్ బ్యాంక్

చెన్నయ్: తమ శాఖల్లో ప్రత్యక్ష, పరోక్ష పన్నులను స్వీకరిస్తున్నట్లు సిటీ యూనియన్ బ్యాంక్ (సియుబి) వెల్లడించింది. సరికొత్త ఇ- ఫైలింగ్ పోర్టల్ టిన్ 2.0 సాంకేతిక అనుసంధా నం ద్వారా ఈ సేవలను అందు బాటులోకి తెచ్చినట్లు ఆ బ్యాంక్ ఓ ప్రకటనలో తెలిపింది. ఇందు కోసం ఆదాయపు పన్ను శాఖ పోర్టల్‌తో అనుసంధానం అయినట్లు పేర్కొంది. ఇకపై యూనియన్ బ్యాంక్ ఖాతాదారులు తమ వ్యక్తిగత, కార్పొరేట్ పన్నులను చెల్లించడానికి వీలుందని వెల్లడించింది. ఈ సేవలు అందించే కొన్ని ప్రయివేటు బ్యాంక్‌ల్లో తమకు ఈ అవకాశం దక్కినట్లు పేర్కొంది. సియుబి శాఖలను సంప్రదించడం ద్వారా గానీ లేదా నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా సరళమైన ప్రక్రియ ద్వారా పన్ను చెల్లింపులు చేయవచ్చు.

వంద నిమిషాల్లో వంద మ్యాథ్స్ గుణింతాలు

- శ్రీచైతన్య హ్యాట్రిక్ ప్రపంచ రికార్డు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వంద నిమిషాల్లో వంద మ్యాథ్స్ గుణింతాలతో శ్రీచైతన్య స్కూల్ హాట్రిక్ ప్రపంచ రికార్డును సాధించింది. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజీవ్ శ్రీవాత్సవ నుంచి శ్రీచైతన్య స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ సీమ శుక్రవారం సర్టిఫికెట్‌ను అందుకున్నారు. వంద రోజుల శిక్షణతో పది రాష్ట్రాల్లోని 73 బ్రాంచీల నుంచి 400 జూమ్ లింక్‌ల ద్వారా రెండువేలకుపైగా ప్రాథమిక, ప్రీప్రైమరీ విద్యార్థులు పాల్గొని ఒకటి నుంచి వంద వరకు మ్యాథ్స్ గుణింతాలను వంద నిమిషాల్లో చెప్పారని ఆమె వివరించారు. ఇది అందరినీ ఆశ్చర్యపరిచిందనీ, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సాధించారని తెలిపారు. విద్యార్థులు, టీచర్లు ఒక్కటై ఎంతో ఇష్టంతో కృషిచేయడం వల్లే ఇంత గొప్ప విజయం, వరల్డ్ రికార్డు సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ రికార్డు సృష్టించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, నిరంతరం కృషిచేస్తున్న అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత బీఎస్ రావు అభినందనలు తెలిపారు.

చేవెళ్లలో రవాణా భారీ ర్యాలీ

రవాణారంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి : ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు వీరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్

- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కొనసాగిన సంఘర్ష యాత్ర

నవతెలంగాణ-పరిగి, వికారాబాద్ ప్రతినిధి, చేవెళ్ల, గండిపేట, రాజేంద్రనగర్

రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ఉపాధ్యక్షులు వీరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్ డిమాండ్ చేశారు. రవాణారంగ కార్మికుల సంక్షేమ బోర్డు, ఆర్టీసీ పరిరక్షణ కై చేపడుతున్న కార్మికుల సంఘర్ష యాత్ర శుక్రవారం ఉదయం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ప్రారంభమైన యాత్ర వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో కొనసాగింది. ఉదయం మహబూబ్‌నగర్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో సభ నిర్వహించారు. అక్కడి నుంచి వికారాబాద్ జిల్లా పరిగిలో ప్రవేశించిన యాత్ర.. వికారాబాద్, చేవెళ్ల నుంచి అప్పజంక్షన్ మీదుగా రాజేంద్రనగర్ నుంచి కాటేదాన్‌కు చేరింది. కాటేదాన్‌లో శుక్రవారం రాత్రి బస చేయనున్నారు. మొదట పరిగిలో ప్రవేశించిన యాత్రకు సీఐటీయూ రవాణా రంగ కార్మికులు ఘన స్వాగతం పలికారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అక్కడి నుంచి వికారాబాద్ పట్టణానికి యాత్ర చేరుకుంది. ట్రాన్స్‌పోర్ట్ కార్మికులు యాత్రకు స్వాగతం పలికారు. వికారాబాద్ సోయో అడ్డాల వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.మహిపాల్ అధ్యక్షతన సభ జరిగింది. అక్కడి నుంచి యాత్ర చేవెళ్లకు చేరింది. సీఐటీయూ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో యాత్రకు స్వాగతం పలికారు. చేవెళ్ల పట్టణంలో అంగన్‌వాడీ, పంచాయతీ, ఆటో, రవాణా రంగ కార్మికులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి బండ్లగూడ కార్పొరేషన్ అప్ప జంక్షన్‌కు యాత్ర చేరుకుంది. అప్ప జంక్షన్ పోలీసు అకాడమీ వద్ద సీఐటీయూ జెండాను వీరయ్య ఆవిష్కరించారు. అక్కడి నుంచి రాజేంద్రనగర్ మీదుగా కాటేదాన్‌కు యాత్ర చేరింది.


చేవెళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

ఈ సందర్భంగా ఆయా పట్టణాల్లో నిర్వహించిన సభల్లో జాతీయ ఉపాధ్యక్షులు ఎస్. వీరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడారు. మోటార్ వాహన చట్టం 2019లో సవరణలు చేయాలన్నారు. కేరళ రాష్ట్రంలోని సవారీ యాప్ తరహా యాప్‌ను దేశవ్యాప్తంగా తీసుకు రావాలని కోరారు. ఆర్టీసీ కార్మికోద్యమంపై ఆంక్షలు ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని, పెంచిన ఓవర్ లోడ్ పెనాల్టీ తగ్గించాలన్నారు. రాష్ట్రంలో సుమారు 20 లక్షల మందికి పైగా కార్మికులు రవాణా రంగంలో పనిచేస్తున్నారని తెలిపారు. ఉన్నత చదువులు చదువుకున్న ఉద్యోగాలు దొరకని పరిస్థితుల్లో ఈ రంగంలో స్వయం ఉపాధిని పొందుతూ జీవనం కొనసాగిస్తున్నారని, ప్రభుత్వాలు వారి సమస్యలు పరిష్కరించడంలో ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, రవాణా రంగ కార్మికులు పాల్గొన్నారు.

గోదావరిలో దూకి ఇరిగేషన్ డీఈఈ ఆత్మహత్య


(ఫైల్)

- మృతిపై పలు అనుమానాలు

నవతెలంగాణ-నవీపేట్

గోదావరి నదిలో దూకి ఇరిగేషన్ డీఈఈ ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం యంచ గోదావరి వద్ద శుక్రవారం వెలుగు లోకి వచ్చింది. ఎస్ఐ రాజారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోతంగల్ గ్రామానికి చెందిన రమణా రావు (46) జలవనరుల శాఖ డీఈఈగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా వ్యక్తిగత కారణాలతో గత ఫిబ్రవరి నెల నుంచి సెలవులపై ఉన్న ఆయన కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. బుధవారం కారులో స్వగ్రామం పోతంగల్‌కు వచ్చాడు. తిరిగి మోటార్ బైక్‌పై ఇంటికి వెళుతున్నానని చెప్పి వెళ్లాడు. హైదరాబాద్‌కు చేరుకోకపోవడంతో బంధువులకు ఫోన్ చేసినా సమాచారం తెలియలేదు. దాంతో మృతుని అన్న మధుకర్‌రావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యంచ గోదావరికి వద్ద మోటార్ బైక్ కనిపించడంతో గజ ఈతగాళ్లతో గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. కాగా శుక్రవారం ఉదయం మృతదేహం లభించింది. స్వగ్రామం పోతంగల్‌లో అంత్యక్రియలు జరపగా జడ్పీ చైర్మెన్ దాదన్నగారి విఠల్‌రావు, రామ్ కిషన్‌రావు, అనిల్‌రావు హాజరయ్యారు. మృతునికి భార్య కూతురు ఉన్నారు.

జాతీయ కవి సమ్మేళనానికి ఎమ్వీ రామిరెడ్డి ఎంపిక



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆకాశవాణి ఏటా నిర్వహించే జాతీయ సర్వభాషా కవి సమ్మేళనానికి 2023 సంవత్సరానికిగాను తెలుగు భాష నుంచి ఎమ్వీ రామిరెడ్డి ఎంపికయ్యారు. భారతీయ భాషలకు సంబంధించి 23 మంది కవుల కవితల్ని ఆకాశవాణి ఈనెల పదో తేదీన ఢిల్లీలోని రంగ్ భవన్‌లో రికార్డు చేయనుంది. స్వాతంత్ర్యం సాధించి 75 ఏండ్లు పూర్తయిన సందర్భాన్ని పురస్కరించుకుని ఎమ్వీ రామిరెడ్డి రాసిన 'అమృతోపనిషత్' కవితను తెలుగు భాష నుంచి ఎంపిక చేశారు. ఈ కవితను అన్ని భారతీయ భాషల్లోకీ అనువదించి ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారం చేయనున్నారు. కవిగా, కథా రచయితగా ఎమ్వీ రామిరెడ్డి తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పటిదాకా మూడు కథా సంపుటాలు, నాలుగు కవితాసంపుటాలను ఆయన ప్రచురించారు. ప్రస్తుతం రామ్‌కీ ఫౌండేషన్ ప్రెసిడెంటుగా హైదరాబాద్‌లో పని చేస్తున్నారు. ఆయన స్వగ్రామం గుంటూరు జిల్లా పెదపరిమిలో తండ్రి స్మృత్యర్థం స్థాపించిన 'ముప్పా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్టు' ద్వారా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. అదే గ్రామంలో ప్రత్యేకంగా నిర్మించిన భవనంలో వృద్ధాలయంతోపాటు నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఆయన నిర్వహిస్తున్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

అత్యధికంగా పటాన్‌చెరు నియోజకవర్గానికే ఇండ్ల పట్టాలు

- జిల్లాలో 830 మందికి పంపిణీ
- కేసీఆర్, బీఆర్ఎస్‌ను నిండు మనస్సుతో ఆశీర్వదించండి : మంత్రి తన్నీరు హరీశ్‌రావు



నవతెలంగాణ-పటాన్‌చెరు

పేదల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జీ.ఓ నంబర్ 58 ద్వారా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 738 మంది లబ్దిదారులకు మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేతో కలిసి ఇండ్ల పట్టాలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోనే అత్యధికంగా పేదలకు ఇండ్ల పట్టాలు అందించిన నియోజకవర్గం పటాన్‌చెరు అని తెలిపారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా పూర్తి పారదర్శకతతో పట్టాలు పంపిణీ చేశామన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులకు మంత్రి అభినందనలు తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో 830 మందికి జీఓ నంబర్ 58 ద్వారా ఇండ్ల పట్టాలు పంపిణీ చేశామని చెప్పారు. ఇండ్ల పట్టాలు తీసుకున్నవారు నేటి నుంచి ఇంటి యాజమానులుగా మారారని ఆనందం వ్యక్తం చేశారు. పేదల కోసం రాష్ట్రంలోనే అత్యధికంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో 13 బస్తీ దవా ఖానాలు ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. రాబోయే నెల రోజుల్లో జీ.ఓ నంబర్ 59 ద్వారా ఇళ్ల పట్టాలు అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీని నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు. సమావేశంలో ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, జిల్లా కలెక్టర్ శరత్ కుమార్, టీఎస్ఎంఐడీసీ చైర్మెన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ ప్రభాకర్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మున్సిపల్ చైర్మెన్లు, కార్పొరేటర్లు, అన్ని స్థాయిల ప్రజాప్రతినిధులు, లబ్దిదారులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు సాధనే లక్ష్యం

ఆర్టీసీ పరిరక్షణే ధ్యేయం


- ఓలా, ఉబర్‌కు అడ్డుకట్టేసి.. కేరళ తరహా యాప్ తేవాలి
- ఎంవీ యాక్ట్-2019ను సవరించాలి
- కార్మికులపై ఓవర్ లోడ్ పెనాల్టీ భారాలు తగ్గించాలి
- నేడు నగరంలోకి రవాణారంగ కార్మికుల సంఘర్ష యాత్ర

ఓవర్ లోడ్ పెనాల్టీలను తగ్గించాలి
డి.కిషన్- సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు



రవాణారంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి. మోటార్‌వాహన చట్టాన్ని సవరించాలి. పెంచిన ఓవర్ లోడ్ పెనాల్టీలను తగ్గించాలి. కార్మికులు కోరిన చోట పార్కింగ్, అడ్డాలు కేటాయించాలి. ప్రమాదబీమా రూ.10 లక్షలకు పెంచాలి. అర్హులైన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలి. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి :
కె.అజయ్ బాబు, ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు



రవాణ రంగ కార్మికులను ఆదుకునేందుకు తక్షణమే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి. ఎంవీ యాక్ట్-2019ని రద్దు చేసి.. అధిక జరిమానాలు, పెనాల్టీల భారాల నుంచి కార్మికులను కాపాడాలి. కేరళ రాష్ట్రంలోని సవారీ యాప్ తరహా యాప్‌ను దేశవ్యాప్తంగా తేవాలి. ఆర్టీసీ కార్మికోద్యమంపై ఆంక్షలు ఎత్తివేయాలి. పెంచిన ఓవర్ లోడ్ పెనాల్టీ తగ్గించాలి. కార్మికులు కోరినచోట పార్కింగ్ స్థలాలు కేటాయించాలి.

నవతెలంగాణ-సిటీబ్యూరో

సమాజ కదలికకు కీలకమైన రవాణారంగం నిర్లక్ష్యానికి గురవుతోంది. రవాణారంగ కార్మికులు నిత్యం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడు తున్నారు. ప్రత్యేకంగా మోటార్ వాహన చట్టం-2019 వచ్చిన తర్వాత కార్మికుల మీద ఏదో ఒక పేరుతో జరిమానాలు, చలాన్‌లు విపరీతంగా వసూలు చేస్తున్నారు. ఇదో రకమైన దోపిడే. ఉదాహరణకు ఒక గూడ్స్ డ్రైవర్ కిరాయి రూ.20వేలు మాట్లాడుకుంటే.. ఓవర్‌లోడ్ పేరుతో రూ.27 వేల నుంచి లక్ష వరకు జరిమానా వేస్తున్నారు. ఇదిలావుంటే ప్రయివేటు అగ్రిగేటర్స్ సంస్థల దోపిడీ విచ్చలవిడిగా సాగుతోంది. దీని నుంచి కార్మికులను కాపాడాలంటే ఓలా, ఉబర్ ట్యాక్సీ ఆధారిత సంస్థలను రద్దు చేసి.. కేరళ ప్రభుత్వం అమలు చేస్తున్న 'సవారీ' తరహాలో ఇక్కడ ఒక యాప్ తీసుకురావాలి.

హైదరాబాద్ నగరంలో ప్రత్యేకించి మెట్రోసిటీ, పలు కార్పొరేషన్లలో వెహికల్ పార్కింగ్ స్థలాలు లేక అనేక మంది కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జీహెచ్ఎంసీ, రవాణాశాఖ, పోలీస్ ట్రాఫిక్ విభాగం స్థలాలు గుర్తించి కార్మికులకు అనువైన చోటు కేటాయించాలి. ఎంవీ యాక్ట్‌తో సాధారణ డ్రైవర్ పెనాల్టీతో ఇబ్బంది పడుతుంటే, ఆర్టీసీ కార్మికులు ప్రభుత్వ ఉదాసీనత వల్ల ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉన్నది. ఆర్టీసీలో యూనియన్లు అనుమతించకపోవడం ప్రజాస్వామ్య విరుద్ధమైన చర్య. అలాగే ఆటో కార్మికులకు నూతన పర్మిట్లు ఇవ్వాలి. ఈ నేపథ్యంలో రవాణా కార్మికుల రక్షణకు సంక్షేమ బోర్డు ఏర్పాటు తక్షణ అవసరం. దీని సాధనే లక్ష్యంగా తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రయివేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్(ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్-సీఐటీయూ) 'సంఘర్ష యాత్ర' మొదలుపెట్టింది. ఈనెల 3న ఖమ్మంలో ప్రారంభమైన ఈ యాత్రకు కార్మికులు, ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. యాత్ర నేడు హైదరాబాద్‌లోకి ప్రవేశిస్తుంది.

12లక్షల మందికి బెనిఫిట్

రాష్ట్రంలో సుమారు 20లక్షల మందికిపైగా కార్మికులు రవాణా రంగంలో పనిచేస్తున్నారు. ఇందులో 12 లక్షల మంది సంక్షేమ బోర్డు పరిధిలోకి రారు. ఫలితంగా వీరు చిన్న ప్రమాదం జరిగి గాయపడినప్పుడు సొంత ఖర్చులతో వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఉంది. ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ ఆలిండియా కమిటీ 2006 అప్పటి ప్రధానికి ఇచ్చిన వినతిపత్రం మేరకు.. వి.వి.గిరి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ సంస్థ సిఫార్సుల మేరకు దేశవ్యాప్త సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని చెప్పింది. అంతేగాక ఒక్క కార్మికుడు పనిచేస్తున్న చోట కూడా సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయాలని సూచించింది.

15ఏండ్లు గడిచినా అవి అమలుకు నోచుకోవడం లేదు. కేరళలోని వామపక్ష ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, కార్మికుల సంక్షేమానికి పాటుపడు తున్నది. తెలంగాణ లోనూ ఆ తరహా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆదాయం..జరిమానాలకే

వాస్తవానికి రవాణారంగం రాష్ట్రాల పరిధిలోనిది. కానీ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మోటార్ వాహన చట్టం-2019 అమలులోకి వచ్చిన దగ్గర నుంచి రవాణా కార్మికులకు వచ్చే కాసింత ఆదాయం కూడా పెనాల్టీలు, జరిమానాల పేరుతో లాగేసుకుంటుంది. పెనాల్టీలను, పర్మిట్‌లను పెంచడం ద్వారా ప్రమాదాలను తగ్గిస్తామని చెప్పి.. ఎలాంటి మౌలిక సౌకర్యాలూ కల్పించడకుండా.. సాధారణ వాహన యజమాని, కార్మికుడు భరించలేనంత స్థాయిలో రూ.వెయ్యి నుంచి లక్ష వరకు ఫైన్‌తో పాటు మూడేండ్ల జైలు శిక్ష విధిస్తున్నారు. సిగ్నల్ జంప్, స్టాప్‌లైన్ దాటితే, తప్పు ఓవర్ టెక్ వంటి వాటికి పదివేల ఫైన్ వేస్తుండటం గమనార్హం.

పెను ప్రమాదంలోకి ఆర్టీసీ

మోటార్ వాహన చట్టం-19 వచ్చిన తర్వాత ఆర్టీసీ సంస్థ పెను ప్రమాదంలోకి వెళ్లింది. పర్మిట్ విధానంలో మార్పులు చేస్తూ కాంట్రాక్ట్ క్యారేజీ, స్టేజ్ క్యారేజీలుగా ఉన్న పర్మిట్‌లను నేషనల్ పర్మిట్‌గా మార్పు చేసి.. ప్రయివేటు వాహన యజమానులకు కూడా ఆర్టీసీలాగే నడుపుకునే అవకాశం కల్పించింది. ఫలితంగా ఆర్టీసీకి మరణ శాసనంగా మారింది. ఆర్టీసీ యాక్ట్ 1950 ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 1:2 రేషియోలో మూలధన పెట్టుబడి పెట్టాలి. కానీ 1988 నుంచి ఇవ్వడం లేదు. పైగా ఆర్టీసీ ఇస్తున్న సబిడీలనూ పూర్తిగా చెల్లించడం లేదు.

ఆర్టీసీలను ప్రజా రవాణా సంస్థలుగా కాకుండా లాభనష్టాల ప్రతిపాదికన చూస్తున్నారు. మరోవైపు పెద్దఎత్తున అద్దె బస్సుల సంఖ్య అంతకంతకు పెంచుతున్నారు. ఈ క్రమంలో ఆర్టీసీని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ప్రజలందరిపై ఉంది. అదే సమయంలో ఆర్టీసీలో 2019 నుంచి కార్మికోద్యమంపై రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించి తానేమీ తక్కువ కాదంటోంది. ఆర్టీసీలో యూనియన్లు ఎత్తేసిన తర్వాత కార్మికులపై యాజమాన్యం విపరీతంగా పనిభారం పెంచిందని వారు చెబుతున్నారు. సెలవులు ఇవ్వడం లేదు. వేధింపులు పెరిగిపోతున్నాయని కార్మికులు వాపోతున్నారు.

'సవారీ' యాప్‌ను దేశమంతటా అమలు చేయాలి

ప్రయివేటు అగ్రిగేటర్స్ సంస్థల దోపిడీ నుంచి కేరళ రాష్ట్ర ప్రజలను కాపాడటం కోసం ఆ రాష్ట్ర ప్రభుత్వం 'సవారీ' యాప్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నది. త్వరలో రాష్ట్రమంతా విస్తరించబోతున్నది. ప్రస్తుతం ఓలా, ఊబర్ సంస్థలు రాష్ట్రంలో 35శాతం కమీషన్ తీసుకుంటుండగా.. కేరళలో 8శాతమే కమీషన్‌గా తీసుకుంటున్నాయి. అలా తీసుకున్నదాంటో 6శాతం కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేస్తుండగా.. 2శాతం యాప్ నిర్వహణ కోసం కేటాయించారు. దీంతో పాటు డ్రైవర్, ప్రయాణికుల రక్షణకు అనేక ఫీచర్స్ అక్కడి ప్రభుత్వం తీసుకువచ్చింది. దేశవ్యాప్తంగా ఇటువంటి వ్యవస్థను తీసుకొస్తే ఆ కమిషన్‌ను కనిష్ఠ స్థాయికి తగ్గించవచ్చు. తద్వారా రవాణా కార్మికులకు మేలు చేయవచ్చు. ప్రస్తుతం ప్రభుత్వం క్యాబ్ డ్రైవర్లకు ఎదైనా యాప్ రూపొందించే వరకు ఓలా, ఊబర్ యాప్ ఆధారిత కంపెనీలు తీసుకుంటున్న కమీషన్‌ను 35శాతం నుంచి 5శాతానికి తగ్గించి తీసుకునేలా చర్యలు తీసుకోవాలి.

విద్యార్థినుల పర్సనల్ డేటా హ్యాక్ ... నిందితుడి అరెస్ట్..?

నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ పరిధిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులను వేధించిన కేసులో నిందితుడు ప్రదీప్‌ను రాచకొండ సైబర్‌క్రైమ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. విద్యార్థినిల ఫొటోలు మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేస్తున్న సంఘటనపై విద్యార్థినులు కళాశాల ఎదుట ఆందోళన చేసిన విషయం విదితమే. తక్షణమే పోలీసులు రంగంలోకి దిగి నిందితున్ని విజయవాడలో అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. రెండు నెలలుగా 8 మంది విద్యార్థినుల ఫొటోలను మార్ఫింగ్ చేసిన ప్రదీప్ బ్లాక్‌మెయిల్ చేస్తున్నట్టు బాధితులు ఆరోపించారు. కళాశాల హాస్టల్ వార్డెన్‌కు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫొటోలు మార్ఫింగ్ చేయడమే కాకుండా విద్యార్థినుల సెల్‌ఫోన్‌లోని పర్సనల్ డేటా మొత్తాన్ని నిందితుడు హ్యాక్ చేసినట్టు తెలిసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడితోపాటు మరో ఇద్దరి ప్రమేయం ఉన్నట్టు సమాచారం. ఈ ఘటన నేపథ్యంలో విద్యార్థులకు కళాశాల యాజమాన్యం ముందే సంక్రాంతి సెలవులను ప్రకటించింది.

కేసీఆర్ ఫిరాయింపులకు సమాధి కట్టాలి

టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి

- పార్టీ మారిన 12 మంది ఎమ్మెల్యేలపై..
- మొయినాబాద్ పోలీసుస్టేసన్‌లో ఫిర్యాదు



నవతెలంగాణ-మొయినాబాద్

సీఎం కేసీఆర్ చరిత్ర హీనుడని, ఆయన చేపట్టిన ఫిరాయింపులకు సమాధి కట్టాలని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి సీఎం కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ నుంచి గెలిచి బీఆర్ఎస్‌లో చేరిన 12 మంది ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతో కలిసి రేవంత్‌రెడ్డి మొయినాబాద్ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఏసీపీ, సీఐలు అందుబాటులో లేకపోవడంతో ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ పరిపాలనపైన దృష్టి పెట్టకుండా పార్టీ ఫిరాయింపులనే ప్రాతిపదికన పెట్టుకొని ప్రతిపక్షాలను నిర్వీర్యం చేశారన్నారు. 2014 నుంచి 2018 వరకు ప్రతిపక్ష పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలను సంతలో పశువుల లాగా కొనుగోలు చేశాడని విమర్శించారు. నయానా భయానా ఆశలు చూపి, మంత్రి పదవి ఇవ్వడం, కాంట్రాక్టులు అప్ప చెప్పడం ద్వారా పార్టీలోకి తీసుకున్నారఅన్నారు. సీఎల్పీ నాయకులు భట్టి విక్రమార్క శాసనసభలో.. ఫిరాయింపులను ప్రోత్సహించడం మానేసి రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు కృషి చేయాలని పదేపదే సీఎం కేసీఆర్‌ను హెచ్చరించినా పేడ చెవిన పెట్టారని తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డ ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించి, ఆయా నియోజకవర్గాల్లో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని గతంలో ఫిర్యాదు చేసినట్టు గుర్తు చేశారు. ఆ ఫిర్యాదులను పట్టించుకోకుండా తత్సర్యం చేసి 12 మంది ఎమ్మెల్యేలు ఫిరాయింపులకు ఒప్పుకున్న తర్వాత 12 మంది శాసనసభ్యులను స్పీకర్ నిబంధనలు ఉల్లంఘించి బీఆర్ఎస్‌లో విలీనం చేస్తున్నామని ప్రకటించారని అన్నారు. పార్టీలో చేరిన సబితాఇంద్రారెడ్డికి మంత్రి పదవి, రేగా కాంతారావుకి విప్ పదవి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డికి మూసి రివర్ డెవలప్‌మెంట్ చైర్మెన్ పదవి ఇచ్చారని, వీరే కాక మిగతా తొమ్మిది మంది ఎమ్మెల్యేలకు ఆర్థిక ప్రయోజనాలు, కాంట్రాక్టులు ఆశ చూపారని చెప్పారు. బీజేపీ ఎమ్మెల్యేల కొనుగోలు విషయంలో కూడా కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన వారే ఉన్నారని అన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు అంశం రాష్ట్ర ప్రభుత్వం సిట్‌కు అప్పగిస్తే, బీజేపీ కోర్టును ఆశ్రయించి సీబీఐకి అప్పగించేలా చేసిందన్నారు. పార్టీ మారిన 12 మంది ఎమ్మెల్యేలు సీఎం కేసీఆర్ ద్వారా లబ్ది పొందారని, వారికి సంబంధించిన వివరాలను పోలీసులకు అందజేసినట్టు తెలిపారు. వారు సీబీఐకి ఆ వివరాలను బదిలీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం


ప్రజల బుర్రలను మ్యూట్‌లో పెట్టగలరా?

అదేమిటో..! మాట్లాడుకోవడానికి ఏ సమస్యలూ లేనట్టు మనం మతాల గురించీ, మందిరాల గురించీ, దేవుళ్ల గురించీ, వారి పుట్టుకల గురించీ మాట్లాడుకుంటున్నాం... కాదు కాదు పోట్లాడుకుంటున్నాం. ప్రతిరోజూ, ప్రతిచోటా ఇప్పుడు ఎక్కడ చూసినా ఇదే తంతు..! మైండ్‌ను మ్యూట్‌లో పెట్టి ట్రెండ్‌ను ఫాలో అవడమంటే ఇదేనేమో..!! ఇందుకు మన

> సమస్త ప్రజల జీవితాలు సమస్యలతో సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుండగా, దేవుళ్లు, మతాల గురించిన వాదనలు ఎవరికి ఉపయోగపడతాయో తెలుసుకుని మెళుకువతో వ్యవహరించాలి. మతమౌఢ్యం సమాజాన్ని చీకట్లోకి నెడుతున్న వేళ... వెలుతురులోకి లాగే ఉక్కు పిడికిళ్లు కావాలిప్పుడు. దేశమంతా అబద్ధాల ఊబిలో కూరుకుపోతున్న వేళ... అవసరమైన నిజాలను ప్రజలకు వినిపించే బలమైన గొంతులు కావాలిప్పుడు...

తెలంగాణమూ మినహాయింపు కాదని ఇటీవలి కొన్ని పరిణామాలు తెలియజేస్తున్నాయి.

త్రిపురలో కమ్యూనిస్టుల మీద, కాంగ్రెస్ మీద వీరంగమాడుతూ... "2024 జనవరి 1 కల్లా అయోధ్యలో రామాలయం సిద్ధమవుతోంది జాగ్రత్త" అంటూ ఓ హెచ్చరికలాంటి వ్యాఖ్య చేశారు అమిత్‌షా! అంతేనా... ఆలయ ప్రారంభం తరువాత అక్కడి నుండే తమ ప్రధాని ఎన్నికల ప్రచారం మొదలుపెడతారని కూడా సెలవిచ్చారాయన. ఓ ఎన్నికల ర్యాలీలో ప్రజల సమస్యల గురించో, ప్రభుత్వ విధానాల గురించో మాట్లాడకుండా ఆయన ఈ వ్యాఖ్యలకు పాల్పడటం దేనికి సూచిక? బహుశా రాహుల్ గాంధీకీ ఆచార్య సత్యేంద్ర దాస్ అందించిన ఆశీస్సులు వారిని కలవరపరుస్తున్నట్లున్నాయి! ఎందుకంటే ఆచార్య సత్యేంద్ర దాస్ స్వయాన అయోధ్య రామమందిర ప్రధాన అర్చకులు మరి. "భారత్ జోడో యాత్ర" ఉత్తరప్రదేశ్‌లోకి ప్రవేశించిన సందర్భంగా ఈ పరిణామం చోటు చేసుకున్నది. "ప్రజలందరి క్షేమం - ప్రజలందరి సౌఖ్యం కోసం మీరు తలపెట్టిన ఈ యాత్రకు రామచంద్రుని కృపాకటాక్షాలతో శుభం కాలుగాక" అని ఆయన రాహుల్‌ను అభినందించి ఆశీర్వదించారు. సహజంగానే ఇది "పరివారానికి" మింగుడుపడని అంశం. స్వయంగా రామమందిర ప్రధాన పూజారి ఈ యాత్ర దేశం కోసం, ప్రజల కోసం అని ధృవీకరించడం, పైగా ఈ "పరివారం" తమ హక్కుగా భావిస్తున్న రాముడి కృపను రాహుల్‌కు ప్రసాదించడం సాధారణ విషయమేం కాదు. అందుకే ఈ నష్టనివారణ వ్యాఖ్యలు కాబోలు..!



ఎప్పుడైనా ఎక్కడైనా తమ ఎన్నికల ప్రచారానికి మందిరాలు, మత సమీకరణలే అజెండా తప్ప, ప్రజల జీవితాలు కాదని ఈ వ్యాఖ్యలు మరోసారి రుజువు చేస్తున్నాయి. ఎనిమిదిన్నరేండ్లుగా తమది తిరుగులేని పాలన అని విర్రవీగుతున్న వీరు, ఇంకా ఓట్ల కోసం రాముడి మీదే ఆధారపడకతప్పని బలహీనతను సైతం ఇది సూచిస్తున్నది. ప్రజల మనసులు గెలవడానికి వీరు ఇంకా రాముడి పైనే ఆధారపడటం వైచిత్రి! కాంగ్రెస్ సహా ఇతర బూర్జువా ప్రతిపక్ష పార్టీలేవీ వీరి విధానాలకు నికరమైన ప్రత్యామ్నాయాలు నిర్మించకపోగా, ఓ సైద్ధాంతిక భూమిక అంటూ లేకుండా తాము కూడా అదే రీతిలో వ్యవహరిస్తున్నాయి. ఫలితంగా ప్రజా సమస్యలేవీ అసలు అజెండాలోకే రాకుండాపోయి మత రాజకీయాలే దేశాన్ని ఆవహిస్తున్నాయి. ఇదే సమయంలో తెలంగాణలో కూడా కొందరి వ్యాఖ్యానాలు చర్చనీయాంశం కావడం గమనార్హం. సమకాలీన వాస్తవికతను గుర్తించకుండా చేసే ఇలాంటి వ్యాఖ్యలు ఎవరు చేసినా అది మతోన్మాదులకే ప్రయోజనమన్న సంగతి విస్మరించకూడదు.

సమస్త ప్రజల జీవితాలు సమస్యలతో సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుండగా, దేవుళ్లు, మతాల గురించిన వాదనలు ఎవరికి ఉపయోగపడతాయో తెలుసుకుని మెళుకువతో వ్యవహరించాలి. అందువల్ల కేవలం తెలిసింది మాత్రమే మాట్లాడితే సరిపోదు. తెలివితో మాట్లాడటం కూడా తెలియాలి. మనం ఏం కొనాలో ఎలా బతకాలో మార్కెట్ నిర్ణయిస్తున్నట్టే, ఏం మాట్లాడాలో ఏం మరిచిపోవాలో ఈ మత రాజకీయం నిర్దేశిస్తున్నది. నేడు మన ప్రతి కదలికా వెనుక నుండి ఎవరో తోస్తున్నదేనన్న ఎరుకలో ఉండాలి. ఇప్పుడు దేశంలో 65కోట్ల మంది భారతీయులు 25ఏండ్లలోపు వారు. వీరి చైతన్యం, కార్యాచరణలను నిర్వీర్యం చేయడమేకాదు, ఈ యువతరం విద్యా ఉపాధి అవకాశాల గురించి ఏమాత్రం పట్టించుకోని ఈ ప్రభుత్వం, లక్షల కోట్ల ప్రజాధనాన్ని తన సంపన్న మిత్రులకు అప్పనంగా వడ్డిస్తోంది. కేవలం ఈ నాలుగేండ్లలోనే ఈ కార్పొరేట్ల కోసం బ్యాంకులు వదిలేసుకున్న భారీ సొమ్ము అక్షరాల పది లక్షల కోట్లకు పై మాటే! మోడీ సర్కార్ తన స్నేహితులకు కానుకగా ఇచ్చిన ఈ సొమ్ముతో ఎన్ని పాఠశాలలు, ఆసుపత్రులు నిర్మాణమయ్యేవో కదా..! దీని గురించి మాట్లాడాలి.

వైద్యం ఎందుకు ఖరీదయిందో, చదువులు ఎందుకు భారమవుతున్నాయో అడగాలి. అధికారంలోకొస్తే ప్రతి అకౌంట్‌లో పదిహేను లక్షలు వేస్తామన్న వాగ్దానం ఏమయిందో, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామన్న హామీ ఏమయిందో నిగ్గదీయాలి. చాలీచాలని జీతాలతో రోజుకు 12గంటలకు పైగా ఏ హక్కులూ లేకుండా పనిచేస్తున్న అసంఖ్యాకమైన జీవితాల గురించి ప్రశ్నించాలి. మతమౌఢ్యం సమాజాన్ని చీకట్లోకి నెడుతున్న వేళ... వెలుతురులోకి లాగే ఉక్కు పిడికిళ్లు కావాలిప్పుడు. దేశమంతా అబద్ధాల ఊబిలో కూరుకుపోతున్న వేళ... అవసరమైన నిజాలను ప్రజలకు వినిపించే బలమైన గొంతులు కావాలిప్పుడు...

పాలస్తీనా ప్రయోజనాలకు భారత్ చెల్లు చీటీ

పాలస్తీనా భూభాగాలను ఇజ్రాయిల్ సుదీర్ఘకాలం ఆక్రమించుకోవడం వల్ల తలెత్తే చట్టపరమైన పర్యవసానాలపై అభిప్రాయాన్ని తెలియచేయాల్సిందిగా అంతర్జాతీయ న్యాయ స్థానాన్ని (ఐసిజె) కోరుతూ డిసెంబరు 31, 2022న ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఆ తీర్మానంపై ఓటింగ్‌కు భారత్ గైర్హాజరైంది. తీర్మానానికి 87 దేశాలు మద్దతు ఇవ్వగా, 26 దేశాలు వ్యతిరేకించాయి. భారత్ సహా 52 దేశాలు గైర్హాజరయ్యాయి.

పవిత్ర నగరమైన జెరూసలేం హోదా, స్వభావం, జనాభా కూర్పును మార్చడానికి ఉద్దేశించిన చర్యలతో సహా ఇజ్రాయిల్ ఆక్రమణ, సెటిల్‌మెంట్, కలుపుకోవడం వంటి చట్టపరమైన పర్యవసానాల గురించి... అలాగే సంబంధిత వివక్షాపూరిత చట్టాలు, చర్యలను ఇజ్రాయిల్ ఆమోదించడం గురించి...ఈ తీర్మానం పేర్కొంది. ఈ తీర్మానానికి ఓటు వేయకుండా ఉండడం ద్వారా... పాలస్తీనా ప్రయోజనాలకు, రెండు దేశాల ఏర్పాటు పరిష్కారానికి గట్టిగా మద్దతిస్తూ సుదీర్ఘకాలంగా అనుసరిస్తూ వచ్చిన వైఖరిని విడనాడినట్లు భారత్ సంకేతాలు ఇచ్చింది. 1967లో యుద్ధం జరిగినప్పటి నుండి వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలేం, గాజా ప్రాంతాల్లో ఇజ్రాయిల్ ఆక్రమణ కొనసాగుతూ వస్తోంది. అప్పటి నుండి, ఈ ఆక్రమణ చర్యలకు అంతం పలకాలని కోరుతూ ఐక్యరాజ్య సమితి పలుసార్లు తీర్మానాలు చేసినప్పటికీ, వెస్ట్ బ్యాంక్‌లో యూదు ఆవాసాల ఏర్పాటును ఇజ్రాయిల్ నిలకడగా అనుమతిస్తూనే వస్తోంది. తూర్పు జెరూసలేంలో పాలస్తీనా ఆవాస ప్రాంతాలను ధ్వంసం చేస్తూనే ఉంది. మొత్తంగా అక్కడ జనాభా పొందికను మార్చేందుకు ప్రయత్నిస్తూనే ఉంది.

> నిర్వాసితులవడం, వలసవాద ఆక్రమణలు వంటి కష్టాలను పాలస్తీనా ప్రజలు ఏడు దశాబ్దాలకు పైగా అనుభవిస్తూనే ఉన్నారు. 1948లో ఏడు దశాబ్దాలకు పైగా వారిని వారి మాతృభూమి నుండి బహిష్కరించినప్పటి నుండి వారిలో లక్షలాదిమంది పాలస్తీనా వెలుపల శరణార్థులుగానే జీవించారు. సైనిక ఆక్రమణ కింద వారిని లొంగ తీసుకున్నారు. మన స్వాతంత్ర్యోద్యమ పోరాట కాలం నుండి, పాలస్తీనా ప్రజల పట్ల భారత్ సంపూర్ణ సానుభూతితో, సంఘీభావంతో వ్యవహరిస్తూనే వచ్చింది. కానీ, ఇప్పుడు బీజేపీ పాలకుల ఈ హిందూత్వ దృక్పథం ఈ పరాక్రమవంతులను అణచివేసే వారి పక్షాన భారతదేశాన్ని నడిపిస్తోంది.

మొత్తంగా జెరూసలేం, వెస్ట్ బ్యాంక్ ప్రాంతాల్లో నివసిస్తున్న పాలస్తీనియన్లను పారదోలడం ద్వారా లేదా ఇజ్రాయిల్ పౌరులుగా కాకుండా వర్ణ వివక్ష పరిస్థితుల్లో జీవించేలా వారిపై ఒత్తిడి తీసుకురావడం ద్వారా ఆ

> ఈ అంశంపై భారత్ వెనుకడుగు వేయడానికి కారణం ఇజ్రాయిల్‌తో వ్యూహాత్మక సంబంధాలకు ప్రాధాన్యత ఇస్తుండడమే. అందువల్లే పాలస్తీనా ప్రయోజనాల విషయంలో మెతక వైఖరి అనుసరిస్తోంది. ఇజ్రాయిల్‌తో మోడీ ప్రభుత్వానికి పెరుగుతున్న సన్నిహిత సంబంధాలు అందరికీ తెలిసిన విషయమే. గతంలో ప్రధానిగా ఉన్నప్పుడు నెతన్యాహు, మోడీకి చాలా సన్నిహితుడు. సైద్ధాంతికంగా వారిద్దరూ సహచరులే. పాలస్తీనియన్లు, అరబ్బుల పట్ల యూదు శతృత్వానికి ఆర్ఎస్ఎస్-బీజేపీలు అభిమానులు. అమెరికా ప్రణాళిక ప్రకారమే, పశ్చిమాసియాలోని ఐ2యు2 (భారత్, ఇజ్రాయిల్, యుఎఇ, అమెరికా) ఫోరంలో భారత్ చేరింది.

ప్రాంతాలను కూడా తమలో కలిపేసుకోవాలన్నది ఇజ్రాయిల్ ప్రణాళికగా ఉంది. భూ ఆక్రమణల ద్వారా తూర్పు జెరూసలేంను బహిరంగంగానే కలిపేసుకోవడంతో ఆ నగర యథాతథ పరిస్థితి మారింది. ఇజ్రాయిల్ 'శాశ్వత రాజధాని'గా జెరూసలేం ఉంటుందని ప్రకటించింది. వెస్ట్ బ్యాంక్‌లోని పాలస్తీనా భూభాగాల్లో 5లక్షల మంది యూదులు నివాసం ఇచ్చింది.

యూదు ఆవాసాలను ఏర్పాటు చేసేందుకు పాలస్తీనా భూభాగాలను, ఆలివ్ తోటలను ఆక్రమించుకోవడంలో, బుల్డోజర్లతో పాలస్తీనియన్ల గృహాలను ధ్వంసం చేయడంలో, ఈ అణచివేత చర్యలను ప్రతిఘటించిన వారినెవరినైనా ఆరెస్టులు చేయడంలో కిరాతకమైన వలసవాద పాలన జోక్యం



ఏర్పరచుకోవడానికి ఇజ్రాయిల్‌లో వరుసగా వచ్చిన ప్రభుత్వాలు అవకాశం కల్పిస్తూవచ్చాయి. గాజా స్ట్రిప్‌లో నివసిస్తున్న దాదాపు 20లక్షల మంది పాలస్తీనియన్లు జైళ్ళలో ఉన్నటువంటి పరిస్థితుల్లో అక్కడ జీవిస్తున్నారు. వారు తరచుగా వైమానిక బాంబు దాడులకు, దిగ్బంధనాలకు గురవుతూనే ఉన్నారు. పాలస్తీనా ఎన్‌క్లేవ్‌లతో వెస్ట్ బ్యాంక్‌ను వేరు చేస్తూ నిర్మించిన గోడ వర్ణ వివక్ష వ్యవస్థను స్థాపించింది. గత రెండేండ్లలో, వెస్ట్ బ్యాంక్‌ను కలుపుకునే దిశగా ఇజ్రాయిల్ దేశం సాగుతోంది.

బెంజమిన్ నెతన్యాహు ప్రధానిగా ఇజ్రాయిల్‌లో ఏర్పడిన కొత్త ప్రభుత్వం - వర్ణవివక్షతతో కూడిన యూదు జాతీయ పార్టీలతో, అతి సాంప్రదాయవాద మత గ్రూపులతో ఏర్పడిన అత్యంత మితవాద సంకీర్ణ ప్రభుత్వ వ్యవస్థగా వుంది. "జుడియా, సమారియా (వెస్ట్ బ్యాంక్‌కు బైబిల్ పేర్లు)తో సహా ఇజ్రాయిల్‌లో అన్ని ప్రాంతాల్లో ఆవాసాల నిర్మాణాన్ని అభివృద్ధి పరిచి, ముందుకు తీసుకెళ్ళాలని" సంకీర్ణ పార్టీల ఒప్పందం పేర్కొంది. "సమయం చూసుకుని, ఇజ్రాయిల్ జాతీయ, అంతర్జాతీయ ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకుని" వెస్ట్ బ్యాంక్‌ను కలుపుకునేందుకు కూడా ఈ ఒప్పందం హామీ ఉంది. పైగా, నిరసన లేదా ప్రతిఘటన అనేది ఏ రూపంలో ఉన్నా ఇజ్రాయిల్ సాయుధ బలగాలు కాల్పులతో అడ్డుకుంటాయి. 2022 సంవత్సరంలో వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలేం ప్రాంతాల్లో 171 మంది పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ బలగాలు హతమార్చాయని ఐక్యరాజ్య సమితి పేర్కొంది. వీరిలో 30మందికి పైగా పిల్లలు ఉన్నారు. ఇటువంటి హింసకు సంబంధించి అత్యంత అధ్వాన్నమైన సంవత్సరాల్లో 2022 ఒకటిగా ఉంది. మొత్తంగా 9 వేల మంది గాయపడ్డారు.

కొత్త మితవాద ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న సంకీర్ణ పార్టీల్లో ఒకటైన రిలీజియస్ జియోనిస్ట్ పార్టీలో ప్రధానంగా వెస్ట్ బ్యాంక్ సెటిలర్లే ఉన్నందువల్ల వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనియన్లను మొత్తంగా అణచివేయడానికే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. తీవ్రవాద భావజాలం కలిగిన జూయిష్ పవర్ పార్టీకి చెందిన, జాతీయ భద్రతా వ్యవహారాల మంత్రి ఇత్మార్ బెన్ గివిర్ పాలస్తీనియన్లు, అరబ్బులకు వ్యతిరేకంగా విద్వేష ప్రసంగాలకు పేరొందిన వ్యక్తి. వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ సరిహద్దు పోలీసులను అలాగే పాలస్తీనా ఆవాసాలను ఆయన మంత్రిత్వ శాఖ పర్యవేక్షిస్తుంది.

అందువల్ల, ఆక్రమిత ప్రాంతాల్లో ఇజ్రాయిల్ కొత్త తీవ్రవాద ప్రభుత్వం తన దూకుడు చర్యలను మరింత పెంచేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానం సముచితమైన సమయంలో వచ్చింది. ఏ దేశంలోనైనా అంతర్గత మానవ హక్కుల విషయాలపై బయటి విచారణకు పిలుపిచ్చినా లేదా తాను అంగీకరించని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టుకు సంబంధించిన అంశాలపైనా ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి, ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ చేసిన తీర్మానాలకు భారత్ గతంలో ఎన్నడూ మద్దతివ్వలేదు. కానీ, ప్రస్తుత తీర్మానంపై భారత్ ఇలా గైర్హాజరవడాన్ని సమర్థించడానికి ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేం. అన్నింటికంటే ముందు, ఒక సార్వభౌమాధికార దేశం అంతర్గత వ్యవహారాలకు సంబంధం లేని విషయాన్ని... ఆక్రమిత భూభాగానికి సంబంధించిన విషయాన్ని పరిశీలించాల్సిందిగా ఐసిజెను కోరారు. వెస్ట్ బ్యాంక్, తూర్పు జెరూసలేం రెండూ ఆక్రమిత భూభాగాలేనని భారత్ ఇప్పటికీ భావిస్తూ ఉన్నది. పైగా, ఆక్రమిత పాలస్తీనా భూభాగంలో గోడ నిర్మాణం వల్ల తలెత్తే చట్టపరమైన పర్యవసానాల గురించి 2004లో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ పట్టుబట్టిన మేరకు ఐసిజె తన అభిప్రాయాన్ని వెల్లడించింది.

ఈ అంశంపై భారత్ వెనుకడుగు వేయడానికి కారణం ఇజ్రాయిల్‌తో వ్యూహాత్మక సంబంధాలకు ప్రాధాన్యత ఇస్తుండడమే. అందువల్లే పాలస్తీనా ప్రయోజనాల విషయంలో మెతక వైఖరి అనుసరిస్తోంది. ఇజ్రాయిల్‌తో మోడీ ప్రభుత్వా నికి పెరుగుతున్న సన్నిహిత సంబంధాలు అందరికీ తెలిసిన విషయమే. గతంలో ప్రధానిగా ఉన్నప్పుడు నెతన్యాహు, మోడీకి చాలా సన్నిహితుడు. సైద్ధాంతికంగా వారిద్దరూ సహచరులే. పాలస్తీనియన్లు, అరబ్బుల పట్ల యూదు శతృత్వానికి ఆర్ఎస్ఎస్-బీజేపీలు అభిమానులు. అమెరికా ప్రణాళిక ప్రకారమే, పశ్చిమాసియాలోని ఐ2యు2 (భారత్, ఇజ్రాయిల్, యుఎఇ, అమెరికా) ఫోరంలో భారత్ చేరింది.

ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ తీర్మానాన్ని ఆమోదించడానికి ఒక రోజు ముందే నెతన్యాహు ప్రభుత్వం అధికార బాధ్యతలను చేపట్టింది. ఇక్కడ తీర్మానంపై ఓటింగ్‌లో భారత్ గైర్హాజరవడం అంటే నెతన్యాహు ప్రభుత్వం పట్ల సుహృద్భావాన్ని ప్రదర్శించడంగా చూడవచ్చు.

నిర్వాసితులవడం, వలసవాద ఆక్రమణలు వంటి కష్టాలను పాలస్తీనా ప్రజలు ఏడు దశాబ్దాలకు పైగా అనుభవిస్తూనే ఉన్నారు. 1948లో ఏడు దశాబ్దాలకు పైగా వారిని వారి మాతృభూమి నుండి బహిష్కరించినప్పటి నుండి వారిలో లక్షలాదిమంది పాలస్తీనా వెలుపల శరణార్థులుగానే జీవించారు. సైనిక ఆక్రమణ కింద వారిని లొంగ తీసుకున్నారు. మన స్వాతంత్ర్యోద్యమ పోరాట కాలం నుండి, పాలస్తీనా ప్రజల పట్ల భారత్ సంపూర్ణ సానుభూతితో, సంఘీభావంతో వ్యవహరిస్తూనే వచ్చింది. కానీ, ఇప్పుడు బీజేపీ పాలకుల ఈ హిందూత్వ దృక్పథం ఈ పరాక్రమవంతులను అణచివేసే వారి పక్షాన భారతదేశాన్ని నడిపిస్తోంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)



భీమారంగంలో పోరాట సారథి



జి. కిషోర్ కుమార్
9440905501

"ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్" 26వ అఖిల భారత మహాసభ 2023, జనవరి 8 నుంచి 11 వరకు కలకత్తాలో జరుగుతున్నది. భారత దేశంలో ఇన్సూరెన్స్ వ్యాపారాన్ని సరళీకరించక పోతే భారతదేశంపై సూపర్ 301ఆంక్షలు విధిస్తామని యూఎస్ వాణిజ్య ప్రతినిధి కార్ల హిల్స్ మూడు దశాబ్దాల క్రితం చేసిన ప్రకటనల నుండి నేటి వరకు ప్రభుత్వ బీమారంగాన్ని పరిరక్షించుకునేందుకు, అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడి ఆంక్షల నుంచి కాపాడుకునేందుకు సమరశీల పోరాట సంఘంగా "ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్" చైతన్యవంతమైన ఉద్యమాలను, పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నది.

ముఖ్యంగా బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వ బీమారంగంపై దాడి అధికమైనది. 2014 వరకు 26శాతానికే పరిమితమైన విదేశీ పెట్టుబడిని 2015నాటికి 49శాతానికి పెంచారు. 2021లో బీజేపీ ప్రభుత్వం దానిని 74శాతానికి పెంచింది. గత కొన్ని సంవత్సరాలుగా జాతీయ బీమారంగాన్ని బలహీనపరిచేందుకు ప్రయివేటు బీమారంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పూనుకుంది.

జీవిత బీమా వ్యాపారాన్ని జాతీయం చేయడం కోసం పోరాటాన్ని నడిపిన "ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్" తన సుదీర్ఘ ప్రయాణంలో అనేక ఉద్యమాలతో పాటు విజయాలను సాధించింది. 50వ దశకంలో బీమా ఉద్యోగుల వేతనాల ప్రామాణీకరణ కోసం, 60వ దశకంలో ఉద్యోగ భద్రత కోసం ఆటోమేషన్ వ్యతిరేకంగానూ, 70లో ఎమర్జెన్సీ చీకటి రోజులను ఎదిరించి ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు, ఎల్ఐసి డివిజనల్ ఆఫీసుల లాకౌట్‌కు వ్యతిరేకంగానూ, 80లలో ఎల్ఐసిని ముక్కలుగా విభజించాలని చేసిన ప్రయత్నాలను ప్రతిఘటించడం, నూతన ఆర్థిక సంస్కరణలకు నేపథ్యంగా ఉన్న 90వ దశకం నుండి బీమారంగాన్ని ప్రభుత్వరంగంలోనే కొనసాగించేందుకు నడిపిన ప్రచారాందోళన ఉద్యమాలు, వీటితోపాటుగానే ఉద్యోగుల ఆకాంక్షల మేరకు సంస్థ యొక్క అభివృద్ధితో ముడిపడి ఉండేలా వేతన సవరణలు సాధించి ఉద్యోగుల జీవన ప్రమాణ స్థాయిని నిలబెట్టేందుకు సాగిన ప్రస్థానం నేపథ్యంలో 26వ ఏఐఐఇఏ అఖిల భారత మహాసభలు కలకత్తాలో జరుగుతున్నాయి.

ప్రస్తుతం భారత ప్రజాస్వామ్యం అపహాస్యానికి గురయ్యే పరిస్థితులు పరిణమించాయి. పాలక వర్గాలు నిర్బంధ విధానాలను అనుసరిస్తూ ప్రజల వాక్స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను, రాజ్యాంగం ప్రసాదించిన ప్రజాస్వామిక హక్కులను అడ్డుకుంటున్నాయి. విధానపరమైన అంశాలను, ప్రభుత్వాన్ని విమర్శించే వారిని దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నారు. ఎక్కడైతే ప్రజాస్వామ్య హక్కులు కుదించబడతాయో అక్కడ కార్మిక సంఘం హక్కులు సురక్షితంగా ఉండవనేదే ఏఐఐఇఏ అవగాహన.

కార్మిక సంఘాలు ఉద్యోగ, కార్మికుల ప్రయోజనాల పరిరక్షణకు మాత్రమే పరిమితం కావు. సామాజిక మార్పుకు సాధనాలుగా సమాజంలో పురోగతిని కోరుతూ, పాలకవర్గాల దోపిడీ స్థితిని కొనసాగించే ప్రయత్నాన్ని నిలువరించేందుకు తగిన దిశానిర్దేశం చేస్తాయి. సమాజ మార్పులో అన్ని వర్గాల కార్మికుల సంపూర్ణ భాగస్వామ్యం అనివార్యం. అలాగే ప్రజల మధ్య విశాల ఐక్యత ఆవశ్యకం. ఈ సంక్షిష్ట సమయంలో చైతన్యవంతమైన ఉద్యోగవర్గంగా మొత్తం కార్మిక వర్గాన్ని ఐక్యం చేసే పని వేగవంతం చేయాలి.

భారత దేశ బీమా రంగంలో ప్రయివేటు, విదేశీ కంపెనీలను అనుమతించి 20సంవత్సరాలు అవుతున్నప్పటికీ 23 ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలతో పోటీపడి 63.25శాతం ప్రీమియం ఆదాయంను 74.62శాతం మేరకు పాలసీలను కైవసం చేసుకుని ప్రభుత్వ రంగ ఎల్ఐసి ఇన్సూరెన్స్ మార్కెట్ లీడర్‌గా కొనసాగటంలో, క్లెయిముల చెల్లింపు అంశంలోనూ, ఎక్కువ మొత్తం పాలసీదారులు కలిగి ఉన్న విషయంలోనూ ప్రపంచంలోనే ఎల్ఐసి అతి పెద్ద సంస్థగా ఆవిర్భవించటంలోనూ ఏఐఐఇఏ మార్గదర్శకత్వం ప్రసంశనీయం.

2021-22 ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసి మొత్తం ఆదాయం 7,21,102.57 కోట్లు, మొత్తం ప్రీమియం ఆదాయం 4,27,419.22 కోట్లుగా నమోదుచేసి పట్టాదారులకు 3,57,464.90 కోట్లు చెల్లింపులను చేసింది. ఎల్ఐసి మొత్తం ఆస్తుల విలువ 42,30,616.95 కోట్లుగానూ, లైఫ్ ఫండ్ 37,35,759.72 కోట్లను కలిగి ఉంది. ఇది ప్రపంచంలో అనేక దేశాల ఆర్థిక వ్యవస్థల జీడీపి కన్నా ఎక్కువన్నది గమనార్హం.


ఎల్ఐసి ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలను తీసుకురావడంలో ఏఐఐఇఏ సాధించిన విజయాలు ఉద్యోగస్తులను ఉదాసీనతా వైఖరికి గురిచేయకూడదు. ఇప్పటికే ఎల్ఐసిలో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ రూపంలో 3.5శాతం వాటాలను అమ్మడమైనది. ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఐఆర్‌డిఏ) నియమ నిబంధనల పేరుతో ప్రభుత్వ ఇన్సూరెన్స్ రంగాన్ని బలహీనపరిచే అనేక ప్రతిపాదనలు ప్రభుత్వం ముందుకు తెస్తోంది. జాతీయ ఇన్సూరెన్స్ రంగాన్ని బలహీన పరచడానికి అనుగుణంగా అనేక చట్టాలను ప్రభుత్వం సవరించింది.

ప్రతికూల ఆర్థిక పరిస్థితులలో ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలతో పోటీని ఎదుర్కొని ఇప్పటికీ మార్కెట్‌లో లీడర్‌గా కొనసాగుతున్న ప్రభుత్వరంగ ఇన్సూరెన్స్ కంపెనీలవృద్ధిని నియంత్రించే విధంగా నిబంధనలు రూపొందించబడుతున్నాయి. ప్రభుత్వం తీసుకుంటున్న అనేక నిర్ణయాలు ప్రయివేటు బీమా కంపెనీలను ప్రోత్సహించేవిగా ఉంటున్నాయి. వీటినుంచి జాతీయ ఇన్సూరెన్స్ రంగాన్ని కాపాడుకోవాలంటే ప్రభుత్వరంగ ప్రాధాన్యతను, కార్మికవర్గ విశిష్టతను మరింత విస్తృతంగా ప్రజలకు వివరించే ప్రచారోద్యమం నడపాలి.

ఉద్యోగుల స్థానంలో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని హెచ్చుగా వినియోగించే అవకాశాల నుండి ఉద్యోగ భద్రత, ఉపాధి కల్పన దిశగా యాజమాన్యాలు ఆలోచించే విధంగా కార్యాచరణ రూపొందించాల్సిన తరుణమిది. కార్మిక చట్టాలను, లేబర్ కోడ్‌లుగా మార్పులు చేసి కార్మిక హక్కులు హరిస్తున్న ప్రస్తుత పరిణామక్రమంలో, త్యాగాల చరిత్రను నిలుపుకునే నిబద్ధతను పాదుగొల్పే ప్రణాళికలు రూపుదిద్దుకోవాలి. నిర్బంధాలను నిరసించే పోరాట శంఖారావాన్ని పూరించే వేదికగా ఏఐఐఇఏ అఖిలభారత మహాసభల నిర్ణయాలు, తీర్మానాలు ఉంటాయని ఆకాంక్షిద్దాం.

రవాణా కార్మికుల రక్షణకోసం...

రాష్ట్రంలో ఉన్న సుమారు 20 లక్షల మంది రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, ఆర్టీసీ పరిరక్షణ ఈ రెండు ప్రధానమైన డిమాండ్లతో తెలంగాణ పబ్లిక్ & ప్రయివేట్ రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (AIRTWF-CITU) ఆధ్వర్యంలో రవాణా రంగ కార్మికుల సంఘర్ష్ యాత్ర జరుగుతోంది. ఈనెల 3న ఖమ్మం జిల్లాలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఈ యాత్రను ప్రారంభించారు. ట్రాన్స్ పోర్ట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వీరయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్‌లు నాయకత్వం వహిస్తున్నారు. మొత్తం యాత్ర కోఆర్డినేటర్‌గా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ వ్యవహరిస్తున్నారు. యాత్రకు కార్మికులు నుండి పెద్ద ఎత్తున స్పందన వస్తోంది. కార్మికులు తమ తమ వాహనాలతో స్వాగతం తెలుపుతున్నారు. తమ సమస్యలను వినతి పత్రం రూపంలో అందిస్తున్నారు.



పుప్పాల శ్రీకాంత్

ఆర్టీసీ డిపోల వద్ద, ప్రయివేట్ ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల అడ్డాల వద్ద కార్మికుల్ని కలిసి వారి సమస్యలపై చర్చిస్తున్నది. పర్యటించిన ప్రతి చోట కార్మికులు ప్రధానమైన సమస్యగా పార్కింగ్ అడ్డాలు లేవని చెబుతున్నారు. రోడ్ల మీద వాహనాలు అపి ప్రయాణికులను ఎక్కించుకునే సమయంలో మాకు తెలియకుండానే ఫొటోలు తీసి వేల రూపాయలు పెనాల్టీలు వేస్తున్నారని కార్మికులు తమ గోడు వెళ్ళబోసుకుంటున్నారు. పార్కింగ్ స్థలాలు చూపించాల్సిన బాధ్యత, ప్రజలకు అందుబాటులో రవాణా సౌకర్యాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. వీటిని మరిచి రవాణా రంగాన్ని కేవలం ఒక ఆదాయ వనరుగా మలుచుకొని కార్మికుల వద్ద నుండి వేల రూపాయలు గుంజుకుంటున్నారు. వాస్తవానికి జనసాంద్రత ఉన్నచోటనే బస్టాండ్ ఆవరణలో, రైల్వే స్టేషన్ ఆవరణలో, వ్యాపారాలు జరిగే చోట, షాపింగ్ మాల్స్ వద్ద పార్కింగ్ స్థలాలు కేటాయిస్తేనే ప్రయాణికు లకు సౌకర్యంగా ఉంటుంది. ప్రజా రవాణాతో పాటు సరుకుల రవాణా కూడా సరైన సమయంలో జరుగుతుంది. కానీ ప్రభుత్వం ట్రాఫిక్ జామ్ తదితర కారణాలు చూపి పట్టణానికి అవతల, నగర చివర్లో అడ్డాలు కల్పించడం వల్ల అటు ప్రజలకు, ఇటు కార్మికులకు ఎవరికి ఉపయోగం లేకుండా పోతోంది.

దేశంలో రాష్ట్రంలో సరకు రవాణా 80శాతం రోడ్డు మార్గాన్నే జరుగుతుంది. దీంతో ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయలు ఆదాయం అనేక ట్యాక్స్‌ల రూపాల్లో ఈ కార్మికులు సమకూరుస్తున్నారు. లారీ, ఇతర గూడ్స్ డ్రైవర్లు, సరుకు రవాణా చేసే కార్మికులు పని గంటలతో నిమిత్తం లేకుండా, వాతావరణ పరిస్థితులు సహకరించక పోయినా రోజుల తరబడి కుటుంబాలకు దూరంగా ఉంటూ ఇతర రాష్ట్రాలకు, ఇతర జిల్లాలకు ఇతర ప్రాంతాలకు సరుకులు రవాణా చేస్తేనే ప్రజలకు సమయానికి నిత్యవసర సరుకులు అందుతున్నాయి. కానీ రోడ్ల నిర్మాణం సరిగా లేక ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. 2006లో వి.వి.గిరి నేషనల్ ఇన్స్టిట్యూట్ సంస్థ సర్వే చేసి ఇచ్చిన నివేదిక దూర ప్రాంతాలకు సరుకు రవాణా చేసే కార్మికులకు మార్గ మధ్యలో షెడ్లను ఏర్పాటు చేసి, విశ్రాంతి గదులు ఇవ్వాలని, సబ్సిడీతో భోజన సౌకర్యం కల్పించాలని సూచించింది. ఇవేవీ చేయకపోగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం పుండు మీద కారం చల్లినట్లు మోటార్ వాహన చట్టంతో మొదటికే ఎసరు తెచ్చింది. ఒకటో రెండో వాహనాలున్న చిన్న చిన్న యజమానులను కార్పొరేట్ కంపెనీలో పనిచేసే డ్రైవర్లుగా, కూలీలుగా మార్చే ప్రయత్నం బీజేపీ చేస్తున్నది. ఓనర్లుగా ఉన్నావారు, ఓనర్ కం డ్రైవర్లుగా ఉన్నవారు, తమ వాహనాలన్నీ ఇకపై కార్పొరేట్ కంపెనీల చేతుల్లో పెట్టి వారిచ్చే దయాదాక్షిణ్యాలతో బతకాలని చట్టంలో మార్పు చేశారు. లేదు "నా వాహనం నేనే నడుపుకుంటూ ఎ కంపెనీలో వాహనాన్ని అప్ప చెప్పను." అంటే వాహనం స్టార్ట్ చేసి రోడ్డు మీదకు వెళ్ళిన ఒక్క క్షణం లోనే పోలీసులు అరెస్ట్ చేసి జైల్లో పెడతారు. వాహనాన్ని సీజ్ చేసి గ్యారెజీలో ఉంచుతారు. ఇంతటి దుర్మార్గానికి వొడిగట్టింది. బీజేపీ ప్రభుత్వం.

వేల్ఫర్ బోర్డు లేని కారణంగా వేలాది కార్మికుల కుటుంబాలు రోడ్డున పడతాయి. మహబూబాబాద్ జిల్లాలో యాత్ర పర్యటిస్తున్న సందర్భంగా మా దృష్టికి వచ్చిన ఒక సంఘటనను చూద్దాం... 2022 డిసెంబర్ 31న సాయంత్రం పూట 7 మంది ఆటో డ్రైవర్లు తమ యజమాని దగ్గర జీతం డబ్బులు అడుక్కుందామని ఒకే వాహనంలో బయలుదేరి వెళ్తున్నారు. ప్రమాదవశాత్తు గ్రానైట్ సరఫరా చేస్తున్న వాహనాన్ని ఢీకొని



అక్కడికక్కడే ముగ్గురు డ్రైవర్లు గుర్తుపట్టలేని విధంగా మరణించిన యధార్థ ఘటన మా దృష్టికి వచ్చింది. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాల పరిస్థితి ఏంటి? వారిని ఎవరు ఆదుకోవాలి? మిర్యాలగూడలో మారో సమస్య యాత్ర బృందానికి తెలిపారు. సొంత వాహనం కొందామని ఒక ప్రయివేట్ ఫైనాన్స్ యాజమాన్యం దగ్గర లోన్ తీసుకుని వాహనాలు కొనుగోలు చేసి జీవనం సాగిస్తున్నారు. కరోనా తర్వాత సక్రమంగా కిరాయిలు రాక అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కార్మికులు ఇఎంఐ చెల్లించడంలో ఆలస్యం జరిగిందని ఆ ప్రయివేట్ ఫైనాన్స్ సంస్థ యాజమాన్యం కార్మికుల ఇండ్లు జప్తు చేస్తోంది. అదే ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రయివేట్ ఫైనాన్స్ యాజమాన్యాల వేదింపులు భరించలేక ముగ్గురు డ్రైవర్లు తమ వాహనానికే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకోని తనువు చాలించారు. కాబట్టి ఇప్పటికైనా ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చెయ్యాలి. దీనివల్ల ప్రభుత్వానికి ఒక రూపాయి కూడా అదనంగా ఖర్చు కాదు. ఎందుకంటే ప్రతి రోజూ వందల సంఖ్యలో కొత్త కొత్త వాహనాలు షోరూమ్ నుండి బయటకి వస్తున్నాయి. ప్రతి కొత్త వాహనానికి వెల్ఫేర్ బోర్డు సెస్ కింద 1శాతం, 2శాతం వసూలు చేసి ఆ డబ్బులను వెల్ఫేర్ బోర్డులో జమ చేస్తే కోట్ల రూపాయలు ఈరోజు కార్మికులకు ఉపయోగపడే విధంగా ఉంటాయి. కార్మికుల ఆత్మహత్యలు ఆపవచ్చు, ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవచ్చు, ఇలా అనేక సౌకర్యాలు బోర్డు ద్వారా కార్మికులకు కల్పించవచ్చు. అందుకే ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించాలని ఈ సంఘర్ష యాత్ర డిమాండ్ చేస్తోంది.

ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయంల్లో, హాస్పటలల్లో కంపెనీలలో, ట్రావెల్స్ యజమానుల వద్ద పనిచేసే డ్రైవర్లు అలాగే అన్‌లైన్ సంస్థల్లో పని చేసే డ్రైవర్లు లక్షలలో ఉన్నారు. వీరికి ఎలాంటి కనీస వేతనాలు అమలు కావడం లేదు. కేవలం రూ.10,000 నుండి 13వేల లోపే వీళ్లకు వేతనాలు ఇస్తారు. ఈఎస్ఐ లేదు, పిఎఫ్ లేదు, ఎలాంటి పని భద్రత లేకుండా వీళ్ళు పనిచేస్తున్నారు. ప్రభుత్వం గత సంవత్సరం జూన్ 23న రవాణా రంగ కార్మికుల కనీస వేతనాలు సవరిస్తూ జీవో ఎంఎస్ నెం.25ను విడుదల చేసింది. కానీ ఇప్పటికీ ఆ జీవోను గెజిట్‌గా మార్చి అమలు చేయకుండా రవాణా రంగ కార్మికుల్ని మోసం చేస్తున్నది. ఇది కేవలం యాజమాన్యాలకు తలొగ్గి కార్మికులకు అన్యాయం చేయడమే. తక్షణమే జీఓ

> ఒకటో రెండో వాహనాలున్న చిన్న చిన్న యజమానులను కార్పొరేట్ కంపెనీలో పనిచేసే డ్రైవర్లుగా, కూలీలుగా మార్చే ప్రయత్నం బీజేపీ చేస్తున్నది. ఓనర్లుగా ఉన్నావారు, ఓనర్ కం డ్రైవర్లుగా ఉన్నవారు, తమ వాహనాలన్నీ ఇకపై కార్పొరేట్ కంపెనీల చేతుల్లో పెట్టి వారిచ్చే దయాదాక్షిణ్యాలతో బతకాలని చట్టంలో మార్పు చేశారు. లేదు "నా వాహనం నేనే నడుపుకుంటూ ఎ కంపెనీలో వాహనాన్ని అప్ప చెప్పను." అంటే వాహనం స్టార్ట్ చేసి రోడ్డు మీదకు వెళ్ళిన ఒక్క క్షణం లోనే పోలీసులు అరెస్ట్ చేసి జైల్లో పెడతారు. వాహనాన్ని సీజ్ చేసి గ్యారెజీలో ఉంచుతారు. ఇంతటి దుర్మార్గానికి వొడిగట్టింది. బీజేపీ ప్రభుత్వం.

నెం.25ను గెజిట్‌గా మార్చి అమలు చేయాలని, వీరికి పని గంటలు కల్పించాలని, ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని సంఘర్ష యాత్ర కోరుతున్నది.

వివిధ ప్రాంతాల్లో ఆర్టీసీ డిపోలో వద్దకు సంఘర్ష యాత్ర చేరుకోగానే యాత్రకు కార్మికులు అపూర్వ సాగతం పలుకుతున్నారు. తమ వద్దకు రావాలని 55రోజుల సమ్మె తర్వాత ఆర్టీసీ కార్మికులపైన పని ఒత్తిడి పెంచుతున్నారు. అనేక రకమైన పనులు చేయిస్తున్నారు. సిసిఎస్ లోన్లు ఇవ్వడం లేదు. కార్మిక సంఘాల్ని అనుమతించడం లేదు. కార్మికులను భయపెట్టి, బెదిరించి పనిచేయిస్తున్న పరిస్థితి నేడు ఆర్టిసిలో కనిపిస్తోంది.

సంఘర్షయాత్ర ఇంకా కొనసాగుతున్నది. ఈనెల 11న సంగారెడ్డిలో యాత్ర ముగిసే లోపు, ప్రభుత్వం స్పందించి యాత్ర బృందంతో, సిఐటియు రాష్ట్ర నాయకత్వంతో చర్చల ద్వారా సానుకూలంగా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నాం. లేని పక్షంలో యాత్ర అనంతరం రవాణా రంగా హక్కుల కోసం, ఆర్టీసీ పరిరక్షణ కోసం, సంక్షేమ బోర్డు కోసం, ప్రమాద బీమా కోసం, ఈఎస్, ఐపిఎఫ్ కోసం, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం, పెద్ద ఎత్తున పోరాటాలకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉంటుంది.

సెల్: 9490098328

కదిలించే జీవితాలే నా కథలకు ప్రేరణ

కాలానుగుణంగా సమాజంలో ఎన్నో మార్పులు... రోజు రోజుకీ ఆధునికంగా మనమెంతో అభివృద్ధి చెందుతున్నాం. అయినా ఆడపిల్లల పట్ల వివక్ష, వారిపై అన్యాయాలు ఇప్పటికీ అనాగరికంగా కొనసాగుతూనే ఉన్నాయి. గర్భంలో ఆడపుట్టుక జీవం పోసుకుందని తెలిసిన మరుక్షణమే ఓ భ్రూణహత్య పురుడు పోసుకుంటోంది. ఆడపిల్లలను అక్షరానికి దూరం చేసి వారి ఎదుగుదలను ప్రశ్నార్థకంగా మార్చబడుతోంది. చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేసేసి ఏదో విధంగా వారిని వదిలించుకునే ప్రయత్నాలు మానడం లేదు. ఎందరో ఆడపిల్లలు పుట్టగానే చెత్తకుప్పల పాలవుతున్నారు. నిత్యం ఇటువంటి పరిస్థితులకు బలవుతున్న ఎందరో అమాయకపు ఆడబిడ్డల గాధలనే తన కలం ద్వారా అక్షరీకరిస్తున్నారు. ఆ అక్షరాల మూటను తన మొదటి నవల రూపుదిద్దారు వర్ధమాన యువ రచయిత్రి స్ఫూర్తి కందివనం. ఆమె పరిచయం నేటి మానవిలో...





మీ కుటుంబ నేపథ్యం?

నా స్వస్థలం మహబూబ్ నగర్. నేను పుట్టింది, పెరిగింది, చదివింది అంతా అక్కడే. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్నాను. మా నాన్న కందివనం రఘురామయ్య, పాత్రికేయ వృత్తి. అనేక పత్రికల్లో పని చేశారు. మా అమ్మ వరలక్ష్మి, విశ్రాంత ఉపాధ్యాయురాలు. నాకు అక్క, తమ్ముడు ఉన్నారు. నా సహచరుడు నరేంద్రకుమార్ థాయిలాండ్ సురనరీ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీలో సైంటిస్ట్‌గా పనిచేస్తున్నారు. మాకు హైదరాబాద్‌లో సొంతంగా 'యువ బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్' అనే స్టార్ట్ అప్ కంపెనీ కూడా ఉంది. మా ఇంట్లో మా తాతయ్య, మా నాన్న ఇద్దరూ పుస్తక ప్రియులే. నాన్న గదంతా జర్నలిజం, రాజకీయం, వివిధ ప్రాంతాల చరిత్ర పుస్తకాలు ముఖ్యంగా తెలంగాణ చరిత్రకు సంబంధించిన పుస్తకాలే ఎక్కువగా కనిపించేవి. వాటితో పాటు ఇంగ్లీష్, తెలుగు నవలలు, కథలు, కవిత్వం పుస్తకాలు కూడా ఉండేవి. తాతయ్య దగ్గర వందలకొద్ది ఆధ్యాత్మిక పుస్తకాలు ఉండేవి. ఇంట్లో హాల్ నిండా తాతయ్య పుస్తకాలే. వీళ్లిద్దరి చేతుల్లో ఎప్పుడూ పుస్తకమో, వార్తా పత్రికనో ఏదో ఒకటి కచ్చితంగా ఉండేవి. పుస్తక పఠనం మీద వాళ్లకున్న అంకిత భావం నన్ను ఎప్పుడూ ఆశ్చర్యపరిచేది. అప్పుడప్పుడు నేను కూడా వాళ్ళ పుస్తకాలను పూర్తిగా చదవకున్నా పైపైన అలా తిరగేసేదాన్ని. కానీ వాళ్ళలా సీరియస్‌గా పుస్తకం పట్టింది లేదు. నాన్న వార్తలు రాసేటప్పుడు 'ఎలా ఇలా రాయగలుగుతున్నారు' అని రాసేంతసేపూ ఆత్రంగా ఆయన్నే గమనిస్తూ ఉండేదాన్ని. బహుశా అందుకేనేమో నాకు తెలీకుండానే ఎక్కడో సాహిత్యం, రాయడం అనే వాటి పట్ల ప్రభావితమయ్యాను. కానీ అది నా నుండి బయటపడటానికి ఇన్నేళ్ళ సమయం పట్టి మొత్తానికి 201 లో నేను సాహిత్య రంగంలోకి అడుగుపెట్టేలా చేసింది.

రచనలు ఎప్పుడు ప్రారంభించారు?

ఇందాక చెప్పినట్టు ఈ విషయంలో నాన్న ప్రభావం నాపై కొంతైతే, నేను ఉద్యోగం చేసేటప్పుడు నా కొలీగ్స్‌లో ఇద్దరు ఇంగ్లీష్ నవలలు బాగా చదివేవాళ్ళు. వాళ్లిద్దరూ తరచూ వాటి గురించే చర్చించేవాళ్ళు. ఒకసారి వాళ్ళ దగ్గరున్న పుస్తకాలు రెండు మూడు ఇంటికి తెచ్చుకున్నాను. కానీ రెండ్రోజుల్లో వాళ్ళకి తిరిగి ఇచ్చేయాలి. పూర్తిగా చదవలేకపోయా. కాస్త నిరాశగానే వాళ్ళ పుస్తకాలు వాళ్ళకి తిరిగి ఇచ్చేశాను. అది గమనించిన మా వారు చేతన్ భగత్ నవలతో పాటు మరో రెండు పుస్తకాలు గిఫ్ట్‌గా ఇచ్చారు. అవి చదివాక నేను కూడా నవలలు రాసి ఎలాగైనా నా రచనను కూడా పుస్తకంగా తీసుకురావాలని ఆ రోజే ఫిక్సయ్యాను. ఆ విధంగా 2019లో సాహిత్య రంగంలోకి అడుగుపెట్టాను. తొలి రోజుల్లో ఓ సెల్ఫ్ పబ్లిషింగ్ ప్లాట్ఫారంలో రాసేదాన్ని. మొదట ఇంగ్లీష్‌లో చిన్న చిన్న రైటప్స్, కొన్ని కథలు రాశాను. ఒక సిరీస్ కూడా మొదలు పెట్టి పూర్తిచేయలేక వదిలేశాను. ఆ తర్వాత తెలుగులో రాయడం మొదలుపెట్టి వెంట వెంటనే రెండు నవలలు, ముప్పైదాక కథలు రాశాను. ఈ మధ్యే మరో నవల రాశాను. నా మొదటి నవల 'చైత్ర'ను పుస్తకంగా వెలువరించాను. రాయడం మొదలుపెట్టిన కొత్తలో దూకుడుగా రాసేదాన్ని. కానీ ఇప్పుడు ఆ దూకుడుని తగ్గించి ఏది పడితే అది రాసేయకుండ బాగా ఆలోచించి తగిన సమయం తీసుకొని కథాంశాలను జాగ్రత్తగా ఎంపిక చేసుకుని రాస్తున్నాను.

మీకు స్ఫూర్తి నిచ్చిన అంశాలు?

మామూలుగా ఎవరైనా ఏదైనా సంఘటనను గురించి విన్నప్పుడో లేదా నేరుగా చూసినప్పుడో, అది బాధైనా, సంతోషమైనా ఒకటి రెండు రోజులు దాని గురించి ఆలోచించి, ఆ తర్వాత మర్చిపోడమో, వదిలేయడమో చేస్తుంటారు. కానీ అటువంటి వాటికి చలించి, తన మెదడులో బలంగా రేగే ఆలోచనలు, మనసులో పడే సంఘర్షణలతో సతమతమయ్యి, తనలోతానే పడే వేదనను అక్షరాలుగా మలిచేవాడే రచయిత. బడుగు బలహీన వర్గాల నిస్సహాయత, వారి పట్ల అసమానతలు, కుల మత విద్వేషాలు, మహిళల పట్ల జరిగే అన్యాయాలు, అకృత్యాలు, పితృస్వామ్య భావజాలం, ప్రస్తుతం సమాజంలో మనం చూస్తున్న వింత పోకడాలు వికృత చేష్టలు వంటి అనేక అంశాలు నన్ను ఎక్కువశాతం ప్రభావితం చేసే అంశాలు. అటువంటి సమస్యలను, పరిస్థితులను ఎదురుకుంటూ పోరాడే వాళ్ళు, పోరాడలేక నిస్సహాయంగా మిగిలిపోయిన వారి జీవితాలే నా కథలకు ప్రేరణ.



సాహిత్యంలో మహిళల పాత్రపై మీ అభిప్రాయం?

తొలి కవయిత్రి తాళ్ళపాక తిమ్మక్కతో మొదలుపెడితే ఇప్పటి కవయిత్రులు, రచయిత్రుల వరకు చెప్పాలంటే ఇది కాస్త పెద్ద టాపికే. దీన్ని లోతుగా విశ్లేషించి చెప్పగలిగేంత అనుభవం గాని, అవగాహన గాని నాకు లేదు. కాకపోతే ప్రస్తుతం రాస్తున్న కవయిత్రులు, రచయిత్రులు ముఖ్యంగా యువత మూస ధోరణి రచనలు కాకుండా ప్రస్తుతం సమాజ స్థితిగతులపై ఎప్పటికప్పుడు వినూత్నంగా ఆలోచిస్తూ వాళ్ళు చెప్పాలనుకున్న అంశాన్ని సూటిగా, నిక్కచ్చిగా, నిర్భయంగా వాళ్ళ రచనల్లో ప్రెసెంట్ చేస్తుండడం గమనించాను. ఇది నిజంగా మంచి పరిణామం. అయితే ఇక్కడ సమస్యల్లా కొన్నిసార్లు అలా రాయడం వల్ల ఫలానా రచయిత్రి పట్ల వ్యక్తిగతంగానూ ఆమె పైన ఒక నెగటివ్ ఇంప్రెషన్ డెవలప్ అవుతూంటుంది పాఠకులకు. అటువంటి పరిస్థితులను ఎదురుకున్నా వారి అభిప్రాయాల పట్ల స్థిరంగా వ్యవహరించే రచయిత్రులను మెచ్చుకోవాల్సిందే. నిజం చెప్పాలంటే కొన్ని బోల్డ్‌గా రాసే కథల్లో అవి ప్రస్తుతం మన సమాజంలో జరుగుతున్నవే అయినా ఒక బౌండరీలో ఉండిపోయిన మన ఆలోచనా విధానం వాటిని అంగీకరించడానికి సిద్ధంగా ఉండదు. మనము విధించుకున్న ఆ బౌండరీని దాటి చూస్తే తప్ప అందులోని సారాన్ని గ్రహించలేరు పాఠకులు.

మీ రచనల గురించి చెప్పండి?

తెలుగులో ఇప్పటివరకు ముప్పైకి పైగా కథలు, 3 నవలలు రాశాను. నా మొదటి నవల 'చైత్ర'ను 2020లో పుస్తకంగా వెలువరించాను. ఈ నవలకు ఇటీవలే 'తెలంగాణ సారస్వత పరిషత్తు యువ పురస్కారం' మరియు 'అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్ ప్రథమ నవలా పురస్కారం' అందుకున్నాను. ఈ ఆధునిక యుగంలో కూడా ఇంకా ఆడపిల్లల పట్ల జరుగుతున్న వివక్ష, అసమానతలు వంటి అంశాలను ఎత్తిచూపుతూనే, ఒక ఆడపిల్లకు సరైన ప్రోత్సాహం లభిస్తే ఏదైనా సాధించగలదన్న విషయాన్ని ఓ సైనికురాలి పాత్ర ద్వారా చెప్పే ప్రయత్నం చేశాను. అదే విధంగా ఇండియన్ ఆర్మీలో మహిళల పాత్ర, శిక్షణా సమయంలో, విధులను నిర్వహించే క్రమంలో మగవాళ్లకు సమానంగా వాళ్ళు ఎదురుకునే సవాళ్ళను కూడా చూపించే ప్రయత్నం చేశాను. మన మహిళా ఆర్మీ ఆఫీసుర్లు మితాలి మధుమిత, ప్రియ జింగన్, దివ్య అజిత్ కుమార్, భావన కస్తూరి వంటి అనేక మంది వీరనారులే నా నవలలోని కథానాయిక పాత్రకు ప్రేరణ. ఈ నవలను పుస్తకంగా తీసుకొచ్చే క్రమంలో ముందుగా నవలను చదివి, వారి అభిప్రాయాలను పంచుకుని, తగిన సలహాలు సూచనలు ఇచ్చి నన్ను ప్రోత్సహించిన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ గారికి, అలాగే రచయిత శ్రీచరణ్ మిత్ర గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు. కథల విషయానికొస్తే... నేను మొదటిసారి పత్రికలకు రాసిన కథలు చీకటి వెలుగులు, నాయిన చెప్పిన అబద్ధం, నేను...మీ..! వరుసగా నమస్తే తెలంగాణ-ముల్కనూరు ప్రజాగ్రంథాలయం వారి కథ 2020, ఈనాడు కథా విజయం 2020, అరసం యువ కథా పురస్కారం 2021 పోటీల్లో బహుమతులు అందుకోడమే కాకుండా నేననే ఒక రచయిత్రిని ఉన్నానని నన్ను ప్రపంచానికి పరిచయం చేశాయి. 'డిమ్మి' కథకు నమస్తే తెలంగాణ-ముల్కనూరు ప్రజాగ్రంథాలయం వారి కథ 2021 పోటీలో ప్రథమ బహుమతి అందుకోడం మర్చిపోలేని అనుభూతి. కార్చిచ్చులా వ్యాపిస్తున్న ఆధునీకీకరణ, జానపద కళాకారుల జీవితాలను ఛిద్రం చేయడంతో పాటు, సమున్నత కళారూపాల ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చింది. తరతరాలుగా కూడు పెట్టిన కళారూపం నేడు ఆకలి దప్పులనే మిగిలిస్తున్నప్పటికీ, అటు టెక్నాలజీతో పోటీ పడలేక, ఇటు కులవృత్తులను వదిలి ప్రత్యామ్నాయ బ్రతుకు తెరువులను ఎంచుకోలేక కొట్టుమిట్టాడుతున్న వారిలో బుడిగె జంగాలు కూడా ఒకరు. వారి దయనీయ గాథను ఈ కథ ద్వారా పాఠకుల ముందుంచే ప్రయత్నం చేశాను. ఈ కథ అత్యంత పాఠకాదరణ పొందడమే కాకుండా, ఎందరో మన్ననలు పొందింది. సాహిత్యంలో నాకు ఈ కథ ఒక టర్నింగ్ పాయింట్ అనే చెప్పాలి.

మీకు ప్రేరణ ఎవరు?

వ్యక్తిగతంగా అయితే చాలా విషయాల్లో నాకు మా నాన్నే ప్రేరణ. సాహిత్యంలో అయితే.. మొదటినుండి నవలా రచనపై ఉన్న అభిలాషతోనే సాహిత్యంలోకి అడుగుపెట్టిన నాకు, నేను చదివిన వాళ్ళల్లో అంపశయ్య నవీన్, పెద్దింటి అశోక్ కుమార్, కేశవరెడ్డి, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, సయ్యద్ సలీం, యద్దనపూడి సులోచనారాణి, కె.ఎన్ మల్లీశ్వరి, గీతాంజలి, అంగులూరి అంజనీదేవి వంటి వారి నవలలు నిత్య ప్రేరణలు. నాకు పరిచయం లేని సాహిత్య ప్రపంచంలో ఎటు నడవాలో తెలియని గజిబిజి దారిలో అడుగులేస్తున్న నాకు వీరి రచనలు ఒక సరైన మార్గాన్ని చూపించాయి. ప్రస్తుతం ఎటువంటి రచనలు అవసరమో ఒక అవగాహనకు రాగలిగాను.

సాహిత్యం సమాజాన్ని ప్రభావితం చేస్తుందా? దీనిపై మీ అభిప్రాయం?

కచ్చితంగా ఎంతో కొంత ప్రభావితం చేస్తుంది. కథలు, నవలలు చదివి తమ సమస్యకు పరిష్కారం వెతుక్కునే వాళ్లు కొందరైతే, ఆ పాత్రలలో తమని చూసుకుని ఎమోషనల్ అయ్యే వాళ్ళు కొందరు. తెలియని విషయాలను గురించి తెలుసుకునేవాళ్ళు కొందరైతే, తెలిసిన విషయాన్నే వాళ్లకు తెలియని కొత్త కోణంలో తెలుసుకుని వాళ్ళ ఆలోచనా ధోరణిని మార్చుకునేవాళ్ళు కొందరు. అటువంటి మార్పులు తీసుకొచ్చిన కథలు, నవలలు ఎన్నో ఉన్నాయి.; నా 'డిమ్మి' కథ చదివి ఒక పాఠకుడు 'ఇన్నిరోజులు ఇంటి ముందు నిలబడి డబ్బులు అడిగే బుర్ర కథలు చెప్పేవాళ్లను చూసి చిరాకు పడేవాడిని. కానీ మీ కథ చదివాక వారి పట్ల నా ప్రవర్తనకు గిల్టీగా ఫీలవుతున్నాను. ఇకపై అలా ఉండను' అంటూ మెసేజ్ చేశారు. చాలా సంతోషంగా అనిపించింది. మనం రాసే రచన మొత్తం సమాజాన్నే మార్చేయలేకపోవొచ్చేమో కానీ ఏ ఒక్కరిలోనైనా కనీసం ఒక ఆలోచనను రేకెత్తించగలితే మన రచన సక్సెస్ అయినట్లే. ప్రతి రచయిత కోరుకునేది కూడా అదే. ఆ దిశగానే రాసే ప్రయత్నం చేస్తుంటారు ఏ రచయితైనా.

- తలారి శ్రీనివాసరావు,
ఓయూ రిపోర్టర్, నవతెలంగాణ

ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణ దరఖాస్తుదారుల్లో టెన్షన్

(మొదటిపేజీ తరువాయి)

చేసినట్టు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఉన్నపళంగా వారు రూ.లక్షల్లో చెల్లించి స్థలం రెగ్యులరైజ్ చేసుకోవాల్సి రావడంతో నిరుపేదల్లో ఆందోళన నెలకొంది.

దిక్కుతోచని స్థితిలో జీవో 59 దరఖాస్తుదారులు..

తెలంగాణ ప్రభుత్వం 2015 జనవరిలో ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణకు తొలిసారి ఆదేశాలు జారీ చేసింది. ఈ ఎనిమిదేండ్లలో మూడు పర్యాయాలు వివిధ నెంబర్లతో జీవోలు వెలువడ్డాయి. 2015లో జీవో 12 రూపంలో ఒకసారి, 2017 ఫిబ్రవరిలో జీవో 35, డిసెంబర్‌లో 283 జీవో విడుదల చేసింది. చివరిసారిగా 2022లో జీవోఎంఎస్-14 పేరిట ఇండ్ల స్థలాల క్రమబద్ధీకరణకు 58, 59 జీవోలు విడుదల చేసింది. దీనిలో 125 గజాలలోపు స్థలం కలిగి, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ఆక్రమణదారులకు ఉచితంగా రెగ్యులరైజ్ చేయాలని సూచిస్తూ జీవో నెంబర్ 58 జారీ చేసింది. అంతకుమించి ఉంటే ల్యాండ్ బేసిక్ వాల్యూ ఆధారంగా ఫీజు నిర్ణయిస్తూ జీవో నంబర్ 59 జారీ చేసింది. ఈ మేరకు అప్లికేషన్ చేసుకునేందుకు గతేడాది ఫిబ్రవరి 21 నుంచి మార్చి 31 వరకు 50రోజుల పాటు గడువు ఇచ్చింది. రూ.1200 వరకు చెల్లించి జిల్లాలో 6వేల మంది వరకు జీవో 58 కింద దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 4వేల మందికి పైగా సంబంధించిన క్రమబద్ధీకరణ పట్టాలు కూడా సిద్ధమయ్యాయి. 125 గజాలకు పైబడిన ఇండ్ల స్థలం ఉన్న నిరుపేదలు జీవో 59 కింద దరఖాస్తు చేసుకున్నారు. నిర్దేశించిన ఫీజు చెల్లించి వారు స్థల క్రమబద్ధీకరణ చేయించుకోవాల్సి ఉంటుంది. ఇప్పుడు దానికి సంబంధించిన నోటీసులు దరఖాస్తుదారులకు అందడంతో ఆందోళన నెలకొంది. మూడు నెలల కాలంలో నెలకో వాయిదా చొప్పున ఈ మొత్తాన్ని చెల్లించాల్సి రావడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

59 జీవో ప్రకారం చెల్లింపులు ఇలా...

జీవో 58 కింద ఉచితంగా రెగ్యులరైజ్ చేస్తారు. ఆ స్థలాలను వారసత్వంగా వినియోగించుకోవచ్చు కానీ అమ్ముకోవడానికి వీల్లేదు. రాష్ట్రవ్యాప్తంగా 58 జీవో స్థలాల దరఖాస్తులు 85వేలకు పైగా వచ్చాయి. ప్రభుత్వం ఆదాయమే ధ్యేయంగా విడుదల చేసిన జీవో 59 కింద మాత్రం 60వేల అప్లికేషన్లు రావడం గమనార్హం. ఇక జీవో 59 కింద క్రమబద్ధీకరించే స్థలాలకు మాత్రం బేసిక్ వాల్యూ ఆధారంగా ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. వీటిపై క్రయవిక్రయాలు జరుపుకోవచ్చు. జీవో 59 ప్రకారం చెల్లింపులను పరిశీలిస్తే...126 నుంచి 250 గజాల వరకు ఉంటే స్థలం బేసిక్ వాల్యూలో 50%, 251-500 గజాల వరకు బేసిక్ వాల్యూలో 75%, 500 గజాలకు పైగా ఉంటే బేసిక్ వాల్యూ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. ఈ గణాంకాల ఆధారంగా జిల్లా వ్యాప్తంగా 2000 మందికి పైగా నిరుపేదలకు జీవో 59 కింద శుక్రవారం నోటీసులు జారీ అయ్యాయి. నెలకో వాయిదా చొప్పున మూడు వాయిదాల్లో మొత్తం ఫీజు చెల్లించాలని తెలపడంతో ఇప్పటికిప్పుడు డబ్బుల కోసం తంటాలు పడుతున్నారు.

కూలి చేసి బతికేటోణ్ని రూ.లక్షలు నేను యానుంచి తేను..

అంతోని రమేష్, ఎస్సీ, నరసింహాపురం, చింతకాని



నా ఇంటిస్థలం 178 గజాలు క్రమబద్ధీకరిస్తానంటే జీవో 59 కింద గతేడాది ఫిబ్రవరిలో మీ సేవలో దరఖాస్తు చేసుకున్నా. రోజూ కూలికి వెళ్తేనే నా కుటుంబం గడుస్తది. అటువంటి నాకు ఇప్పటికిప్పుడు రూ.1,45,600 చెల్లించాలని కలెక్టర్ నోటీసులు పంపించారు. 90 రోజుల్లో మూడు వాయిదాల్లో చెల్లించాలన్నారు. తొలి రెండు వాయిదాల్లో రూ.50,960 చొప్పున, మూడో వాయిదా 43,680 చెల్లిస్తేనే మా ఇంటి స్థలాన్ని క్రమబద్ధీకరిస్తారట..! 'రెక్కాడితే గానీ డొక్కాడని' నేను ఇప్పటికిప్పుడు రూ.లక్షల డబ్బులు యానుంచి తేవాలి. నాకు సెంటు భూమి కూడా లేదు. 90 రోజుల్లో చెల్లించకపోతే నా పరిస్థితి ఏమి కావాలి? నాకుటుంబం రోడ్డున పడాల్సిందేనా?

క్రమబద్ధీకరణ ఫీజు చెల్లించాలి..

- వీపీ గౌతమ్, ఖమ్మం జిల్లా కలెక్టర్



ప్రభుత్వ ఆదేశాల మేరకు 125 గజాలకు పైగా స్థలం ఉన్నవారు బేసిక్ వాల్యూ ఆధారంగా మూడు వాయిదాల్లో నిర్దేశిత ఫీజు చెల్లించాల్సిందే. కొన్ని రోజులుగా నోటీసులు పంపుతున్నాం. ఇప్పటికిప్పుడు పంపించినవేమీ కాదు. అందరూ సహకరించి ఇండ్ల స్థలాలు రెగ్యులరైజ్ చేయించుకోవాలి.

ప్రతి పేదవాడి గడపకూ సంక్షేమ పథకాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభాకర్ రెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ శుక్రవారం శంకుస్థాపనలు చేశారు. నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండలంలో పలు అభివృద్ధి పనుల కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డితో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

ఈ సందర్భంగా పలుచోట్ల కేటీఆర్ మాట్లాడుతూ.. 'ఎవరి సొమ్ముతో ఎవరు కులుకుతున్నారు. తెలంగాణ ప్రజలు వివిధ పన్నుల రూపంలో ఎనిమిదేండ్లలో కట్టినవి రూ.3.6 లక్షల కోట్లు.. కేంద్రం నుంచి రాష్ట్రానికి తిరిగి వచ్చింది రూ.1.68 వేల కోట్లు. తెలంగాణ నిధులతో బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అభివృద్ధి పనులు చేస్తున్నారు.. ఈ విషయం తప్పని రుజువు చేస్తే మంత్రి పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధం' అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సవాల్ విసిరారు. తాను చెప్పింది తప్పని రుజువు చేయకపోతే కేంద్రమంత్రి పదవికి రాజీనామా చేస్తారని అనుకోను.. కనీసం రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పే సంస్కారం ఉందా? అని కిషన్‌రెడ్డిని అడుగుతున్నా అని కేటీఆర్ ప్రశ్నించారు. కిషన్‌రెడ్డి తెలంగాణ పోరాటంలో ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేయలేదని విమర్శించారు. నేడు కేంద్ర మంత్రిగా ఉన్న ఆయన రాష్ట్రానికి చేసిందేమీ లేదని విమర్శించారు. ఆయన మాట్లాడేవన్నీ అబద్ధాలు.. నిలదీస్తే ఒక్క సమాధానం కూడా చెప్పరని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బీజేపీ వల్ల కార్పొరేట్ శక్తులు బాగుపడ్డాయి. ప్రజలు మాత్రం మరింత అగాధంలోకి వెళ్లారు. మోడీ వల్ల దేశం అప్పులపాలైంది.. దేశం అభాసుపాలైంది.. దేశానికి వేగు చుక్క తెలంగాణ మాత్రమే' అని అన్నారు.

'ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు మాట్లాడుతాం.. అప్పుడు మీ నిర్ణయం మీరు తీసుకోవచ్చు.. ప్రజలు ఆశీర్వదించాలి.. అండగా ఉండాలి.. రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తాం..బీజేపీ ప్రమాదకర పార్టీ.. దాని ఉచ్చులో పడొద్దు.. కుల, మతాల పేరుతో ప్రజల మధ్య పంచాయతీ పెట్టడం బీజేపీ పని" అని మంత్రి కేటీఆర్ విమర్శించారు. కేంద్రం నుంచి తెలంగాణకు వచ్చే నిధులు రాకపోతే నోరు కూడా మెదపని సన్నాసులు బీజేపీ నాయకులు అని కేటీఆర్ నిప్పులు చెరిగారు. తెలంగాణలో మత విద్వేషాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని కుట్రలు చేస్తున్నది బీజేపీ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ వల్ల ఒక దళితుడిగానీ, గిరిజన వ్యక్తిగానీ బాగుపడిన దాఖలాలు లేవన్నారు.

గతంలో మునుగోడు ఎమ్మెల్యేగా పని చేసిన వారు నియోజకవర్గాన్ని అనాథను చేశారన్నారు. ప్రభాకర్ రెడ్డి గెలిచిన తర్వాత నియోజకవర్గమంతా కలియ తిరుగుతున్నారని చెప్పారు. రాబోయే నాలుగైదు నెలల్లోనే అందమైన చండూరును పరిచయం చేస్తామని చెప్పారు.

పూర్వపు నల్లగొండ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు, పట్టణాలను మార్చే దిశగా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. నేతన్నకు ఇచ్చిన మాట ప్రకారం వంద శాతం రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈ శంకుస్థాపన చేసినట్టు వెల్లడించారు. చేనేత క్లస్టర్ల వల్ల గట్టుప్పల్‌లో 460 మంది, తేరట్‌పల్లిలో 190 మంది లబ్దిదారులకు మేలు కలుగుతుందన్నారు. రూ.30 వేల కోట్లతో దామరచర్లలో అల్ట్రా మెగా పవర్ ప్లాంట్‌ను నిర్మిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు రాష్ట్ర చైర్మెన్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ విజయసింహారెడ్డి, జెడ్పీచైర్మెన్ బండ నరేందర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీలు ఎల్.రమణ, ఎంసి.కోటి రెడ్డి, ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, కంచర్ల భూపాల్ రెడ్డి, గాదరి కిషోర్, రవీంద్ర నాయక్, కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రయివేటీకరణ ఆపాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎండి అబ్బాస్ మాట్లాడుతూ.. స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలంటే పోరాటం తప్ప మరో మార్గం లేదన్నారు. గోల్కొండ క్రాస్ రోడ్ నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో ఆశావర్కర్లు డిప్యూటీ తహసీల్దార్ ఫారూఖ్‌కు వినతిపత్రం అందజేశారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో గాంధీ పార్క్‌లో ధర్నా నిర్వహించి, కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్ వద్ద నిరసన తెలిపారు.

మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని నవాబ్‌పేట మండలం గురుకుంటలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి ఆధ్వర్యంలో ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి ఇంటి ముందు స్కీమ్ వర్కర్లు ధర్నా చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని గాంధీపార్క్‌లో ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా జిల్లా కలెక్టర్ కార్యాలయం చేరుకుని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం నార్సింగి మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఇబ్రహీంపట్నం పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. షాద్‌నగర్ ఆర్డీఓ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. మహేశ్వరం మండలంలో ఆశావర్కర్లు ప్లకార్డులతో నిరసన తెలిపారు.

నల్లగొండ జిల్లాలోని నాంపల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద నల్ల బ్యాడ్జీలు పెట్టుకుని నిరసన తెలిపారు. నల్లగొండలో స్కీం వర్కర్లు తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. త్రిపురారంలో వైద్యాధికారికి మెడికల్ అండ్ హెల్త్ రాష్ట్ర నాయకులు ప్రమీలకు వినతిపత్రం అందజేశారు. హాలియాలో ఆశావర్కర్లు వైద్యాధికారికి వినతిపత్రం అందజేశారు. యాదాద్రిభువనగిరి జిల్లాకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. మణుగూరులో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఖమ్మం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

చెన్నైకి మొదటి స్థానం

(మొదటిపేజీ తరువాయి)

టాప్ 25 రాజధానుల్లో కేవలం పది మాత్రమే అనుకూలమైన నగరాలుగా స్థానం సంపాదించాయి. సాధారణంగా రాష్ట్ర రాజధానులపై ప్రభుత్వాలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా, పర్యావరణ పరంగా, అభివృద్ధి పరంగా ప్రత్యేక శ్రద్ధను చూపుతారని.. అలాంటి రాజధానులు మహిళలకు భద్రత కలిగించడంపై ఎదురవుతున్న సమస్యలపై దష్టి సారించాలని నివేదిక పేర్కొంది. మొత్తం మీద ఉత్తరాది నగరాల కన్నా దక్షిణాది నగరాలు మెరుగ్గా ఉన్నాయని సర్వే పేర్కొంది.

కేంద్రం జాప్యం..

(మొదటిపేజీ తరువాయి)

వ్యవస్థను తీసుకురావాలనుకుంటే... శాసనకర్త దానిని చేయగలరు' అని తెలిపారు.

మూడు రోజుల్లో 44 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదం : అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి

మూడు రోజుల్లో 44 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదం ఇవ్వబడుతుందని సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది. న్యాయమూర్తుల నియామకం కోసం కొలీజియం సిఫారసు చేసిన పేర్లను ప్రక్రియ చేయడానికి ప్రభుత్వం కాలక్రమానికి కట్టుబడి ఉంటుందని వివరించింది. అటార్నీ జనరల్ (ఏజీ) ఆర్. వెంకటరమణి మాట్లాడుతూ.. ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న హైకోర్టుల కొలీజియం చేసిన 104 సిఫారసులలో 44 మంది పేర్లను ప్రాసెస్ చేసి రెండు మూడు రోజుల్లో సుప్రీంకోర్టుకు పంపే అవకాశం ఉందని తెలిపారు. ప్రత్యేకంగా రాజస్థాన్ హైకోర్టులో, కేంద్రం వద్ద 10 కొలీజియం సిఫారసులు పెండింగ్‌లో ఉన్నాయని ధర్మాసనం చెప్పింది. 'సమాచారమేమిటి? మేం ఏదైనా రికార్డ్ చేయగలమా? మీరు దానిని పరిశీలిస్తున్నారని మేం చెప్పాలా' అని ధర్మాసనం ప్రశ్నించింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 3కు వాయిదా వేసింది.

ఆజాద్ ఎన్‌కౌంటర్ కేసులో స్టే..

నవతెలంగాణ - హైదరాబాద్

ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో 12 ఏళ్ల క్రితం జరిగిన పోలీస్ ఎన్‌కౌంటర్ ఘటనలో ఆజాద్, జర్నలిస్ట్ హేమచందర్ పాండేల కేసుకు సంబంధించి ఆ జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు స్టే విధించింది. ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులపై కేసు నమోదు చేసి.. విచారణ పూర్తి చేయాలని ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేసిన కేసులో హైకోర్టు విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. డిసెంబర్ 13న జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పుపై జస్టిస్ నాగార్జున స్టే విధించారు. కేసుతో సంబంధమున్న 29 మంది పోలీసులు మున్సిఫ్ కోర్టులో విచారణకు హాజరు కావాలని జిల్లా జడ్జి ఆదేశించారు. విచారణను కోర్టు నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఆ ఫైళ్ల కోసం ఒత్తిడి చేయెుద్దు..

(మొదటిపేజీ తరువాయి)

తరఫున ఏజీ బీఎస్ ప్రసాద్ కోరారు. ఇరుపక్షాల వాదనల తర్వాత హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీలతో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 9న విచారణ వరకూ ఫైళ్లను ఇవ్వాలని సిట్‌ను ఒత్తిడి చేయెుద్దంటూ సీబీఐని ఆదేశించింది. అనంతరం ప్రభుత్వ అప్పీలుపై విచారణ సోమవారానికి వాయిదా పడింది. ఫైళ్ల కోసం సీబీఐ ఒత్తిడి చేస్తోందంటూ అడ్వొకేట్ జనరల్ హైకోర్టుకు తెలిపారు.

ఎమ్మెల్యేలకు ఎర కేసులో సిట్ దర్యాప్తును రద్దు చేసి సీబీఐకి బదిలీ చేయాలనే అంశంపై హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును కొట్టివేయాలంటూ ప్రభుత్వం దాఖలు చేసిన అప్పీలుపై శుక్రవారం హైకోర్టు డివిజన్ బెంచ్‌లో సుదీర్ఘ వాదనలు కొనసాగాయి. ముగ్గురు నిందితులు రామచంద్రభారతి, సింహయాజీ, నందకుమార్ తరఫున మాజీ అడ్వొకేట్ జనరల్ సీతారామమూర్తి, సీనియర్ న్యాయవాది ఎల్. రవిచంద్ర వాదనలు వినిపించారు. అప్పీల్‌కు విచారణార్హత లేదని, క్రిమినల్ కేసులో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై అభ్యంతరాలు ఉంటే సుప్రీంకోర్టుకు వెళ్లాలని చెప్పారు, హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం విచారణ చేయకూడదని తెలిపారు.

మొయినాబాద్ ఫాంహౌస్ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసిన తర్వాత ఆఘమేఘాలపై సీఎం మీడియా సమావేశం నిర్వహించి నిందితులకు నష్టం కలిగించేలా దుమ్మెత్తిపోశారని తెలిపారు. ఇది కేసు దర్యాప్తును ప్రభావితం చేసేలా ఉన్నందున సీబీఐకి అప్పగించాలన్న సింగిల్ జడ్జి ఉత్తర్వులను యధాతథంగా కొనసాగించాలని అన్నారు. కేసు దర్యాప్తులో ధర్మాసనం జోక్యం చేసుకోవద్దని కోరారు. భారతీయ జనతా పార్టీ తరఫున సీనియర్ న్యాయవాది దామోదర్ రెడ్డి వాదనలు వినిపించారు. ఈ కేసు సీబీఐకి అప్పగించడమే సరైందని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, టీఆర్ఎస్... బీజేపీపై తీవ్ర అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశాయని చెప్పారు. ఎనిమిది రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి అక్కడి ప్రభుత్వాలను కూల్చారంటూ సీఎం తప్పుడు ఆరోపణలు చేశారని తెలిపారు. అలాంటిది ఎక్కడా జరగలేదని చెప్పారు. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను తీసుకోలేదని వెల్లడించారు. తెలంగాణలో మాత్రం 2014 నుంచి ఇప్పటి వరకు 37 మంది ఎమ్మెల్యేలను ఇతర పార్టీల నుంచి టీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని చెప్పారు. టీఆర్ఎస్ రెండు సార్లు అధికారంలోకి వచ్చాక పార్టీ ఫిరాయింపులను ఏ విధంగా ప్రోత్సహించిందనే విషయమై ఎమ్మెల్యేల పేర్లతో కూడిన జాబితాను హైకోర్టుకు అందజేశారు. దీనిపై స్పందించిన హైకోర్టు... బీజేపీ, టీఆర్ఎస్‌ల మధ్య రాజకీయ వైరం ఉంటే అలాంటి వాటిని కోర్టుల్లో కాకుండా బయట చూసుకోవాలంటూ హెచ్చరించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించాల్సిన సీనియర్ న్యాయవాది దుష్యంత్ ఢిల్లీలో ఉన్నారని, అందువల్ల సోమవారం వరకు సమయం ఇవ్వాలని ఏజీ బీఎస్ న్యాయస్థానాన్ని కోరారు. సోమవారం కూడా ఆయన ఢిల్లీలోనే ఉంటారనీ, అందువల్ల ఆన్‌లైన్ విధానంలో విచారణకు అనుమతించాలని కోరారు. అందుకు అనుమతించిన హైకోర్టు తదుపరి విచారణను సోమవారం మధ్యాహ్నం చేపడతామంటూ ప్రకటించింది. అప్పటి వరకు కేసుకు చెందిన ఫైళ్లను ఇవ్వాలంటూ సిట్, రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయెుద్దంటూ సీబీఐని ఆదేశించింది.

సిటీ పోలీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన సీపీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ సిటీ పోలీస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ నూతన సంవత్సర 2023 క్యాలెండర్‌ను నగర పోలీస్ కమిషనర్ సీ.వీ.ఆనంద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. శుక్రవారం ట్విన్ టవర్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అడ్మిన్ పరిమళతోపాటు కో-ఆపరేటివ్ సొసైటీ సెక్రటరీ ఎస్. శంకర్ రెడ్డి, కో-ఆపరేటివ్ సొసైటీ ట్రెజరర్ విక్టర్ జాయింట్ సెక్రెటరీ శాంతితోపాటు పలువురు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన



నవతెలంగాణ-హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని సూర్య టౌన్‌షిప్, వివేకానందనగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్, జీహెచ్ఎంసీ ఏఈ హేము నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌లకు సూచించారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలను తమ దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వివేకానంద నగర్ కాలనీ అధ్యక్షులు కుమార్, కాలనీసంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఫొటోలను మార్ఫింగ్ చేసి
వేధిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలి

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బ్యాగరి వెంకటేశ్, రాథోడ్ సంతోష్



నవతెలంగాణ-ఘట్‌కేసర్

విద్యార్థినుల ఫొటోలను మార్ఫింగ్ చేసి వేధిస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బ్యాగరి వెంకటేశ్, రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్‌లోని ప్రయివేట్ ఇంజినీరింగ్ కాలేజీ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్‌లోని ఇంజినీరింగ్ కాలేజీ స్టూడెంట్స్ వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేశారని.. నిందితుడు ఆ గ్రూప్‌లోని విద్యార్థినుల డిపిలను సేవ్ చేసుకుని వేధిస్తున్నారని వాపోయారు. సోషల్ మీడియాలో ఫొటోలు మార్ఫింగ్ చేసి వారిని బెదిరించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అమ్మాయిల ఫొటోలను మార్ఫింగ్ చేసిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో విద్యార్థులను కలుపుకుని పెద్దఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో అరుణ్, శివ, రాజు, కిరణ్ కుమార్, శ్రీనివాస్, గిరి, సంపత్, శ్రావణ్, కుమార్, అవినాష్, వంశీ, సాయి కిరణ్, సాయి చందర్ తదితరులు పాల్గొన్నారు.

స్కీంల ప్రయివేటీకరణను ఆపాలి

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వీ రమ

నవతెలంగాణ-సంతోష్‌నగర్

స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వీ రమ అన్నారు. స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దేశవ్యాప్త నిరసనల్లో భాగంగా సంతోష్‌నగర్ క్రాస్ రోడ్డు నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్‌వీ రమ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్కీంల ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. ఒకవైపు ఆకాశాన్ని అంటుతున్న నిత్యావసర సరుకుల ధరలు.. మరోవైపు చాలీచాలని వేతనాలతో కేంద్ర, రాష్ట్రాలు ప్రవేశపెట్టిన స్కీం లలో పనిచేస్తున్న వర్కర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మోయలేని పని భారంతో కూనరిల్లుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా తన పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నదని తెలిపారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం శ్రావణ్ కుమార్, అధ్యక్షులు మీనా, ఎస్ కిషన్, కె. జంగయ్య, బాలు నాయక్, లతీఫ్, సఫియా, సుల్తానా రాఖి, మహబూబ్ ఉన్నిసా, యూనిస్, ఉమాదేవి, రమణి, కల్పన తదితరులు పాల్గొన్నారు.



స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించాలి: ఎన్.సబిత

ఘట్‌కేసర్: కేంద్రం ప్రభుత్వం స్కీంలను ప్రయివేట్‌పరం చేయాలనే యోచనను ఉపసంహరించాలని సీఐటీయూ ఘట్‌కేసర్ మండల కార్యదర్శి ఎన్.సబిత డిమాండ్ చేశారు. స్కీం వర్కర్లందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరుతూ శుక్రవారం ఘట్‌కేసర్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సీఐటీయూ మండల కార్యదర్శి ఎన్.సబిత మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పేదల కోసం ఎన్నికలకు ముందు అనేక స్కీంలు ప్రకటించి నేడు వాటిని ప్రయివేట్ పరం చేయాలని చూడటం సరైంది కాదన్నారు. స్కీం వర్కర్లందరూ రోజు పేదలకు అనేక సేవలందిస్తున్నారని, కానీ కేంద్ర ప్రభుత్వం స్కీం వర్కర్లను బానిసలుగా చూస్తుందన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. మధ్యాహ్న భోజనం కార్మికులకు ప్రభుత్వం కోడిగుడ్డు ధర రూ.4.90 మాత్రమే ఇస్తుందని బయట కొనుగోలు చేయడానికి రూ.6 చెల్లించాల్సి వస్తుందన్నారు. పెరుగుతున్న ధరలకనుగుణంగా విద్యార్థులకిచ్చే మెనూ చార్జీలు పెంచాలన్నారు. రాజకీయ ఒత్తిడిలు లేకుండా చూడాలన్నారు. మధ్యాహ్నం భోజనం కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. స్కీం వర్కర్లందరికీ పీఎఫ్. ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన మండల అధ్యక్షురాలు, బి పుష్ప, ప్రధాన కార్యదర్శి ఆర్ శీను, ఉపాధ్యక్షురాలు, బి. సంతోష, సహాయ కార్యదర్శి, ఎం. పద్మ, పి.యాదమ్మ, పి. ఈశ్వరయ్య ఆర్ జ్యోతి, డి. ధనలక్ష్మి, బి.శివ రాణి, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కడమంచి యాదగిరి, చంద్రమోహన్, సీఐటీయూ మండల నాయకులు కె చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.



పోరాటానికి ప్రతిరూపం కమ్యూనిస్టులు

- సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్ రెడ్డి



నవతెలంగాణ-హయత్‌నగర్

కమ్యూనిస్టులు అంటే పోరాటానికి ప్రతిరూపం అని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు సామిడి శేఖర్ రెడ్డి అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 2023 సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హయత్‌నగర్ మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన, శ్రామిక, కర్షక, అసమానతలు లేని సమాజం కోసం పాటు పడేది కమ్యూనిస్ట్ పార్టీ అని అన్నారు. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ ఎర్రజెండా ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో హయత్‌నగర్ మండల సహాయకార్యదర్శిలు శేషరాజుపల్లి శ్రీదేవి, రమావత్ సక్రు నాయక్, సీనియర్ నాయకులు సోమన్న, మహిళా సమైక్య అధ్యక్ష కార్యదర్శులు సరిత, సుభద్ర, విమల, అరుణ, పారిజాత, కల్యాణి, సుజాత, దీపిక తదితరులు పాల్గొన్నారు.

హుడా కాంప్లెక్స్‌లో ముగ్గుల పోటీలు



నవతెలంగాణ-సరూర్‌నగర్

సరూర్‌నగర్ డివిజన్ పరిధి హుడా కాంప్లెక్స్‌లో స్ఫూర్తి మహిళా మండలి ఆధ్వర్యంలో శుక్రవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయలకు రంగవల్లులు చిహ్నం అని, రైతులు పండించిన పంటలు ఇంటికి వచ్చినప్పుడు మహిళలు సంతోషంతో ముగ్గులు వేస్తారని, పిండి వంటలు చేసి ఆనందంగా గడుపుతారని మహిళా మండలి అధ్యక్షులు దుర్గాదేవీ వివరించారు. అనంతరం రంగవల్లుల పోటీలో పాల్గొన్న మహిళలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశామని తెలిపారు. అలాగే స్ఫూర్తి మహిళా మండలి రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ యూత్ వింగ్ అధ్యక్షులు లోకసాని కొండల్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్ఫూర్తి మహిళా మండలి సెక్రటరీ శ్రీదేవి, ట్రెజరర్ పద్మజ, విజయలక్ష్మి, శ్యామల, శారద, లోటస్ ల్యాప్ స్కూల్ ప్రిన్సిపాల్ లలిత రెడ్డి, పూర్ణిమ, రాధా శంకరన్, రమాదేవి, యోగా గురువు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- ఓజోన్ హాస్పిటల్ చైర్మెన్ సత్యసాయి ప్రసాద్



నవతెలంగాణ-ఎల్‌బీనగర్

ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఓజోన్ హాస్పిటల్ చైర్మెన్ సత్యసాయి ప్రసాద్ అన్నారు. ఓజోన్ హాస్పిటల్ వారి సహాయంతో జీహెచ్ఎంసీ సిబ్బందికి చెత్తసేకరణ రిక్షాలను అందజేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. వ్యర్థాలను తరలించకుంటే రకరకాల జబ్బులకు గురవుతారని చెప్పారు. ప్రజలకు సహాయం చేయడానికి హాస్పిటల్ ఎప్పుడు ముందుంటామన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

నవతెలంగాణ-హయత్‌నగర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందిన ఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హయత్‌నగర్ గణేష్‌నగర్, సాయి బాబా గుడి వద్ద నివాసం ఉంటున్న పాతులోతు హరికృష్ణ (22), ధరావత్ అనూష(21) ద్విచక్రవాహనంపై వనస్థలిపురం నుంచి గౌరల్లి వైపు వెళ్తున్నారు. ఈక్రమంలో అతన్ భాయ్ వెంచర్ వద్దకు చేరుకోగానే టర్నింగ్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఇనుప స్తంభాన్ని ఢీ కొట్టింది. దీంతో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ ఇద్దరు తుదిశ్వాస విడిచారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ధరావత్ అనూష (ఫైల్) పాతులోతు హరికృష్ణ



నీటిపారుదల శాఖ అభివృద్ధి సంస్థ చైర్మెన్‌గా ప్రమాణస్వీకారం చేసిన డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారికి బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపిన మహేశ్వరం నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెన్నంపల్లి జగన్మోహన్ శర్మ, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్షులు తులసి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు న్యాలకొండ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. -నవతెలంగాణ, సరూర్‌నగర్

వృద్ధుల జీవనోపాధికి చేయూతనివ్వాలి

- టీవీ సీరియల్ నటుడు ముఖేష్ గౌడ్



నవతెలంగాణ-ఘట్‌కేసర్

వృద్ధుల జీవనోపాధికి దాతలు చేయూత అందించాలని టీవీ సీరియల్ నటుడు ముఖేష్ గౌడ్ అన్నారు. శ్రీరాజమాత ఫౌండేషన్ స్థాపకుడు ఉదయ రెడ్డి ఆధ్వర్యంలో అన్నోజిగూడ వికలాంగుల కాలనీకి చెందిన వృద్ధురాలు ఐలమ్మకు తోపుడు బండిపై చిరుధాన్యాల వ్యాపారం కోసం రూ.15వేలు అందజేశారు. కరోనా వ్యాప్తించిన నాటినుంచి వికలాంగుల కాలనీలో సామాజిక సేవలు చేస్తున్నారని అభినందించారు. కార్యక్రమంలో సంస్థ వైస్ ప్రెసిడెంట్ మనోజ్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు పండు అజయ్, ప్రదీప్, అంజలి, కావ్య కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-హైదరాబాద్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థలోని పీడీ, పీఈటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం బూర్గుల రామకృష్ణ భవనంలో సాంఘిక సంక్షేమ గురుకుల కార్యదర్శి రొనాల్డ్ రాస్ చేతుల మీదుగా టేబుల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ కార్యదర్శి రాథోడ్ మాట్లాడుతూ గ్రేడ్ టు పీడీ నుంచి గ్రేడ్ వన్ పీడీగా ప్రమోషన్లు, 500 మంది పార్ట్ టైం పీఈటీలకు నెలకు రూ.18 వేలు ఇవ్వాలని కోరారు. సీఆర్‌టీలను వెంటనే రెగ్యులర్ చేయాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో వి.చందర్, శ్రీనివాస్, వాసు, కిషన్, హరికిషన్, నరసయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ అవుట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి హరీశ్‌రావు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణ, తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దుర్గం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నూకం బిక్షపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండీ రఫీఉద్దీన్, కోశాధికారి సుభాష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ శాంతి కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

-నవతెలంగాణ, వనస్థలిపురం

డివిజన్ అభివృద్ధికి సహకరించండి

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
- నాగోల్‌లో మార్నింగ్ వాక్



నవతెలంగాణ-నాగోల్

నాగోల్ డివిజన్‌లో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులకు సహకరించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మార్నింగ్ వాకింగ్‌లో భాగంగా ఎస్ఎన్‌డీపీ డీఈలు కృష్ణయ్య, వెంకట్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి శుక్రవారం నాగోల్‌లో పర్యటించారు. మమతానగర్, న్యూ మామతానగర్, సాయినగర్, నాగోల్ ఓల్డ్ విలేజ్, వెంకట్‌రెడ్డి నగర్, బి.కె.రెడ్డి నగర్, గ్రీన్ ఫీల్డ్ నగర్‌లలో ఇంటింటి తిరుగుతూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో తమ కాలనీలు వరద ముంపునకు గురవుతున్నాయని సమస్యను శాశ్వత పరిష్కరించాలని ఎమ్మెల్యేకు మొరపెట్టుకున్నారు. దీనికి ఆయన స్పందిస్తూ వరద ముంపును పరిష్కరించేందుకే పైపులైన్లు, బాక్స్ డ్రైన్స్ పనులు చేపడుతున్నామని చెప్పారు. ఈపనుల్లో భాగంగా కొంతమందికి ఇబ్బందులు ఎదురైనప్పటికీ ఎవరు కూడా ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తమపై నమ్మకం ఉంచి సంబంధిత అధికారులకు సహకరిస్తూ నాగోల్ డివిజన్ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తయితే వరద నీటి సమస్య నుంచి పూర్తిగా విముక్తి లభిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, నాయకులు ఆజాద్, శ్రీధర్ గౌడ్, రమేష్, నరేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బంది కృషి అభినందనీయం

- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి



నవతెలంగాణ-బడంగ్‌పేట్

బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధిలో శానిటేషన్ సిబ్బంది కృషి అభినందనీయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. శుక్రవారం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ కృష్ణమోహన్ రెడ్డితో కలిసి శానిటేషన్ సిబ్బందికి నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది ప్రతి రోజు చెత్త చెదారం లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా చేయటం వల్లనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. మున్సిపల్ సిబ్బంది కృషి, సహకారంతోనే దేశస్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మొదటి స్థానంలో నిలిచామని చెప్పారు. కార్యక్రమంలో డీఈఈలు అశోక్ రెడ్డి, జ్యోతి రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు అందించడమే లక్ష్యం

- మేయర్ దుర్గా దీప్‌లాల్ చౌహాన్



నవతెలంగాణ-మీర్‌పేట్

ఇంటింటికీ ప్రతిరోజు తాగునీరు అందించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహాన్ అన్నారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని 35వ డివిజన్ కార్పొరేటర్ గిల్లా సౌందర్య విజయ్ ఆధ్వర్యంలో తాగునీటి పైపులైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 35వ డివిజన్ పరిధిలో చాలా రోజులుగా ప్రజలు తాగునీటి విషయంలో ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. సమస్య పరిష్కారానికి మంత్రి సబితా ఇంద్రారెడ్డి రూ.8 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రి వాటర్ వర్క్స్ అధికారులకు ఆదేశించారని చెప్పారు. ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ భూపాల్ రెడ్డి, ఏఈ వివేక్, కాలనీవాసులు అంజయ్య, కృష్ణ, శివ, శ్రీనివాస్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైకి డ్రయినేజీ మురుగునీరు



నవతెలంగాణ-సంతోష్‌నగర్

యాకుత్‌పురా నియోజకవర్గం సంతోష్‌నగర్ డివిజన్ పరిధిలోని ఐసీఐసీఐ బ్యాంక్ వద్ద డ్రయినేజీ మురుగునీరు రోడ్లపైకి పొంగిపొర్లుతుంది. స్థానిక లక్కీ రెస్టారెంట్ వంటశాలలోని వేస్టేజీ, ఆయిల్ వ్యర్థాలు డ్రయినేజీలో కలవడంతో దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో పాదాచారులు, వాహనదారులు, బ్యాంకుకు వచ్చే కస్టమర్లు, విద్యార్థులు, చిరువ్యాపారులకు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. 15 రోజుల నుంచి డ్రయినేజీ మురుగునీరు పొంగిపొర్లుతున్న అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బస్తీవాసులు వాపోతున్నారు. దీనిపై అనేక సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకునే దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా వాటర్ వర్కర్స్ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పొంగిపొర్లుతున్న డ్రయినేజీ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి అంతర్జాతీయ ఫిస్ట్ బాల్ పోటీలు

నవతెలంగాణ-కంటోన్మెంట్



తెలంగాణ ఫిస్ట్ బాల్ అసోసియేషన్ అధ్వర్యంలో నేటి నుంచి రెండు రోజుల పాటు ఓల్డ్ ఎయిర్పోర్ట్ వద్ద ఉన్న శ్రీ వెంకటేశ్వర వేదనంత వర్ధిని సంస్కృత పాఠశాలలో పదో సబ్ జూనియర్ అంతర్ జిల్లా ఫిస్ట్ బాల్ ఛాంపియన్ షిప్ జరుగనుంది. తెలంగాణ ఫీజు బాల్ అసోసియేషన్ చైర్మన్ జంపన ప్రతాప్ శుక్రవారం మైదానంలో ఏర్పాట్లను పరిశీలించారు. మైదానం తో పాటు పరిసర ప్రాంతాల్లో చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేయాలని దాఫేదార్ గణేష్ ను ఆదేశించారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొనేందుకు ప్రాక్టీస్ చేస్తున్న బాలుర జట్టుతో కొద్దిసేపు జంపన ఫిస్ట్ బాల్ ఆడారు. ఈ కార్యక్రమంలో గణేష్, సిరాజ్, పవన్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బస్తీలో అభివృద్ధి పనుల పరిశీలన

నవతెలంగాణ-కంటోన్మెంట్



ఓల్డ్ బోయిన్‌పల్లిలోని అస్మత్‌పేట ఎస్సీ బస్తీలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ శ్రేణులు పరిశీలించారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశం మేరకు కార్పొరేటర్ నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ అరవింద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, వార్డ్ మెంబర్ నర్సింగ్ రావు, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ బుర్రి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి మాణిక్ రెడ్డి ప్రచారం

నవతెలంగాణ-సిటీబ్యూరో



మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మాణిక్ రెడ్డి శుక్రవారం నగరంలోని ఆసిఫ్‌నగర్ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో వ్యవహరిస్తుందన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేసేవరకు ఉద్యమించాలన్నారు. ఆరేండ్ల పాటు మీ పోరాటాలకు అండగా ఉండాల్సిన ఎమ్మెల్సీని ఎన్నుకునే విషయంలో 30 ఏండ్ల పాటు అనేక ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేసిన తన అభ్యర్థిత్వాన్ని కూడా పరిశీలించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పర్యవేక్షణ వ్యవస్థను పటిష్ఠం చేయకుండా జియో అటెండన్స్‌తో ఉపాధ్యాయులను అవమానపరచడం సరికాదన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శారద, రాష్ట్ర కమిటీ సభ్యుడు సింహాచలం, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్, జిల్లా కార్యదర్శులు ఉదయ్ కుమార్, రామస్వామి, క్రీడా కమిటీ కన్వీనర్ నాగేంద్ర, సీనియర్ నాయకులు నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

బేగంపేట డివిజన్ సమస్యలను పరిష్కరిస్తాం

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

బేగంపేట డివిజన్‌లోని దేవుడి ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీనిచ్చారు. శుక్రవారం ఆయన దేవుడి ప్రాంతంలో అధికారులతో కలిసి పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రయినేజీ ఓవర్ ఫ్లో సమస్యను పరిష్కరించాలని కోరగా, ఎయిర్ టెక్ మిషన్ ను తెప్పించి సివరేజీ లైన్ క్లీనింగ్ కు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోడ్లను నిర్మించాలని కోరగా, వెంటనే ప్రతిపాదనలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీ ప్రజల అవసరాల కోసం నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.40 లక్షలు మంజూరు చేస్తున్నట్టు చెప్పారు. అర్హులైన వారందరికి పెన్షన్‌లు అందించేందుకు దేవుడిలో మూడు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని తహశీల్దార్ అహల్యను మంత్రి ఆదేశించారు. తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాననీ, సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. మంత్రి వెంట కార్పొరేటర్ మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ ఉప్పల తరుణి, ముకుంద రెడ్డి, సుదర్శన్, శానిటేషన్ శ్రీనివాస్, వాటర్ వర్క్స్ మేనేజర్ శశాంక్, స్ట్రీట్ లైట్ అధికారి సాగర్, నాయకులు నరేందర్, శ్రీహరి, శ్రీనివాస్ గౌడ్, శేఖర్, కాలనీ అధ్యక్షుడు అఫ్జల్, తదితరులు ఉన్నారు.

పదవీ బాధ్యతలు చేపట్టిన వాసవీక్లబ్ ప్రతినిధులు



నవతెలంగాణ-కంటోన్మెంట్

సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందంజలో ఉండే వాసవీ క్లబ్ ఇంటర్నేషన్ సంస్థ శుక్రవారం నూతన కమిటీ ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్కానా శ్రీపురి కాలనీలోని క్లబ్ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న తోపాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవా కార్యక్రమంలో వాసవీ క్లబ్ ముందుండటం హర్షనీయమన్నారు. అనంతరం వాసవి క్లబ్ ప్రతినిధులు ఎమ్మెల్యే సాయన్నను సన్మానించారు. జాతీయ అధ్యక్షురాలు మిఎస్. పాలకుర్తి గాయత్రి, ఇంటర్నేషనల్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఆర్. రవిచంద్రన్, సెక్రటరీ ఇరుకుల రామకృష్ణ ట్రెజరర్ సంతోష్ చక్రవర్తి పదవీ బాధ్యతలు చేపట్టారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషన్ జాతీయ అధ్యక్షురాలు, సభ్యుల పదవీ బాధ్యతల కార్యక్రమానికి ఎమ్మెల్సీ దయానంద్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్, పోలీస్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్త, అమరవాది లక్ష్మినారాయణలు హాజరయ్యారు. ఆర్యవైశ్యులంటేనే సేవకు ప్రతి రూపం అని కొనియాడారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ, పేద ప్రజలను ఆదుకుంటూ వాసవీ క్లబ్ ఇంటర్నేషన్ సంస్థ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్ ప్రతినిధుల కార్యాలయం ఎదుట ఉన్న పార్కును దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే సాయన్నకు దృష్టికి తీసుకురాగా బోర్డు అధికారులతో మాట్లాడుతానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు రేపాల వెంకటేశ్వర్లు, వాసవీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తేలుకుంట సతీష్ గుప్తా, నాయకులు భాస్కర్ ముదిరాజ్, ఎమ్మెల్యే కుమార్తె నివేదిత పాల్గొన్నారు.

ఐకానిక్ చికెన్ బిగ్ మాక్ ని ప్రవేశపెడుతున్న మెక్ డొనాల్డ్స్

నవతెలంగాణ-హైదరాబాద్

గ్లోబల్ సక్సెస్ తర్వాత, ఐకానిక్ చికెన్ బిగ్ మాక్ ఇప్పుడు మన దేశంలో ప్రారంభించబడింది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న చికెన్ బిగ్ మాక్ బర్గర్ను విడుదల చేసింది. బ్రాండ్ ఈ గ్రాండ్ లాంచ్ కోసం దిగ్గజ, స్వాష్బక్లింగ్ ఓపెనింగ్ బ్యాట్స్మెన్, మాజీ భారత కెప్టెన్ వీరేంద్ర సెహ్వాగ్ని ఎంపిక చేసింది. ఈ సందర్భంగా మెక్డొనాల్డ్స్ ఇండియా (వెస్ట్ అండ్ సౌత్) మార్కెటింగ్ అండ్ కమ్యూనికేషన్స్ సీనియర్ డైరెక్టర్ అరవింద్ ఆర్పి మాట్లాడుతూ... చికెన్ బిగ్ మాకు భారతదేశంలో ప్రారంభించడం పట్ల తాము సంతోషిస్తున్నామన్నారు. మరో మెనూ ఆవిష్కరణ, తమ కస్టమర్ల కోసం పరిమిత సమయం అందిస్తున్నామన్నారు. చికెన్ బిగ్ మాక్ అనేది ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకమైన ఈక్విటీని కలిగి ఉన్న ఒక ఐకానిక్ ఉత్పత్తి అన్నారు. భారత మాజీ కెప్టెన్ వీరేంద్ర సెహ్వాగ్ మాట్లాడుతూ... మెక్డొనాల్డ్స్ ఇండియాతో సహకరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఇది ఎల్లప్పుడూ తనకు ఇష్టమైన బ్రాండ్ అని, చికెన్ బిగ్ మాక్ రాక గురించి తాను సంతోషిస్తున్నానన్నారు. డీడీబీ ముద్ర క్రియేటివ్ హెడ్ వెస్ట్ పల్లవి చక్రవర్తి మాట్లాడుతూ.. చికెన్ బిగ్ మ్యాక్ తో పోల్చితే ప్రతి పెద్ద పేరు ఎలా మారుతోందో చూపించడానికి తాము ప్రముఖ భారతీయ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ భాగస్వామ్యం చేసుకున్నామన్నారు.



మల్లాపూర్ డివిజన్ పరిధిలో జై భీమ్ జెండా పండగను ఘనంగా నిర్వహించారు. మల్లాపూర్‌లోని ఎలిఫెంట్ సర్కిల్ వద్ద నల్ల బాలు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన జై భీమ్ జెండాను ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, మీర్‌పేట-హౌసింగ్ బోర్డు కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్, నాచారం ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, కొత్త రామారావు, సాయి జెన్ శేఖర్, నల్ల బాలు, పళ్ల కిరణ్ కుమార్ రెడ్డి, యెడల మల్లేష్, తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కాప్రా



ఉప్పల్ నియోజకవర్గం చర్లపల్లి డివిజన్ ఆదర్శ్ నగర్ చెందిన బండారి నర్సింహ కణతి సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆర్థిక పరిస్థితి బాగోలేక చికిత్స చేయించుకునే స్థోమత లేదని స్థానిక కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌ని సంప్రదిస్తే వెంటనే రూ.లక్ష వరకు ఖర్చు అవుతుందని తెలియజేయడంతో వెంటనే సీఎం సహాయనిధి ద్వారా ఎల్వోసికి అప్లై చేయించి దగ్గర ఉంచి రూ.75వేలు మంజూరు చేయించారు. చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ కుటుంబ సభ్యులను కలిసి చెక్కును అందజేశారు. నవతెలంగాణ-కాప్రా

అభివృద్ధి పనులపై కార్పొరేటర్ సమీక్ష

నవతెలంగాణ-కాప్రా



డివిజన్‌లో ఇదివరకే మంజూరైన పనులు, ప్రారంభమైన పనులు, పెండింగ్‌లో ఉన్న పనులపై వార్డు కార్యాలయంలో అధికారులతో కలిసి నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ సమీక్ష నిర్వహించారు. ప్రధానంగా ఇదివరకే మంజూరైన నాలుగు బ్రిడ్జిల నిర్మాణం విషయమై పనులు ప్రారంభం కాలేదని తక్షణమే పనులు ప్రారంభించాలన్నారు. ఇదివరకే మంజూరైన అంబేద్కర్ యువజన సంఘం భవనం, హనుమాన్ నగర్ సామాజిక భవనం నిధులు మంజూరై ఏడాది గడుస్తున్నా ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడంపై కార్పొరేటర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగిలిన పనులను తక్షణమే ఆలస్యం చేయకుండా ప్రారంభించాలన్నారు. కొన్ని కొత్త ప్రతిపాదనలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిలాల్, డిప్యూటీ ఇంజినీర్ రూప, అసిస్టెంట్ ఇంజినీర్ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, టీఆర్ఎస్ నాయకులు సాయి జన్ శేకర్ పాల్గొన్నారు.

తటాకం రమేష్ శర్మ బాధ్యతలు స్వీకరణ

నవతెలంగాణ-మేడ్చల్ కలెక్టరేట్



కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ నూతన చైర్మన్‌గా తటాకం రమేష్ శర్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆలయంలోని స్వామివారిని రమేష్ శర్మ దంపతులు దర్శించుకుని అనంతరం మహా మండపంలో వేద పండితుల ఆశీర్వచనాలు అందించి ఆలయ అధికారులతో ప్రమాణం చేయించి బాధ్యతలు అప్పగించారు. ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రి మల్లారెడ్డి, ఆలయ చైర్మన్ రమేష్ శర్మను అభినందించి ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని పేర్కొన్నారు. వచ్చే కీసరగుట్ట జాతర బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడానికి అందరిని కలుపుకుని పని చేయాలని తెలిపారు. అనంతరం వివిధ పార్టీల నాయకులు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు పెద్ద రమేష్ శర్మను శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ, కీసర సర్పంచ్ నాయకపు మాధురి, ఉప సర్పంచ్ తటకం లక్ష్మణ్, ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తోటకూర జంగయ్య యాదవ్, సింగిరెడ్డి హరి వర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నక్కా ప్రభాకర్‌గౌడ్, నాగారం, దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మన్‌లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-కాప్రా

నాచారం అంబేద్కర్‌నగర్ లో నివసించే రమణ అనే నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ హాస్టల్లో ఆయాగా పని చేస్తున్నది. ఇదివరకే అనారోగ్య కారణాలతో భర్త కూడా చనిపోయారు. కొద్దిరోజుల క్రితం చౌటుప్పల్‌లో జరిగిన ప్రమాదంలో తన రెండు కాళ్ల కోల్పోయింది. ఈమెకు బాబు, పాప ఉన్నారు. వీరి చదువులకుగాను ఇల్లు గడవడానికి గానీ తీవ్ర ఇబ్బందులు పడుతున్న సంగతి తెలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి బాధిత మహిళ కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యాన్నిచ్చారు. వారి కుటుంబ పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. బాధిత మహిళ దళిత కావడంతో దళిత బంధు రూ.పది లక్షలు అందేలా చూస్తామని హామీనిచ్చారు. బాధిత మహిళకు కృత్రిమ కాళ్ల ఏర్పాటుకు సహకరిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో నాచారం సీఐ కిరణ్ కుమార్, సాయిజెన్ శేఖర్, కొత్త రామారావు, ముత్యం రెడ్డి, అంజి, రామకృష్ణ, అశోక్, గణేష్, నర్సింగ్ రావు, హరిప్రసాద్, కట్టబుచ్చన్న గౌడ్, రఫీక్, యాకి, భాను, రవి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించాలి



నవతెలంగాణ-బేగంపేట్

విద్యార్థులకు విద్యార్థి దశలోనే విలువలతో కూడిన విద్యను అందించి సమాజానికి, దేశానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని సెంట్రల్ యూనివర్శిటీ రీసర్చ్ డెవలప్మెంట్ స్కిల్ డైరెక్టర్ ప్రొఫెసర్ సామ్రాట్ ఎల్ సబటు ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం హరిహర కళాభవన్‌లో సదాశివ హై స్కూల్ ఫిరోజ్‌గూడ, హై స్కూల్ (యు పోనీ) వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథి అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశభక్తి, సంస్కృతిని కూడా బోధించాలన్నారు. విద్యా సంస్థల నిర్వహణ అంటే మంచి సమాజం నిర్మించడమే అన్నారు. అదే దిశలో సదాశివ హై స్కూల్ పయణిస్తుందని అభినందించారు. సమాజంలో డబ్బు అనేది ముఖ్యమైనదే కానీ దానికి బానిసలు కాకూడదని సూచించారు. కరోనా సమయంలో చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా అందరూ మొబైల్ ఫోన్లకు అతుక్కుని పోయారనీ, ప్రతి రోజూ 4 నుంచి 5 గంటలకు దాంతోనే గడుపుతున్నారని తెలిపారు. ఫోన్ ద్వారా సమాచారం, విజ్ఞానం పొందవచ్చనీ, కేవలం వినోదం కోసం అంత సమయం వృథా చేయడం సరికాదన్నారు. సదాశివ హై స్కూల్ గ్రూప్ ఫౌండర్ చైర్మన్ డాక్టర్. ఎస్.శివరావు మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు 100శాతం విద్య బోధించడంలో ముందున్నట్టు తెలిపారు. ప్రతిభగల విద్యార్థులను తీర్చిదిద్దడమే సదాశివ స్కూల్ గ్రూపు ఉద్దేశమన్నారు. స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు కుటుంబంలాగా ఉంటే స్కూల్ కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో సదాశివ స్కూల్ బ్రాంచ్ డైరెక్టర్ వెంకటరమణ, అకాడమిక్ శర్మ ప్రిన్సిపాల్‌లు హర్షిత, నీరజ, వాణి, రాజకుమార్, నాగేందర్, సుమ, లక్ష్మణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు..

ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ కట్టిపడేశాయి. భారతీయ సాంప్రదాయాలు, ఉత్సవాల గొప్పదనాన్ని వివరిస్తూ చేసిన నాటికలు అందరిని అలరించాయి. అలాగే వివిధ రకాల ఆటాపాటలు విద్యార్థులను, తల్లిదండ్రుల్ని మంత్ర ముగ్దుల్ని చేశాయి.

పేదవారిని సహృదయంతో ఆదుకోవాలి


నవతెలంగాణ-జవహర్‌నగర్



పేదవారిని సహృదయంతో ఆదుకోవాలనీ, గ్రేస్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని 28వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బూడిద వెంకటేశ్ అన్నారు. శుక్రవారం కార్పొరేషన్ లోని 28వ డివిజన్ మదర్ థెరిస్సా కాలనీలో కుష్టు రోగులకు గ్రేస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 60 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కుష్టువ్యాధిగ్రస్తులను ప్రేమతో ఆదరించి, సాయం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేస్ సొసైటీ ప్రతినిధులు మురళీకృష్ణరెడ్డి, సైదులు, సతీష్, నాయకులు రమేష్, మేరి, సుజాత, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ స్నాచింగ్ గ్యాంగ్ అరెస్టు

నవతెలంగాణ-సిటీబ్యూరో



సెల్ ఫోన్‌ను లాకెళ్తున్న ముగ్గురు దొంగలను సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 9 సెల్‌ఫోన్లు, బజాజ్ పల్సర్‌ను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఈస్ట్‌జోన్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీసీపీ చక్రవర్తితో కలిసి డీసీపీ సునిల్ దత్ తెలిపిన వివరాల మేరకు మాదన్నపేట్‌కు చెందిన మహ్మద్ ఇషాక్, మహ్మద్ తహౌద్దీన్, మహ్మద్ కైఫ్‌లు చిన్ననాటి స్నేహితులు. వీరు ఒక ముఠాగా ఏర్పడ్డారు. జల్సాలకు అలవాటైన ఇషాక్ సులువుగా డబ్బులు సంపాదించాలని 2018లోనే పలు చోట్ల సెల్‌ఫోన్లు చోరీ చేశాడు. ఈ క్రమంలో పలుసార్లు జైలుకెళ్లొచ్చినా నిందితుడిలో మార్పు రాలేదు. మిగిలిన వారితో కలిసి ద్విచక్రవాహనాన్ని చోరీ చేశాడు. ఆ తర్వాత రోడ్డుపై, కాలనీలల్లో ఒంటరిగా వెళ్లేవారిని, మహిళలను టార్గెట్ చేసేవారు. ద్విచక్రవాహనంపై వెంబడిస్తూ అదునుచూసి బాధితుల చేతిలోని సెల్‌ఫోన్లను లాక్కెళ్తున్నారు. హైదరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిల్లో స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నిందితులపై ఇన్‌స్పెక్టర్ ఎస్.రాఘవేంద్ర ప్రత్యేక నిఘా వేశారు. డీసీపీ ఆదేశాలతో ఎస్ఐలు వి.నరేందర్, ఎన్.శ్రీశైలం, షేక్ బురాన్, కె.నర్సింహులుతో పాటు సుల్తాన్ బజార్ పోలీసులతో కలిసి నిందితులను అరెస్టు చేశారు. ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్విచక్రవాహనం చోరీ చేసినట్టు నిందితులు అంగీకరించారు. చోరీ చేసిన వాహనంపై సంచరిస్తూ నేరాలు చేస్తున్నట్టు పోలీసులు విచారణలో తేల్చారు.

11 నుంచి తాజ్ కృష్ణలో సూత్ర ఎగ్జిబిషన్



నవతెలంగాణ-బంజారాహిల్స్

దేశంలోని ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్లు రూపొందించిన దుస్తులు, చేనేత కళాకారుల రూపొందించిన కళాఖండాలతో ఈనెల 11, 12, 13 తేదీలలో తాజ్ కృష్ణలో ప్రీమియం ఫ్యాషన్ పేరుతో ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను మోడల్స్ శుక్రవారం ఆవిష్క రించారు. అనంతరం వారు వివిధ రకాల దుస్తులను ధరించి ప్రదర్శించారు. మూడు రోజులపాటు కొనసాగే ఎగ్జిబిషన్‌లో ఫ్యాషన్ డిజైనర్లు ఆధునిక సాంప్రదాయ మేలవింపుతో రూపొందించిన వస్త్రాలను ప్రదర్శిస్తారని చెప్పారు.

వినూత్నంగా దున్నపోతుకు వినతిపత్రం అందజేత



నవతెలంగాణ-ఓయూ

ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థుల పరిష్కార పోరాట సమితి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం హబ్సిగూడలో వినూత్నంగా దున్నపోతుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.1600 మీటర్లు 800 మీటర్లు క్వాలిఫై అయిన అభ్యర్థులకు మెయిన్స్ ఎగ్జామ్ లో అవకాశం ఇవ్వాలని, ప్రిలిమ్స్ ఎగ్జామ్‌లో 7 మార్కులు కలపాలని, హైకోర్టు ఇచ్చిన తీర్పును వెంటనే అమలు చేయాలని, ఆంధ్ర ప్రాంతానికి చెందిన పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డ్ డైరెక్టర్ శ్రీనివాసరావును తొలిగించాలని డిమాండ్ చేశారు.అభ్యర్థుల సమస్యలను పరిష్కరించకపోతే జనవరి 9న ఛలో హైదరాబాద్ పేరుతో ప్రగతి భవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు.

స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జె కుమారస్వామి, ఎం వెంకటేష్
- సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ



ముషీరాబాద్

నవతెలంగాణ-ముషీరాబాద్

స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పేదలకు ఉపయోగపడుతున్న 72 స్కీముల ప్రయివేటీకరణ చేయాలనే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకుని ఆ స్కీములలో పనిచేస్తున్న వర్కర్లకు కనీస వేతనం రూ. 26,000 నిర్ణయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో గోల్కొండ క్రాస్ రోడ్ నుండి ఆర్టీసీ క్రాస్ రోడ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జె కుమార స్వామి, ఎం వెంకటేష్‌లు మాట్లాడుతూ ఈ స్కీంల ద్వారా దేశంలో ఎంతో మంది పేదలు లబ్ది పొందుతున్నారని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా కరోనా లాంటి విపత్కర పరిస్థితిలో వచ్చినప్పుడు నేషనల్ హెల్త్ మిషన్ స్కీం కింద ఆశా వర్కర్లు చేసిన కృషిని ప్రపంచ ఆరోగ్య సంస్థ సైతం గుర్తిస్తే కేంద్ర ప్రభుత్వం మాత్రం కనీసం స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించే పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి స్కీములకు బడ్జెట్ పెంచి విస్తృతంగా పేదలకు ప్రభుత్వ సేవలు అందించేలా కృషి చేయాలని కోరారు. స్కీమ్ వర్కర్లకు ఈఎస్ఐపిఎఫ్ సౌకర్యం కల్పించాలని, కార్మిక చట్టాలు వర్తింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నగర కోశా ధికారి ఆర్ వాణి, నగర కమిటీ సభ్యులు పీ పుల్లారావు, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షులు టి యాదమ్మ, ఉపాధ్యక్షులు రమ, రాధిక, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ధూల్‌పేట్ : సీఐటీయు గోషామహల్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో నాంపల్లి మండల తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు గోషామహల్ కన్వీనర్ కె. జంగయ్య మాట్లాడుతూ.. స్కీమ్ వర్కర్ల సమస్యల పరిష్కరించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



ధూల్‌పేట్

కార్యక్రమంలో కో కన్వీనర్ నెమ్మాది కిరణ్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు డి.పద్మ , జి. అండాలమ్మ ,కె. సుభద్ర ,యం.మంగ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

17 మంది ఆకతాయిల అరెస్టు



- పది రోజుల జైలు శిక్ష విధించిన కోర్టు

నవతెలంగాణ-ముషీరాబాద్

బహిరంగ ప్రదేశంలో మాదక ద్రవ్యాలు సేవించి న్యూసెన్స్ క్రియేట్ చేస్తున్న 17 మంది ఆకతాయిలను ముషీరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్స్పెక్టర్ జహంగీర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. వైయస్సార్ పార్క్, పార్సిగుట్ట చౌరస్తా, సెట్విన్ గ్రౌండ్, బోలక్ పూర్, కత్ని కాంటా, గోల్డెన్ క్రౌన్ హోటల్, ఏక్ మినార్ మసీద్, బంధన్ ఫంక్షన్ హాల్, దేవీ చౌక్, తదితర ప్రాంతాలలో ఆకతాయిలు బహిరంగంగా మాదక ద్రవ్యాలు సేవిస్తూ స్థానికులను ఇబ్బందులు గురి చేస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు ఇన్స్పెక్టర్ జహంగీర్ యాదవ్ మార్గదర్శకంలో డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ ప్రశాంత్, ఎస్సైలు సురేందర్, స్వప్న ,ప్రసాద్ రెడ్డి, సోమశేఖర్ లు మెరుపు దాడులు చేసి అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా నిందితులకు పది రోజుల జైలు శిక్ష విధించినట్టు తెలిపారు.

విజయ డెయిరీ ఉత్పత్తులను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకొస్తున్నాం

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- నుమాయిష్‌లో విజయ డెయిరీ ఉత్పత్తుల స్టాల్ ప్రారంభం



నవతెలంగాణ -సుల్తాన్‌బజార్

విజయ డెయిరీ ఉత్పత్తులను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకొస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన 82వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్)లో విజయ డెయిరీ ఉత్పత్తుల స్టాల్‌ను ఆయన శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారం భించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాం పల్లి ఎగ్జిబిషన్ కు వివిధ ప్రాంతాల నుండి వచ్చే ప్రజలకు విజయ ఉత్పత్తులు అందు బాటులో ఉంచాలని స్టాల్ నిర్వాహకులకు సూచించారు. ఎంతో నాణ్యమైన విజయ డెయిరీ ఉత్పత్తులకు మొదటి నుంచి ప్రజాదరణ ఉందని చెప్పారు. గత ప్రభుత్వాలు విజయ డెయిరీని పట్టించు కోలేదన్నారు. మూసివేసే దశలో ఉన్న విజయ డెయిరీని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అభివృద్ధికి సహకరిం చడంతో ఇప్పుడు విజయ డైరీ 700 కోట్ల రూపాయల కు పైగా టర్నోవర్ కు చేరుకుందని పేర్కొ న్నారు. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవతో విజయ డెయిరీ ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. నూతన ఉత్పత్తులు కూడా అనేకం వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ గౌరవ ఉపాధ్యక్షులు అశ్విన్ మార్గం, నాయకులు ఆనంద్ కుమార్ గౌడ్, స్టాల్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌లో చెత్త సేకరణకు అనుమతివ్వాలి



నవతెలంగాణ-ఓయూ

హైదరాబాద్ లోయర్ ట్యాంక్ బండ్ టీబీటీ డంపింగ్ యార్డ్‌లో చెత్త సేకరణకు అనుమతి ఇవ్వాలని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డిలను కార్మికులు శుక్రవారం కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. డంపింగ్ యార్డులో ఉన్న ప్లాస్టిక్ బాటిల్స్, సంచులు, పేపర్ తదితర వాటిని సేకరించి జీవనోపాధి పొందుతున్న తమ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. చెత్త సేకరణకు రాంకీ సంస్థ అనుమతి ఇవ్వాలని, తగిన జాగ్రత్తలు తీసుకుంటూ చెత్త సేకరణ చేస్తామని అనుమతి ఇవ్వాలని కోరారు. డిప్యూటీ మేయర్ స్పందిస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్, జోనల్ కమిషనర్ అధికారులతో మాట్లాడి చెత్త సేకరణకు అనుమతులు ఇస్తూ పలు జాగ్రత్తలతో చెత్తను సేకరించాలని, తదుపరి ఎటువంటి దుర్ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ యాదగిరి, కార్మికులు పాల్గొన్నారు.

బీసీల బడ్జెట్ రూ. 20 వేల కోట్లకు పెంచాలి

- ఎంపీ ఆర్ కృష్ణయ్య
- మంత్రి హరీశ్‌రావుకు వినతి పత్రం



నవతెలంగాణ-అడిక్‌మెట్

బీసీల బడ్జెట్‌ను రూ. 20వేల కోట్లకు పెంచాలని జాతీయ బీసీ సంఘం నాయకులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య కోరారు. శుక్రవారం తెలంగాణ ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావును ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ. బీసీలకు కేటాయించిన బడ్జెట్ కేవలం రెండు శాతం లోపు ఉందన్నారు. 52 శాతం జనాభా గల బీసీలకు కనీసం 10 శాతం బడ్జెట్ కేటాయించాలని కోరారు. బడ్జెట్‌లో బిసి కార్పొరేషన్ కు సబ్సిడీ రుణాల కోసం రూ. 4 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు. ఎంబీసీ కార్పొరేషన్‌కు రూ. 2 వేల కోట్లు కేటాయించి 12 బి.సి కులాల ఫెడరేషన్లకు జనాభా నిష్పత్తిలో రూ. 2 వేల కోట్లు కేటాయించాలని కోరారు. విదేశ విద్య స్టైఫండ్ స్కీమ్ కింద అర్హులందరికీ స్టై ఫండ్ ఇవ్వడానికి బడ్జెట్ రూ. 60 కోట్ల నుంచి రూ. 300 కోట్లకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ప్రతీ అసెంబ్లీ నియో జకవర్గానికి ఒక బి.సి గురుకుల పాఠశాల మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలో 290 కాలేజీ హాస్టళ్లు కొనసాగుతున్నాయని, అన్ని కాలేజీ హాస్టళ్లు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని తెలిపారు. అద్దె భవనాలకు ఏటా కోట్ల రూపాయల అద్దెలు చెల్లిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభు త్వం 80 శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇస్తుందని.. రాష్ట్ర ప్రభు త్వం 20 శాతం మ్యాచింగ్ గ్రాంటు కింద దశల వారీగా సొంత భవనాలు నిర్మించడానికి ఈ బడ్జెట్లో రూ. 200 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కులాంతర వివా హాలు చేసుకొనే బి.సి కులాల వారికి ప్రోత్సాహక పారి తోషికం రూ. 2 లక్షల 50 వేలకు పెంచాలి అని అన్నారు. తమ న్యాయమైన డిమాండ్లకు మంత్రి హరీశ్‌రావు సానుకూలంగా స్పందించారని తెలిపారు. బీసీల బడ్జెట్, పెద్ద ఎత్తున పెంచుతామని హామీ ఇచ్చారన్నారు ముఖ్యమంత్రితో మాట్లాడి బీసీ డిమాండ్ పరిష్కరిస్తామని చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, లాల్ కృష్ణ, నీల వెంకటేష్, సి. రాజేందర్, నరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు
- పార్క్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే గోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

హైదరాబాద్ లాంటి మెట్రో నగరాల ప్రజలు ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని, ప్రతీ ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం సుందరయ్య పార్క్ వాకర్స్ క్లబ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, వాకర్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు డాక్టర్ ఎస్ పి రవీంద్రలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నగరంలోని పార్కుల్లో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా ప్రతీ ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ పార్కులో వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పార్కులో గ్రీనరీ పెంచడానికి రూ. 85 లక్షల నిధులతో అభివద్ధి పనులు చేపడుతున్నామని, పార్క్ అభివృద్ధి కోసం మరింత సహకరిస్తానని తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షుడిగా రమేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నిరంజన్ రెడ్డి కోశాధికారిగా సునీల్ తదితరులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు ముఠా జై సింహా, సీపీఐ(ఎం) ముషీరాబాద్ కన్వీనర్ ఎం దశరథ్, అడ్వైజర్ వెంకటకష్ణ, కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, ఆర్ సంతోష్ గౌడ్, బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షులు రావులపాటి మోజెస్, ప్రధాన కార్యదర్శి మన్నె దామోదర్ రెడ్డి, సుందరయ్య పార్క్ వాకర్స్ మాజీ అధ్యక్షులు పాండయ్య, శ్రీనివాస్ రెడ్డి, హైదరాబాద్ జిందాబాద్ కార్యదర్శి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలోనే హెల్మెట్ ధరించడం అలవర్చుకోవాలి



నవతెలంగాణ - ధూల్‌పేట్

విద్యార్థి దశలో నుంచే హెల్మెట్ ధరించడం అలవర్చుకోవాలని కాలా పత్తర్ ఇన్స్పెక్టర్ బుచ్చన్న అన్నారు. కాలా పత్తర్‌లోని గోల్డెన్ జూబ్లీ హైస్కూల్‌లో ట్రాక్స్ రోడ్డు సేఫ్టీ ఎన్జీవోస్ బందంతో కలిసి విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు హెల్మెట్ ప్రాముఖ్యత, వాడకంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంట్లో వాహనాలు నడిపే పెద్దలైన వారు తండ్రులు హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకుంటే వారిని చూసి పిల్లలు అలవాటు చేసుకుంటారు అన్నారు. హెల్మెట్ పై అవగాహన కల్పించడం పై వారిని అభినందించారు. ద్విచక్ర వాహనదారులు బైక్ లు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్లు పాఠశాల డైరెక్టర్ హైదర్ రజా అన్నారు. రోడ్డు ప్రమాదాలలో 70శాతం మరణాలు తలకు దెబ్బలు తగలడం వల్లనే సంభవిస్తున్నాయన్నారు. బైక్ నడిపేవారితోపాటు వెనుక కూర్చున్నవారు కూడా హెల్మెట్ ధరించాలన్నారు. అనంతరం ట్రాక్స్ రోడ్ సేఫ్టీ ఎన్జీవో సహకారంతో సుమారు వంద మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. అనంతరం బస్తీలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాక్స్ రోడ్ సేఫ్టీ సంస్థ ప్రతినిధులు రాధికా జైన్, రాజీశ్ నీమ్కర్, ఎం.ఎ ఐడియల్ స్కూల్ ప్రిన్సిపాల్ అన్వర్, పాఠశాల ప్రిన్సిపాల్ అబ్బాస్ రజా తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు లెనిన్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు లెనిన్ గువేరా డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా డీఆర్ఓ సూర్యలతను ఆమె కార్యాలయంలో కలిసి పెండింగ్‌లో ఉన్న రియంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, మెస్ కాస్మొటిక్స్ చార్జీలు రూ. 1500 నుంచి రూ. 3000కు పెంచాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం లెనిన్ గువేరా మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల ఫీజు బకాయిలు రూ. 3500 కోట్లు పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. విద్యార్థుల విద్యా సంవత్సరం పూర్తై చాలా కాలం అవుతున్నా ఫీజు రియంబర్స్ మెంట్ విడుదల కాకపోవడంతో విద్యార్థులు అనేక ఆందోళనలకు గురవుతున్నారని తెలిపారు. విద్యార్థులు తమ కళాశాలకు వెళ్లి సర్టిఫికెట్లను అడిగితే ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల కాలేదు అని.. మీరు ఫీజు మొత్తాన్ని చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని యాజమాన్యాలు అనడంతో విద్యార్థులు డబ్బులు లేక తమ సర్టిఫికెట్లను తీసుకోలేని స్థితిలో ఉన్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఫీజులు బాకాయలను విడుదల చేయకపోవడం వల్ల ఎస్సీ ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్షిప్స్ లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. హైదరాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు నాగేందర్, వీరేందర్, శివ, వేణు, వసు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ కవిత



- పాల్గొన్న మాజీ రాష్ట్ర కౌన్సిల్ చైర్మెన్, కార్పొరేషన్ చైర్మెన్‌లు, కేంద్ర సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజేందర్, ప్రతాప్

నవతెలంగాణ-సిటీబ్యూరో

టీఎన్జీవోస్ యూనియన్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు సేవారత్న, సేవా భూషణ్, ప్రజారత్న, డాక్టర్ సయ్యద్ మజీదుల్లాహ్ హుస్సేని(ముజీబ్), జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో శుక్రవారం డైరీ, క్యాలెండర్-2023 ఆవిష్కరణ నాంపల్లి గృహకల్ప ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, రాష్ట్ర మాజీ కౌన్సిల్ చైర్మెన్ కనకమామిడి స్వామి గౌడ్, కార్పొరేషన్ చైర్మెన్లు ఆయాచితం శ్రీధర్, మొహమ్మద్ సలీం, గజ్జల నగేష్, మసీఉల్లహ్ ఖాన్, మొహమ్మద్ ఇంతియాజ్ ఇసాక్, రావుల శ్రీధర్ రెడ్డి, కేంద్ర సంఘ అధ్యక్షులు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి రాయకంటి ప్రతాప్ పాల్గొన్నారు. అలాగే కేంద్ర సంఘ నాయకులు, 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు హైదరాబాద్ జిల్లాలోని సుమారు 70 యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు, ప్రాథమిక సభ్యులు వచ్చారు. అంతకుముందు కీర్తిశేషులు ఏ.ఎం.చంద్రశేఖర్‌కు నివాళిగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు, సంఘంలో తమ వంతు సహాయంగా పనిచేస్తున్న సుమారు 15 మంది పెద్దలకు ప్రత్యేక అవార్డు అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. డిసెంబర్ నెలలో నిర్వహించిన 8వ స్పోర్ట్స్, గేమ్స్‌లో గెలుపొందిన విజేతలకు ట్రోఫీలు అందజేశారు. జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా అయిదోసారి ఎన్నుకున్నందుకు డాక్టర్ ముజీబ్ ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ ఆవిష్కరణ సభకు విచ్చేసిన మంత్రులకు తెలంగాణ ఉద్యో గులకు సంబంధించిన పలు సమస్యల ఎజెండా సమ ర్పించి, తక్షణమే ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖ ర్‌రావు రావు హయాంలో పరిష్కరించాల్సిందిగా ప్రత్యేకంగా ఆయన కోరారు. శాఖాహార, మాంసాహార భోజన సదు పాయం కల్పించారు. ప్రత్యేక ఆహ్వానితులతో పాటు సభను విజ యవంతం చేసిన సుమారు 3వేల మంది ఉద్యోగులకు, పోలీస్ సిబ్బందికి, మీడియా సిబ్బందికి, బ్రైట్ ఆడి యో విజువల్స్‌కి డాక్టర్ ముజీబ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సూపర్ డిస్‌ప్లేలు, సూపర్ ఛార్జింగ్ ని తీసుకువస్తున్న షవోమీ ఇండియా

నవతెలంగాణ-హైదరాబాద్

దేశంలోనే నంబర్ 1 స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ షవోమీ ఇండియా మిడ్-సెగ్మెంట్ పరిధిలో స్మార్ట్ ఫోన్ పనితీరును పునర్నిర్వచించే మూడు పరికరాలను విడుదల చేసి తన లెజెండరీ రెడ్మి నోట్ సిరీస్ కు కొత్త కోణాన్ని జోడించింది. భారతదేశంలోని స్మార్ట్‌ఫోన్ సిరీస్కి తాజా చేర్పులలో స్మార్ట్‌ఫోన్ కెమెరాలో కనిపించే గొప్ప ఇమేజ్ రిజల్యూషన్, కొత్త అడాప్టివ్ సింక్ అమోల్డ్ డిస్ప్లేలు, 5జి కనెక్టివిటీ, నమ్మశక్యం కాని వేగవం తమైన ఛార్జింగ్ వేగం తదితర ఫీచర్లున్నాయి. ఈ సందర్భంగా షవోమీ ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అనుజ్ శర్మ మాట్లాడుతూ... రెడ్మినోట్ సిరీస్ ఎల్లప్పుడూ సాంకేతికతను ప్రజాస్వామ్యీకరించడం, ప్రీమియం పరికరాలతో సాధారణంగా అనుబం ధించబడిన ఫీచర్లు, ఫంక్షన్లను ప్రధాన స్రవంతి వినియోగదారునికి అందించడమన్నారు. రెడ్మి నోట్ 12 సిరీస్ ఈ సంప్రదా యాన్ని మరింత ముందుకు తీసుకువెళుతుందన్నారు. స్మార్ట్‌ఫోన్ కెమెరాలో ఇప్పటివరకు చూడని గొప్ప రిజల్యూషన్, టాప్ నాచ్ డిస్‌ప్లేలు నాణ్యత, అత్యాధునిక కనెక్టివిటీ, అత్యంత వేగవంతమైన ఛార్జింగ్ స్పీడ్ వంటి ఫీచర్లు, అన్నీ షవోమీ ఉత్పత్తి శ్రేణిని సూచించే ట్రేడ్మార్క్ నిజాయితీ ధరలో అందిస్తోందన్నారు. విశ్వసనీయ పనితీరుతో పాటు వీటన్నింటిని అందజేస్తోందన్నారు. అందుకే తాము దీన్ని సూపర్ నోట్ అని పిలుస్తున్నామన్నారు.

పోలీస్ అభ్యర్థులను మెయిన్స్‌కు అనుమతించాలి

- ఏఐఎఫ్‌బి పార్టీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి బి.రాములు యాదవ్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్ర పోలీస్ అభ్యర్థుల ఈవెంట్స్‌లో భాగంగా రన్నింగ్‌లో క్వాలిఫై అయిన వారిని మెయిన్స్ రాసేలా అనుమతి ఇవ్వాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బి) పార్టీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి బి.రాములు యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ ఈవెంట్స్ లో నాలుగు మీటర్ల లాంగ్ జంప్ పెట్టడం ఎక్కడా లేదన్నారు. పక్క రాష్ట్రం ఏపీలో నాలుగు మీటర్లు తక్కువే ఉందని గుర్తు చేశారు. ప్రిలిమ్స్‌లో తప్పుగా ఇచ్చిన ఏడు ప్రశ్నలకు మార్కులు కలపాలని కోరారు. ఈవెంట్స్‌లో ప్రమాణాలు చాలా కఠినంగా ఉన్నాయని వెంటనే వీటిని సవరించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం ఏఐఎఫ్‌బీ సనత్ నగర్ నియోజకవర్గం కన్వీనర్ వెంకటేశ్వర యాదవ్ మాట్లాడుతూ..1,600 మీటర్లు రన్నింగ్‌లో పాల్గొన్న వెంటనే లాంగ్ జంప్ నిర్వహించడం వల్ల అనేక మంది అభ్యర్థులు కాళ్ల నొప్పులతో దూకలేకపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం పునరాలోచించి అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో పార్టీ హైదరాబాద్ జిల్లా కన్వీనర్ సయ్యద్ తౌఫిక్, కన్వీనర్ కొమ్మూరి వెంకటేష్, ఆవుల శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎల్ఏటీ పరీక్షల్లో అర్హత సాధించిన 70మంది లెర్నర్లు

నవతెలంగాణ-హైదరాబాద్

భారతదేశంలోనే అతిపెద్ద లెర్నింగ్ ప్లాట్ఫారమ్ అన్‌అకాడెమీ. ఇటీవల ప్రకటించిన సీఎల్ఏటీ పరీక్ష ఫలితాల్లో 70 మంది లెర్నర్లు అర్హత సాధించినట్లు వెల్లడించింది. హైదరాబాద్ కు చెందిన సాత్విక్ కులపాక, అనాకాడెమీ లెర్నర్, సీఎల్ 2022లో ఆల్ ఇండియా ర్యాంకు 113 సాధించారు. సాత్విక్ ఎప్పుడూ లాయర్ కావాలని కలలు కనేవాడు. తన కలను నెరవేర్చుకునేందుకు అతను సీఎస్ఏటీలో చక్కని ర్యాంకు పొందేందుకు అన్‌అకాడెమీలో చేరాడు. అన్‌అకాడెమీ అతనికి భారతదేశంలోని అగ్రశ్రేణి అధ్యాపకుల నుంచి అవసరమైన మెంటర్షిప్పు, అతనికి సహాయం చేసేందుకు ఉత్తమ నాణ్యత కలిగిన అధ్యయన మెటీరియల్ను అందించింది. ఎన్ఎల్ యూ లలో ప్రవేశాలు సాధించిన వీరిలో ముగ్గురు లెర్నర్లు 100 లోపు ర్యాంకులు, 9 మంది లెర్నర్లు 200 లోపు, 21 మంది అభ్యాసకులు 500 లోపు టాప్ ర్యాంకులు సాధించారు. బెస్ట్-ఇన్-క్లాస్ ద్వారా ఉన్నత-నాణ్యత కంటెంట్, 1:1 లైవ్ సెషన్లు, కృతి భట్నాగర్, కేశవ్ మల్పానీ, దివ్యకుమార్ గార్గ్ వంటి అగ్రశ్రేణి అధ్యాపకుల నుంచి పర్సనలైజ్ మెంటర్షిప్ వంటి ఆఫర్లు, అన్‌అకాడమీ లెర్నర్లు తమ విద్యా ప్రయాణంలో రాణించుందక ఒక ప్రసిద్ధ కేంద్రంగా ఉద్భవించింది.

ఫిబ్రవరి 1 నుంచి డిస్నీప్లస్ హాట్ స్టార్లో బ్లాక్ పాంథర్

నవతెలంగాణ-హైదరాబాద్

మార్వెల్ స్టూడియోస్ వారి బ్లాక్ పాంథర్ వాకండ ఫరెవర్ ను ఫిబ్రవరి 1 నుంచి ప్రసారం చేస్తామని డిస్నీ ప్లస్ హాట్ స్టార్ ప్రకటించి మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్ అభిమానులకు కొత్త సంవత్సరంలో శుభవార్తను తెలిపింది. ఈ సినిమా ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు అండ్ మలయాళంలో ప్రసారానికి అందుబాటు శ్రీ కరానుంది. డి సర్ టి చేసుకునందుకు, షం చెందుకు క ఆ రెప్పుడు. అందుబాటులో ఉంది. మార్వెల్ స్టూడియోస్ వారి బ్లాక్ పాంథర్: వకాండ ఫరెవర్లో, క్వీన్ రామోండా (ఏంజెలా బాసెట్), షురి (లెటిటియా రైట్), ఎమ్బాకు (విన్స్టన్ డ్యూక్), ఓకోయ్ (దానై గురిరా), డోరా మిలాజే (ఫ్లోరెన్స్ కసుంబాతో సహా) తమ రాజు టి చల్లా మరణించిన తర్వాత తమ దేశంతో జోక్యం చేసుకునే ప్రపంచ శక్తుల నుంచి రక్షించేందుకు పోరాడతారు. వాకండన్లు తదుపరి అధ్యాయాన్ని ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నప్పుడు, హీరోలు వార్ డాగ్ నాకియా (లుపిటా న్యోంగో), ఎవెరెట్ రాస్ (మార్టిన్ ఫ్రీమాన్)ల సహాయంతో కలిసి వకాండ రాజ్యానికి కొత్త మార్గాన్ని ఏర్పరుస్తారు.

బేకరి, రెస్టారెంట్లలో ఫుడ్ ఇన్స్పెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- కాలం చెల్లిన క్రీంలను వాడుతున్న బ్రౌన్ బీర్ బేకరీ..!



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

హిమాయత్‌నగర్ డివిజన్‌లో పలు బేకరి, రెస్టారెంట్‌లు, ఫుడ్ కోర్టుల్లో ఫుడ్ ఇన్స్పెక్టర్ స్వాతి శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో తెలుగు అకాడమీ ఎదురుగా ఉన్న బ్రౌన్ బీర్ బేకరీ షాపులో నిర్వహించిన తనిఖీల్లో విస్మయం కలిగించే పరిస్థితులను కనుగొన్నట్లు ఫుడ్ ఇన్స్పెక్టర్ స్వాతి తెలిపారు. వారు మాట్లాడుతూ.. బ్రెడ్, కేక్ తయారీల్లో కాలం చెల్లిన క్రీంలను వాడినట్టు గుర్తించామని తెలిపారు. ఫాస్ట్ ఫుడ్ తయారు చేసే వంట గదిలో అపరిశుభ్ర పరిస్థితులు ఉన్నట్టు గుర్తించామని వెల్లడించారు. బేకరీ నుంచి కొన్ని ఫుడ్ శాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపామని, కాలం చెల్లిన క్రీంను సీజ్ చేసినట్టు ఆమె తెలిపారు. నగరంలో బేకరీలు, ఫుడ్ సెంటర్లు విపరీతంగా పెరిగిపోతున్నందు వల్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.ఈ హైజీనిక్ ఫుడ్ వల్ల ఫుడ్ పాయిజనింగ్, కాలం చెల్లిన క్రీంల వల్ల శరీరంలో క్యాన్సర్ వంటి భయంకర రోగాలు సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆ సమయంలో అక్కడే ఉన్న కస్టమర్లు న్యూయర్ సందర్భంగా వందల కేక్‌లను ఈ క్రింలతోనే ఈ బేకరీ యాజమాన్యం తయారుచేసి ఉండవచ్చునని పలువురు అనుమాని స్తున్నారు.ఈ విషయంపై బేకరీ ఏరియా ఇన్‌చార్జి వివరణ అడిగేందుకు మీడియా ప్రయత్నించగా దబాయింపుగా, నిర్లక్ష్యంగా మాట్లాడినట్లు తెలిసింది.

ఎమ్మెల్యే కేవీ వివేకాందకు నూతన సంవత్సర శుభాకాంక్షలు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానందని సీనియర్ నాయకులు కొలన్ గోపాల్ రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 11వ డివిజన్ కార్పొరేటర్ వాకలపూడి రవి కిరణ్, సీనియర్ నాయకులు ఆవుల జగన్ యాదవ్, 10వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బైండ్ల నాగేష్ పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు నూతన సంవత్సర, పెండ్లిరోజు శుభాకాంక్షలు



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం 129 డివిజన్‌లోని జీహెచ్ఎంసీ ఆర్పీలు శుక్రవారం స్థానిక కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణను కలిసి నూతన సంవత్సర, పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు. జీహెచ్ఎంసీ ఆర్పీలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాననీ, ఏమైనా సమస్యలు ఉంటే తనతో చెప్పుకోవచ్చు అనీ, వాటిని పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం కార్పొరేటర్‌ని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సీఓ కనకమల్లు, 129 డివిజన్ మహిళా అధ్యక్షురాలు హేమలత రెడ్డి, స్థానిక మహిళ నాయకురాలు, తదితరులు పాల్గొన్నారు.

స్కీం వర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలి









నవతెలంగాణ-బాలానగర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో పని చేస్తున్న స్కీం వర్కర్లను వెంటనే కార్మికులుగా గుర్తించడంతో పాటు వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ అన్నారు. శుక్రవారం కూకట్ పల్లి సర్కిల్ బాలానగర్ డివిజన్ పరిధిలో ఆశా, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు నిర్వహించిన నిరసన కార్యక్రమానికి రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై వారితో కలిసి నిరసన తెలిపారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తుంచి, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలనీ, స్కీం వర్కర్లను స్వచ్ఛంద సంస్థలకు, ప్రయివేటు వాళ్ళకు ఇవ్వద్దని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను.ఎండగడతామని రాజశేఖర్ హెచ్చరించారు.

దుండిగల్ : రోజురోజుకూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు జీతభత్యాలు పెరగాలనీ, స్కీముల పేరిట ప్రైవేటీకరణ ఆపాలనీ, స్కీం వర్కర్లకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ దుండిగల్ మండల కన్వీనర్ బొడిగె లింగస్వామి డిమాండ్ చేశారు. దేశవ్యాప్త నిరసనలో భాగంగా శుక్రవారం కుతుబుల్లాపూర్ దుండిగల్ గండి మైసమ్మ మండలంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం స్థానిక తహసీల్దార్ పద్మప్రియ, మున్సిపల్ కమిషనర్ భోగేశ్వరులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారికి వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, రాధ, లలిత, అనిత, హంస, పార్వతమ్మ, శోభారాణి, స్వరూప, పద్మ అశ్విని, భాగ్యలక్ష్మి, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్కీమ్ వర్కర్ల పట్ల నిర్లక్ష్యానికి నిరసనగా దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా కుత్బుల్లాపూర్ మండల తహసీల్దార్ సంజీవరావుకి స్కీమ్ వర్కర్ల డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్, సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి కె.బీరప్ప మాట్లాడారు. మోడీ ప్రభుత్వం 8 ఏండ్ల కాలంలో స్కీములను, స్కీమ్ వర్గాల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. స్కీమ్ వర్కర్ల రక్షణ, స్కీముల సంరక్షణ హక్కుల సాధన కోసం స్కీమ్ వర్కర్లందరూ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. స్కీం వర్కర్ల ఉద్యోగ భద్రత, సంక్షేమం, ఉద్యోగాల భద్రతను ఈ ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వి.ఈశ్వరరావు, వీరేష్, శ్రీకాంత్, కనకయ్య, సురేష్ స్కీమ్ వర్కర్ల నాయకులు ఝాన్సీ, స్వాతి, అరుణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యతో విశ్వాన్ని జయించొచ్చు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రతి విద్యార్థీ చిన్నప్పటి నుంచే విద్యలో ప్రతిభ కనబరిస్తే భవిష్యత్‌లో విశ్వాన్ని జయించవచ్చు అని కుత్బులాపూర్ ఎమ్మెల్యే కె.పి వివేకానంద విద్యార్థులకు సూచించారు. శుక్రవారం చింతల్ డివిజన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో గల సెయింట్ మార్టిన్ పాఠశాల 24 వార్షికోత్సవ వేడుకలను (క్రిసాలిస్) నిర్వమించారు. ముందుగా పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ల బృందం, ప్రముఖ అథ్లెట్ పాఠశాల అధ్యక్షులు మర్రి లక్ష్మణ్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జి.చంద్రశేఖర్ యాదవ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ జి.రాజశేఖర్ యాదవ్, జి.జై కిషన్ యాదవ్‌తోపాటు పాఠశాల ప్రిన్సిపాల్ అనిత రావు చేప్యాలతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెరుగుతున్న సాంకేతిక విద్యతో విద్యార్థులు పోటీపడుతూ.. చదువుతూ.. ఉత్తమ ఫలితాలు సాధిస్తూ.. ప్రపంచ దేశాల్లో మంచి హెూదాలో ఉన్నారని గుర్తు చేశారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడలు, శాస్త్ర సాంకేతిక, సామాజిక రంగాల్లో రాణించి దేశ ప్రతిష్టను ఇనుమడింపజేయాలన్నారు. చింతల్ సెయింట్ మార్టిన్ పాఠశాల విద్యార్థులను ఎంతో మందిని డాక్టర్లుగా, ఇంజినీర్లుగా, సైంటిస్టులుగా తయారు చేసిన పాఠశాల డైరెక్టర్లు, ఆధ్యాపక బృందాన్ని అభినందించారు. ప్రముఖ అథ్లెట్, పాఠశాల అధ్యక్షులు మర్రి లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదల కనబరిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. ఏ రంగంలోనైనా కష్టపడే కంటే ఇష్టపడితే కలలు సాకారం చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు మనోభావాలకు అనుగుణంగా విద్యానందిస్తూ వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ అనితారావు చేప్యాల మాట్లాడుతూ విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ప్రతి ఏడాదీ మంచి ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతోపాటు క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలతోపాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు చింతల్ అశోక్, బండారు వరప్రసాద్, మక్సూద్ అలీ, సామ్రాట్, మన్నే రాజు పాల్గొన్నారు.

మంచి నీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మూసాపేట్ డివిజన్ భరత్ నగర్ కాలనీ ఈడబ్ల్యూఎస్‌లో నీటి సమస్య తీవ్రతపై జలమండలి డీజీఎం రవికుమార్‌కు సమస్యను పరిష్కరించాలని స్థానిక డివిజన్ కార్పొరేటర్ కోడిచేర్ల మహేందర్ కోరారు. ఈడబ్ల్యూఎస్ కాలనీలో మంచి నీటి నల్లా నీటి ప్రెజర్ తక్కువ రావడం, సిల్ట్ తీయక పోవడం, కలుషిత నీరు రావడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదురుకుంటున్నారని తెలిపారు. ఎందుకు ఇలాంటి సమస్యలు తరుచూ ఏర్పడుతున్నాయని సంబంధిత అధికారి డీజీఎం రవి కుమార్‌ను నిలదీసిన మూసాపేట్ కార్పొరేటర్ మహేందర్ కోడిచెర్ల. బస్తీ ప్రజల సమస్యను తక్షణమే పరిష్కారం అయ్యేలా చూడాలనీ, మున్ముందు ఇలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలలనీ, లేని పక్షంలో ప్రజలు మీ పై ఉద్యమిస్తారని హెచ్చరించారు, ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి హరి, జిల్లా కార్యవర్గ సభ్యులు అభిలాష్, వెంకటేష్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ విద్యార్థుల విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనకు నిధులు మంజూరు



నవతెలంగాణ-దుండిగల్

గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో శాస్త్ర సాంకేతిక విద్యపై నైపుణ్యం పెంపొందించేందుకు ప్రోత్సాహకంగా దూలపల్లి, మైసమ్మగూడ లోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకి భారత జాతీయ సంస్థ, శాస్త్ర సాంకేతిక విభాగం వారు రూ.21 లక్షలు మంజూరు చేసినట్టు నర్సింహారెడ్డి కళాశాల చైర్మన్ జె.నర్సింహారెడ్డి తెలిపారు. తమ కళాశాలలో గ్రామీణ పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులకు విద్యతోపాటు శాస్త్ర సాంకేతికపై అవగాహన కల్పించి వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను పెంపొందించేందుకు ఈ నిధులను ఉపయోగిస్తామన్నారు, తమ కళాశాలలో ప్రతి ఏడాదీ అధ్యాపకులు విద్యా ప్రాధాన్యతతోపాటు సమాజానికి ఉపయోగపడేలా విజ్ఞాన శాస్త్రం పై మరింతగా అర్థమయ్యే విధంగా కళాశాల ప్రాంగణంలో లఘు చిత్రాల ప్రదర్శన, నిపుణులతో అర్థమయ్యే విధంగా విద్య బోధన, వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. ఇలాంటి ప్రదర్శన వల్ల విజ్ఞానంపై మక్కువ ఏర్పడి సమాజానికి మరింతగా ఉపయోగపడే పరిశోధనలు చేపట్టగలరన్నారు. ఈ నిధులను గ్రామీణ ప్రాంత విద్యార్థులకు శాస్త్ర విజ్ఞానంపై అవగాహన పెంపొందించేందుకే ఉపయోగిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి జె.త్రిశూల్ రెడ్డి, కళాశాల కోశాధికారి జె.త్రిలోక్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డా.లోకనాథం, ఈసీఈ విభాగాధిపతి డా. తివారి, స్టూడెంట్ అఫైర్స్ డా.వెంకట్రావు, వివిధ విభాగాధిపతులు, డీన్‌లు పాల్గొన్నారు.

సిల్వర్ లీఫ్ విల్లాస్‌లో ఎమ్మెల్యే పర్యటన



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు సిల్వర్ లీఫ్ విల్లాస్‌లో శుక్రవారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్ స్థానిక చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, కమిషనర్ శ్రీహరి, కౌన్సిలర్ పూజారి వసంత లక్ష్మణ్ గౌడ్‌తో కలిసి పర్యటించారు. ఈ మేరకు భూగర్భ డ్రయినేజీ, వర్షపు నీటి నాలా, సీసీ రోడ్ల సమస్యలను స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఎమ్మెల్యే అక్కడే ఉన్న అధికారులకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గంగయ్య నాయక్, కౌన్సిలర్లు సువర్ణ, సంజు యాదవ్, పాక్స్ చైర్మన్ నరేందర్ రాజు, సీనియర్ నాయకులు బూరుగుబావి హనుమంత రావు, పాక్స్ డైరెక్టర్ బూరుగుబావి సత్యనారాయణ, నాయకులు దేవేందర్ యాదవ్, లక్ష్మణ్ గౌడ్, కుమార్ గౌడ్, నాయకురాలు సంగీత రెడ్డి, డీఈఈ చిరంజీవి, అసోసియేషన్ సభ్యులు కుమార స్వామి, రమేష్, రాము, డాక్టర్ రవిందర్ గౌడ్ పాల్గొన్నారు.

కులం పేరుతో ఉపాధ్యాయుడిని వేధించిన మతోన్మాదులను కఠినంగా శిక్షించాలి


- కేవీపీఎస్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ

నవతెలంగాణ-దుండిగల్

నిజామాబాద్ జిల్లా కోటగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల దళిత ఉపాధ్యాయుడు మల్లిఖార్జున్‌ను కులం పేరుతో దూషించి బలవంతంగా గుడికి తీసుకెళ్లి బొట్టు పెట్టించి అవమానించిన మతోన్మాద బీజేపీ, వీహెచ్‌పీ దుండగులను కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవిపిఎస్) జిల్లా కమిటీ రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారులను డిమాండ్ చేసింది. కేవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగనిగళల బాలపీరు శుక్రవారం నిజాంపేట్ రాజీవ్ గృహకల్పలో మాట్లాడుతూ గొర్రెను గుడి దగ్గర బలిచ్చిన చందంగా బలవంతంగా దళిత, గిరిజనుల వ్యక్తులపై దాడులు ఇటీవల పెరిగిపోయాయ న్నారు. అలా టీచరును మెడలు పట్టి లాక్కెళ్లి జై శ్రీరాం అనాలనీ, బొట్టు పెట్టుకోవాలని ఒత్తిడి చేయడమే తీవ్రమైన పరుష పదజాలంతో దూషించారని తెలిపారు. సైన్స్ టీచర్ మూఢత్వాలు ఎందుకు బోధిస్తాడాని ప్రశ్నించారు? సైన్స్ మాత్రమే బోధిస్తాడని చెప్పారు. సైన్స్ బోధించడం నేరం కాదన్నారు. ఓ టీచర్ నాస్తికుడిగా ఎందుకు ఉండకూడదు? అని ప్రశ్నించారు. ఆచార్యదేవోభవ అని గౌరవించుకోవాల్సిన మన దేశంలో మతోన్మాదులు రౌడీయిజం చేసి ఎస్సీ టీచర్‌ను భయభ్రాంతులకు గురి చేశారని చెప్పారు. ఈ ఘటనలో పాల్గొన్న మతోన్మాదులను కఠినంగా శిక్షించా లని కేవిపిఎస్ డిమాండ్ చేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు తీవ్రంగా ఖండించాలన్నారు.



సమానత్వం కోసం ఐక్యంగా ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న మరియం ధావలే...



కాశ్మీర్ నుంచి మొదటిసారి

జాతీయ కార్యదర్శి మరియం ధావలె మాట్లాడుతూ ఈ మూడేండ్ల కాలంలో ఐద్వా 40వేల స్థానిక కమిటీలు, 700 జిల్లా కమిటీలు, 26 రాష్ట్ర మహాసభలు జరుపుకుని కోటి సభ్యత్వానికి గాను 850 మంది ప్రతినిధులు హాజరయ్యారరని తెలిపారు. అలాగే ఈ సభలకు కాశ్మీర్ నుంచి కూడా ప్రతినిధులు మొదటిసారి హాజరుకావడం గొప్ప విషయమన్నారు.

స్వాగత గీతం, సంతాప తీర్మానం

ప్రారంభ సభకు ముందు కేరళ రాష్ట్ర సంగీత శాఖ కళాకారులు పాడిన "మహిళా శక్తికి ఎర్రపూలతో స్వాగతం" అనే గీతం అందరినీ అలరించింది. ఐద్వా జాతీయ అధ్యక్షులు మాలినీభట్టాచార్య గత మహాసభ నుండి ఈ మహాసభ వరకు మరణించిన వారికి సంతాప తీర్మానం ప్రకటించారు.

(మొదటిపేజీ తరువాయి)

జరిగినపుడు 11లక్షల సభ్యత్వంతో 15 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. సమానత్వం - ప్రజాస్వామ్యం - స్త్రీ విముక్తి అనే జెండాను చేతబట్టి మన అక్కచెల్లెళ్ళు ఈ 40 ఏండ్లలో సంఘాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. దీనికోసం ఎంతో మంది మహిళా నాయకులు త్యాగంచేశారు. ముఖ్యంగా బెంగాల్, త్రిపుర నాయకులు ఎన్నో త్యాగాలుచేశారు. వారి త్యాగ ఫలితంగానే ఈ రోజు మన సంఘం ఇంతగా అభివృద్ధి చెందింది. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి మన కార్యకర్తలు దేశవ్యాప్తంగా ఎనలేని సేవలందించారు. వారికి అభినందనలు. క్యూబా విప్లవ వీరుడు, అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తుది వరకు పోరాడిన చేగువేర కుమార్తె ఎలైడా గువేరా ఈ రోజు మన మధ్య వుండటం మనకు స్ఫూర్తి దాయకం. ప్రస్తుతం మన ముందు అనేక సవాళ్లున్నాయి. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు గడిచిన తర్వాత ప్రజాస్వామ్యం కోసం పోరాడ్సిన పరిస్థితి, రాజ్యాంగాన్ని కాపాడుకోవల్సిన దుస్థితికి మనం వచ్చాం. మహిళల పరిస్థితి మరింత దిగజారింది. కరోనా సమయంలో దేశ వ్యాప్తంగా కోటీ ఇరవై లక్షల మంది మహిళలు జీవనోపాధిని కోల్పోయారు. ఆర్ఎస్ఎస్ మనువాదాన్ని బలంగా కోరుకుంటుంది. మన మెదళ్ళలోకి మనకు తెలియకుండానే ఎక్కించే ప్రయత్నం చేస్తున్నది. ఇదంతా పక్కా ప్లాన్‌తో సమగ్రంగా అమలుచేస్తున్నది. దీన్ని మనం తిప్పి కొట్టకపోతే ఈ మతోన్మాద సమాజంలో సమానత్వం కాదుకదా మనగడ కొనసాగడమే కష్టం. కాబట్టి మతోన్మాదులను గద్దె దించడమే మన లక్ష్యంగా పెట్టుకోవాలి అన్నారు.

రేపటి వెలుగు కోసం ఉద్యమించాలి : ఎలైడా గువేర

ఐద్వా 13వ అఖిల భారత మహాసభలో పాల్గొనడం సంతోషంగా వుంది. సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా మా క్యూబా దేశం ఎంతో పోరాటం చేసింది. ఇంకా చేస్తూనే వుంది. నిర్ణయాధికారంలో మహిళలను భాగస్వామ్యం చేయడంలో క్యూబా అధిక ప్రాధాన్యం ఇస్తున్నది. ప్రస్తుతం మా పార్లమెంటులో 52శాతం, రాష్ట్ర కౌన్సిల్స్‌లో 53శాతం మంది మహిళలున్నారు. అలాగే 4 రాష్ట్రాలకు గవర్నర్లుగా, 12 మంది వైస్ గవర్నర్లుగా, 88 మంది అధ్యక్షులుగా, 58 మంది మేయర్లుగా మహిళలు వున్నారు. మహిళలకు అన్నింట్లో సమాన బాధ్యతలు ఇచ్చేందుకు ప్రాధాన్యం ఇస్తున్నాం. తర్వాతి తరాల వారిని మంచి మార్గంలో నడిపేందుకు అవసరమైన విద్య అందిస్తున్నాం. మహిళలకు ప్రత్యేక ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటుచేశాం. గత ఏడాది 841 ట్రైనింగ్ సెంటర్లు పెడితే వీటిలో 50వేల మంది మహిళలు పాల్గొన్నారు. మహిళల కోసం ఇంకా చేయాల్సి వుంది. వాటిని కూడా చేస్తాం. ప్రపంచ వ్యాప్తంగా మహిళలు అద్భుతమైన పోరాటాలు చేయాలి. రేపటి వెలుగు కోసం ఉద్యమించాలి.

ఐక్యంగా పోరాడితేనే... : తీస్తాసెతల్వాద్



ఏ పోరాటాలైనా ఐక్యంగా చేస్తేనే విజయవంతమవుతాయని ప్రముఖ హక్కుల కార్యకర్త తీస్తాసెతల్వాద్ అన్నారు. మనది వ్యక్తి పోరాటం కాదు.. సామూహిక పోరాటం. ఐద్వా కోటి సభ్యత్వం కలిగి వుండటం సామాన్య విషయం కాదు. ఐద్వా చేస్తున్న ఎన్నో కార్యక్రమాలను దగ్గరగా చూశాను. ఎవరూ పట్టించుకోవడానికి ముందుకురాని సమస్యలను కూడా ఐద్వా పట్టించుకుంటున్నది. ఇదెంతో గొప్ప విషయం. మహిళలు ఈ సమాజంలో ఎన్నో సవాళ్ళను ఎదుర్కొంటున్నారు. దేశంలో ఎనిమిదేండ్ల నుంచి క్రూరమైన పాలన నడుస్తున్నది. నయా ఉదారవాద విధానాలు, మతోన్మాదంవల్ల భారత రాజ్యంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయి. మన వాళ్ళనే మనకు శత్రువుగా మార్చేస్తున్నారు. చాలా మంది మౌనంగా ఉంటున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలందరినీ అభ్యుదయ ఉద్యమాల వైపు మళ్ళించాల్సిన అవసరం వుంది. ఈ పని ఐద్వా చేస్తున్నది. న్యాయ వ్యవస్థను, చట్టాలను కాపాడుకోవడం కోసం మనం గొంతు విప్పాలి. నేను హక్కుల కార్యకర్తగానే కాదు ఓ జర్నలిస్టును. ప్రస్తుతం మీడియా మొత్తం కార్పొరేటీకరణ అయిపోయింది. పాలకుల పక్షం వహిస్తుంది. ఇలా కాకుండా మీడియా తన పాత్ర తాను సరిగ్గా నిర్వహిస్తే ప్రజా ఉద్యమాలకు మరింత బలం వస్తోందని సెతల్వాద్ అన్నారు.

చారిత్రాత్మకమైన ప్రదేశం

మహాసభల ఆహ్వాన సంఘ అధ్యక్షులు శ్రీమతి మాట్లాడుతూ 13వ మహాసభ జరుపుకుంటున్న తిరువనంతపురంలోని ఈ ప్రాతం చారిత్రాత్మకమైనదని 1970 ఎస్ఎఫ్ఐ మొట్టమొదటి జాతీయ మహాసభలు కూడా ఇక్కడే జరిగాయన్నారు. కేరళలో ముఖ్యమంత్రి పినరయి విజయన్ నాయకత్వంలో మహిళలు అన్ని రంగాల్లో ముందున్నారన్నారు. రెండవసారి కూడా రాష్ట్ర ప్రజలు ఎల్‌డీఎఫ్‌నే ఎంచుకొని చరిత్ర సష్టించారన్నారు. ఇక ఐద్వా విషయానికి వస్తే కేరళ 57 లక్షల సభ్యత్వంతో దేశంలోనే అగ్రస్థానంలో వుందన్నారు. ఈ మహాసభ జయప్రదం కోసం ఎంతో మంది సహకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సీనియర్ నాయకులు సుభాషిణి అలి, కేరళ మాజీ వైద్యశాఖ మంత్రి కె.కె శైలజ, జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి, జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు వాసుకీ, సుధాసందరరామన్, మల్లు లక్ష్మీ డి.రమాదేవి, కేరళ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సుసాన్ కోడీ, సి.ఎస్.సుజాత పాల్గొన్నారు.

మహిళలకు న్యాయం దక్కడం లేదు



ప్రస్తుతం మన దేశంలో తిండి తినడం, ఇష్టమైన బట్ట కట్టడం అత్యంత కష్టంగా మారిపోయింది. మహిళలకు న్యాయం దక్కడం లేదు. ఆత్మగౌరవంతో బతికే అవకాశమే లేకుండా పోయింది. ఇటువంటి పరిస్థితుల్లో మహిళలు రాజకీయాల్లోకి రావల్సిన అవసరం ఎంతో వుంది. లేదంటే ఈ సమాజాన్ని మార్చలేవం. సమానత్వం సాధించలేం. గుడుల్లోనూ, ఇండ్లలోను ఎక్కువగా కనిపించే మహిళలను ఇలాంటి అభ్యుదయ వేదికలో చూడటం చాలా సంతోషంగా వుంది. ఈ ఘనత కేవలం ఐద్వాకే దక్కుతుంది. అయితే మనువాదం మనల్ని వెనక్కు తీసుకుపోతున్నది. కులం, మతం పేరుతో మహిళలను చీల్చుతున్నది. ఇటువంటి పరిస్థితుల్లో మనందరం కలిసి ఐక్యంగా పోరాల్సిన అవసరం వున్నది.

- మల్లికా సారాబాయి, ప్రముఖ నృత్యకారిణి, కేరళ కళామండలి డీమ్డ్ యూనివర్సిటీ ఛాన్సలర్

కమిటీలు

మహాసభల విజయవంతం కోసం అధ్యక్ష వర్గం, మినిట్స్ కమిటీ, తీర్మానాల కమిటీ, అర్హతా పత్రాల కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీల సమన్వయం కొరకు జాతీయ కార్యదర్శి వర్గం స్టీరింగ్ కమిటీగా వ్యవహరిస్తున్నది.

ఆరు అంశాలపై చర్చలు

మహాసభలో స్వతంత్ర పోరాటాల మహిళా ఉద్యమం, నూతన విద్యా విధానం మహిళలపై ప్రభావం, వాతావరణ మార్పులు మహిళలపై ప్రభావం, బాలికల హక్కులపై చర్చలు జరగనున్నాయి. అలాగే పలు తీర్మానాలను మహాసభలో ప్రవేశపెట్టనున్నారు. ఐద్వా జాతీయ కార్యదర్శి మరియం ధావలె జాతీయ, అంతర్జాతీయ రాజకీయ రిపోర్టును ప్రవేశపెట్టారు. దానిపై ప్రతినిధులు రాష్ట్రాల వారిగా చర్చలు జరిపారు.

మహా సభ సందర్భంగా వివిధ రాష్ట్రాల్లో సుదీర్ఘ పోరాటం చేసిన ఆరుగురిని సన్మానించారు.

- శీలా సహాన, (హర్యాన) 2020లో నల్ల చట్టాలకు నిరసనగా జరిగిన సుదీర్ఘ రైతాంగ పోరాటంలో తన ప్రాంతం నుండి మహిళలను ఏకం చేయడంలో కీలకపాత్ర పోయించారు.
- రేవతి, తమిళనాడు: ఈమె భర్తను అక్రమంగా అరెస్టుచేసి చంపేస్తారు. దాంతో ఈమె ఐద్వా అండతో న్యాయం కోసం పోరాటానికి దిగింది. ఇంకా పోరాడుతూనే వుంది.
- సంయుక్త, ఒడిశా: ధోబీగా పని చేసే ఈమె తన జాతి వారిని ఏకం చేసి వారి హక్కుల కోసం పోరాటం చేస్తుంది.

పోరాట చిహ్నాలకు సన్మానం

- మన్సియా, కేరళ: ముస్లిం కుంటుంబంలో పుట్టిన ఈమె నత్యకారిణి. ముస్లిం కుటుంబంలో పుట్టి డ్యాన్స్ ఎలా చేస్తావంటూ మతఛాందసవాదులు అడ్డుకుంటే వారిని ఎదిరించి తనకు ఇష్టమైన నత్యాన్ని కొనసాగిస్తుంది.
- కమ్లేష్, హర్యానా: అంగన్ వాడీ వర్కర్ అయిన ఈమె తన యూనియన్ తరపున పర్మినెంట్ చేయమని పోరాడుతుంటే అక్కడి బీజేపీ ప్రభుత్వం ఎన్నోదాడులు చేస్తుంది. అయినా ధైర్యంగా తన ఉద్యమాన్ని కొనసాగించి విజయం సాధించింది.
- ఫుల్లరా మొండల్, వెస్ట్ బెంగాల్: పేద వ్యవసాయ కుటుంబ పుట్టి స్థానిక ఐద్వా నాయకురాలిగా ఉన్న ఈమెపై తృణమూల్-మావోయిస్టులు దాడి చేశారు. అరెస్టు చేసి జైలుకు పంపిస్తారు. బయటకు వచ్చిన తర్వాత కూడా ధైర్యంగా ఐద్వాలో పని చేస్తున్నారు.

నవచిత్రం

ఈ సంక్రాంతికి తగ్గేదేలే..



'వాల్తేరు వీరయ్య'లో చిరంజీవి, రవితేజ


చిరంజీవి, శృతిహాసన్

సంక్రాంతి బరిలో అమీతుమీ తేల్చుకునేందుకు అగ్ర హీరోల సినిమాలు సమాయత్తమవుతున్నాయి. సంక్రాంతి పండగ అంటే సినీ వర్గాలకు కలెక్షన్ల పండగ. ఈ సంక్రాంతికి రికార్డ్ స్థాయిలో కలెక్షన్లని రాబట్టుకోవడం కోసం దర్శక, నిర్మాతలు తమ సినిమాలకు పక్కా రిలీజ్ డేట్స్‌ని ఫిక్స్ చేశారు. ఇందులో భాగంగా తొలుత కోలీవుడ్ స్టార్ హీరోలు విజయ్, అజిత్ సినిమాలు తెలుగు ప్రేక్షకుల ముందు పోటీపడుతున్నాయి. విజయ్ 'వారసుడు' (వారిసు - తమిళం), అజిత్ 'తెగింపు', (తునీవు - తమిళం) ఈనెల 11న ఒకేరోజు విడుదల అవుతున్నాయి. ఇక ఈనెల 12న బాలకృష్ణ 'వీరసింహారెడ్డి', 13న చిరంజీవి, రవితేజల 'వాల్తేరు వీరయ్య' చిత్రాలు ఒక్కరోజు గ్యాప్‌తో విడుదలవుతూ సంక్రాంతి సందడిని రెట్టింపు చేయబోతున్నాయి. ఇదిలా ఉంటే, ఈనెల 14న యువ కథానాయకుడు సంతోష్ శోభన్ హీరోగా నటించిన 'కళ్యాణం కమనీయం' సినిమా సైతం సంక్రాంతి పోటీలో అదృష్టం పరీక్షించుకోబోతోంది. ఈ సంక్రాంతికి తగ్గేదేలే.. అంటూ బరితోకి దిగుతున్న హీరోలందరూ తమ సినిమాలదే విజయమనే దీమాతో ఉన్నారు.






'వారసుడు'లో విజయ్, 'తెగింపు'లో అజిత్



'వీరసింహారెడ్డి'లో బాలకృష్ణ



బాలకృష్ణ, శృతిహాసన్

- విజయ్, రష్మిక మందన్న జంటగా నటించిన చిత్రం 'వారసుడు'. ఈ చిత్రాన్ని శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్, పివిపి సినిమా పతాకాలపై దిల్ రాజు, శిరీష్, పరమ్ వి పొట్లూరి, పెరల్ వి పొట్లూరి నిర్మించారు. వంశీ పైడిపల్లి దర్శకుడు. అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో రూపొందిన ఈ సినిమాకి తమన్ సంగీతం అందించారు.
- అజిత్, హెచ్.వినోద్ కాంబినేషన్‌లో బోనీకపూర్ ఈ చిత్రాన్ని నిర్మించారు. మంజువారియర్, సముద్రఖని, అజయ్ కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రం బ్యాంక్ రాబరీ నేపథ్యంలో సాగుతుంది. జిబ్రాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం సైతం తెలుగు, తమిళ భాషల్లో ఒకేసారి విడుదలవుతోంది.
- ఈ రెండు సినిమాలు అటు తమిళంలోనే కాకుండా ఇటు తెలుగులోనూ ఇతర సినిమాలకు పోటీగా దిగుతున్నాయి. మొత్తంగా అటు థియేటర్ల పరంగా, ఇటు కలెక్షన్ల పరంగా టాలీవుడ్, కోలీవుడ్‌లో గట్టి సవాల్ విసరబోతున్నాయి.



'కళ్యాణం కమనీయం'లో సంతోష్ శోభన్, ప్రియ భవానీ శంకర్

- బాలకృష్ణ, శృతిహాసన్ జంటగా తెరకెక్కిన చిత్రం 'వీరసింహారెడ్డి'. మలినేని గోపీచంద్ దర్శకత్వంలో పక్కా మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రానికి తమన్ స్వరాలు సమకూర్చారు. చిరంజీవి, శృతిహాసన్ కాంబినేషన్‌లో రూపొందిన చిత్రం 'వాల్తేరు వీరయ్య'. ఇందులో రవితేజ ఓ కీలక పాత్రలో అలరించబోతున్నారు. పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన ఈ చిత్రానికి దేవీశ్రీ ప్రసాద్ మ్యూజిక్ అందించారు. సై అంటూ.. బరిలోకి దిగుతున్న ఈ రెండు చిత్రాలను మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మించడం ఓ విశేషమైతే, ఈ రెండింటిలోనూ శృతిహాసనే నాయిక కావడం మరో విశేషం.
- యువకథానాయకుడు సంతోష్‌శోభన్, ప్రియ భవానీ శంకర్ హీరో, హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'కళ్యాణం కమనీయం'. నూతన దర్శకుడు అనిల్ కుమార్ ఆళ్ళ దర్శకత్వంలో యూవీ కాన్సెప్ట్ సంస్థ నిరుద్యోగి భర్త పడే కష్టాల కథతో ఈ చిత్రాన్ని నిర్మించింది.

సంక్రాంతి పోటీలో ఎలాంటి సినిమాలు విడుదలైనప్పటికీ కటౌట్ కాదు కంటెంట్ ఉంటేనే ప్రేక్షకులతోపాటు అభిమానులూ విశేషంగా ఆదరిస్తారనే విషయం వేరే చెప్పక్కర్లేదు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

రూపాయి అత్యంత పేలవ కరెన్సీ

- గతేడాది ఆసియాలోనే అత్యధిక పతనం
- మరింత పడిపోవచ్చు



న్యూఢిల్లీ: గతేడాది 2022 లో ఆసియాలోనే అత్యంత పేలవ ప్రదర్శన కనబర్చిన కరెన్సీ ల్లో రూపాయి అగ్రస్థానంలో ఉందని ఓ ప్రయివేటు బ్యాంక్ టాప్ ఎగ్జిక్యూటివ్ అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కరెంట్ ఎకౌంట్ లోటు పెరగనుందని.. దీంతో రూపాయి విలువ మరింత ఒత్తిడికి గురి కానుందని యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్ ట్రెజరీ, హోల్‌సేల్ బ్యాంకింగ్, మార్కెట్స్ గ్రూపు ఎగ్జిక్యూటివ్ నీరజ్ గంభీర్ విశ్లేషించారు. బ్లూమ్‌బర్గ్ టివికి ఇచ్చిన ఇంటర్వ్యూలో గంభీర్ మాట్లాడుతూ.. "2022-23 ఆర్థిక సంవత్సరంలో విదేశీ నిధుల రాక మెరుగ్గా లేదు. గతేడాది రూపాయి విలువ 10 శాతం మేర పడిపోయింది. ఫెడరల్ రిజర్వ్ మానిటరీ పాలసీలో వడ్డీ రేట్ల పెంపునతో డాలర్ విలువ పెరిగడంతో భారత విదేశీ ఫైనాన్స్ క్షీణిస్తుంది. విదేశీ మారకం రిజర్వుల పెంపునకు ఆర్‌బిఐ చర్యలు తీసుకునే ప్రయత్నాలు చేస్తుంది. గతేడాది రూపాయి విలువ పడిపోతుంటే.. దేశీయ కరెన్సీని నిలబెట్టడానికి ఆర్‌బిఐ భారీ మొత్తంలో విదేశీ కరెన్సీని వ్యయం చేసింది." అని అన్నారు. వచ్చే ఏప్రిల్ 1 నాటికి డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 2-3 శాతం విలువ పడిపోవచ్చని ఆయన అంచనా వేశారు. శుక్రవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ 82.57 వద్ద నమోదయ్యింది. ఆర్‌బిఐ కీలక వడ్డీ రేట్లను మరో 25-50 బేసిస్ పాయింట్లు పెంచే అవకాశం ఉందని గంబీర్ పేర్కొన్నారు. వచ్చే కొన్ని మాసాల్లో పదేళ్ల కాలపరిమితి బాండ్లపై వడ్డీ రేటు 7.25 శాతం నుంచి 7.5 శాతం మధ్య ఉండొచ్చన్నారు. వాణిజ్యలోటు, కరెంటు ఖాతా లోటు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో భారత్ కరెన్సీ అంతకంతకూ క్షీణిస్తూ వచ్చిందని ఇటీవల ఫారిన్ కరెన్సీ ఎక్సేంజ్ (ఫారెక్స్) ఓ రిపోర్టులో పేర్కొంది. దీంతో 2022 సంవత్సరంలో రూపాయి ఆసియాలోకెల్లా అత్యంత చెత్త కరెన్సీగా మిగిలిపోయిందని తెలిపింది. గరిష్ట వడ్డీ రేట్లు, అధిక ద్రవ్యోల్బణంతో అమెరికా డాలర్ బలపడినప్పటికీ, ఆసియా దేశాల్లో ఏ కరెన్సీ తగ్గనంత తీవ్రంగా రూపాయి 11.3 శాతం మేర పతనమయ్యిందని తెలిపింది. 2021 చివరి ట్రేడింగ్ రోజున డాలరు మారకంతో పోల్చితే రూపాయి విలువ 74.33 వద్దనుండగా.. 2022 చివరి రోజున 82.72కు పడిపోయిందని గుర్తు చేసింది.

రూపాయితో వాణిజ్యం : ఆర్‌బిఐ గవర్నర్

ఇతర దేశాలతో వాణిజ్యానికి రూపాయితో చెల్లింపుల విషయమై ప్రభుత్వం, ఆర్‌బిఐ ప్రయత్నిస్తుందని రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ పేర్కొన్నారు. ఇందుకోసం దక్షిణాసియా దేశాలతో సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. శుక్రవారం అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ (ఐఎంఎఫ్) సదస్సులో శక్తికాంత మాట్లాడుతూ.. దక్షిణాసియాలో ప్రాంతీయ వాణిజ్యం కారణంగా వృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగు కానున్నాయన్నారు. ఉమ్మడి లక్ష్యాలు, సవాళ్లను ఎదుర్కొనేందుకు కేంద్ర బ్యాంక్‌ల స్థాయిలో పరస్పర సహకారం అందించుకోనున్నట్లు తెలిపారు. అదే విధంగా రూపాయి డిజిటల్ కరెన్సీ అంశంలోనూ ఆచితూచి అడుగులు వేస్తున్నామన్నారు.

స్టార్టప్‌లకు బ్రిటానియా మారీ గోల్డ్ మద్దతు

- మహిళా ఔత్సాహికవేత్తలకు రూ.10 లక్షలు

Google | women will

న్యూఢిల్లీ : బ్రిటానియా మారి గోల్డ్ మై స్టార్టప్ సీజన్ 4.0ని ప్రారంభించినట్లు ప్రకటించింది. ఇందులో పాల్గొనే ప్రతి ఒక్కరికీ డిజిటల్ వ్యాపార నైపుణ్యాన్ని అందించేందుకు గూగుల్ సహకారాన్ని అందిస్తోందని పేర్కొంది. దీనికి ఎంపికైన పది మంది గృహిణులు తమ వ్యాపార దక్షతకు అనుగుణంగా వ్యాపారాలను ప్రారంభించేందుకు రూ.10 లక్షల ఆర్థిక సహకారాన్ని అందించనున్నట్లు తెలిపింది. గూగుల్ భాగస్వామ్యంతో ఉమెన్ విల్ కార్యక్రమం ద్వారా మహిళలు పారిశ్రామికవేత్తలుగా మారాలన్న ఆకాంక్ష ఉన్న వారికోసం దీన్ని ప్రత్యేకంగా డిజైన్ చేశామని బ్రిటానియా ఇండస్ట్రీస్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అమిత్ దోషి పేర్కొన్నారు. దీనికి ఎంపికయిన వారు ప్రత్యేకంగా డిజైన్ చేసిన డిజిటల్ బిజినెస్ నైపుణ్యాల వనరులను పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు.

మారుతీ గ్రాండ్ విటారాలో సిఎన్‌జి వెర్షన్

- ధర రూ.12.85 లక్షలు

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి తన మిడ్ సైజ్ ఎస్‌యువి గ్రాండ్ విటారాలో ఎస్-సిఎన్‌జి వర్షన్‌ను విడుదల చేసినట్లు శుక్రవారం ప్రకటించింది. డెల్టా, జీటా వేరియంట్లలో లభించే వీటి ఎక్స్‌షోరూం ధరలను వరుసగా రూ.12.85 లక్షలు, రూ. 18.84 లక్షలుగా నిర్ణయించింది. 1.5 లీటర్ ఇంజిన్ కలిగిన ఈ ఎస్ యువి 6,000 ఆర్‌పిఎం వద్ద 99 బిహెచ్‌పి శక్తిని కలిగి ఉంటుందని ఆ కంపెనీ తెలిపింది. మారుతి సుజుకి సిఎన్‌జి వర్షన్‌లలో ఇది 14వ మోడల్.

వరి రైతుల కోసం 'మెంటార్'

- క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ వెల్లడి

హైదరాబాద్ : అగ్రోకెమికల్ కంపెనీ క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ వరి రైతుల కోసం నూతన ఫంగిసైడ్ 'మెంటార్'ను విడుదల చేసినట్లు ప్రకటించింది. వరిలో కనిపించే తెగుళ్ల (ఆకు మడత) వంటి వాటిని నియంత్రించడంతో పాటుగా వరి పంటకు అదనపు రక్షణ సైతం అందించి అధిక దిగుబడిని సైతం అందిస్తుందని ఆ కంపెనీ తెలిపింది. వరిలో సాధారణంగా కనిపించే తెగుళ్ల నియంత్రణకు ఇది తోడ్పడటంతో పాటుగా రైతులకు అత్యంత ప్రయోజనకారిగా నిలువనుందని క్రిస్టల్ క్రాప్ ప్రొటెక్షన్ లిమిటెడ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (స్ట్రాటజిక్ మార్కెటింగ్) సిఎస్ శుక్లా పేర్కొన్నారు.

జీస్క్వేర్ ఎపిటోమ్ ఇంటిగ్రేటెడ్ సిటీ ప్రారంభం

హైదరాబాద్ : జీస్క్వేర్ ఎపిటోమ్ మరో ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ జీస్క్వేర్ ఎపిటోమ్ ఇంటిగ్రేటెడ్ సిటీని ప్రారంభించింది. గచ్చిబౌలి సమీపంలోని విజయవాడ జాతీయ రహదారి మార్గంలో దీన్ని అభివృద్ధి చేసింది. ఈ ప్రాజెక్టు 1242 ఎకరాల విస్తీర్ణంలో ఉంటుందని తెలిపింది. దీనిలో 267 నుంచి 533 చదరపు గజాల విస్తీర్ణంలో 368 ప్రీమియం విల్లా ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేసింది. దీనిలో 100 ఎకరాల గోల్ఫ్ కోర్స్, 40 ఎకరాల లగ్జరీ రిసార్ట్, వెల్‌నెస్ కేంద్రం, స్పోర్ట్స్ అకాడమీ, స్కూల్, కాలేజీ, మరెన్నో ఉంటాయని ఆ సంస్థ పేర్కొంది.

టీచర్‌ను వేధించిన వారిపై చర్యలు తీసుకోవాలి

- డీవైఎఫ్‌ఐ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిజామాబాద్ జిల్లా కోటగిరి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న మల్లిఖార్జున్‌పై మతోన్మాదం ముసుగులో వేధించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ డిమాండ్ చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లో ఆ సంఘం ఆఫీసు బేరర్ల సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం డీవైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. గురువుతో మతోన్మాద శక్తులు క్షమాపణలు చెప్పించడం సమాజమంతా తలదించుకోవాల్సిన పరిస్థితని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇలా జరగడం సిగ్గుచేటని విమర్శించారు. భారతదేశ చరిత్రను మతోన్మాదం వైపు మళ్లిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ శక్తుల ఆటలకు రాష్ట్రంలో యువజనులు, మేధావులు, ప్రగతిశీల శక్తులు అడ్డుకట్ట వేయాలని కోరారు. ఈ సంఘటన ఒక్క ఉపాధ్యాయ రంగానికే కాకుండా రాష్ట్ర ప్రజల భవిష్యత్‌కి ప్రమాదకరంగా మారిందని తెలిపారు. దీన్ని అరికట్టడానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయుడిని వేధించిన మతోన్మాద శక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అరాచక శక్తులను శిక్షించాలి : పీడీఎస్‌యూ

ఉపాధ్యాయునిపై దాడిచేసిన అరాచక శక్తులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు పి రామకృష్ణ, కార్యదర్శి నామాల ఆజాద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మతం ముసుగులో చెలరేగిపోతున్న అరాచక శక్తులను ప్రభుత్వం అణచివేయాలని కోరారు. విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులపై దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం కృషిచేయాలన్నారు.

లైంగిక నేరాల్లో బాధితుల్ని ఆదుకోరా?

కేంద్రం, నాలుగు రాష్ట్రాలకు సుప్రీం నోటీసులు

- నల్సా పథకం కింద నష్టపరిహారం అందటం లేదు : ఎన్జీవో సంస్థ



న్యూఢిల్లీ : లైంగిక నేరాల్లో బాధితులకు నష్టపరిహారం అందజేస్తారా? లేదా? అంటూ సుప్రీంకోర్టు కేంద్రం, నాలుగు రాష్ట్రాలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధిత మహిళలు లేదా వారి కుటుంబాలకు అందజేస్తున్న న్యాయ సేవలు, వైద్య సాయం, ఇతర వివరాలు అందజేయాలని కేంద్రం, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, ఢిల్లీ రాష్ట్రాలకు నోటీసులు జారీచేసింది. నష్టపరిహారం అందజేయటంపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లంఘించాయంటూ 'సోషల్ యాక్షన్ ఫోరం ఫర్ మానవ్ అధికార్' అనే ఎన్జీవో సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్ శుక్రవారం సీజేఐ డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. 'నల్సా (నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ) నష్టపరిహార పథకం అమలుతీరుపై కేంద్రం, నాలుగు రాష్ట్రాల నుంచి మరిన్ని వివరాలు కోరింది.

లైంగిక నేరాల్లో ప్రభుత్వ అధికారులు 60 రోజుల్లోగా విచారణ ముగించి, బాధిత మహిళకు నష్టపరిహారం అందజేసేట్టు కోర్టు ఉత్తర్వులు ఇవ్వాలని ఎన్జీవో సంస్థ సుప్రీంను కోరింది. ఎన్జీవో తరఫు న్యాయవాది జ్యోతికా కల్రా వాదనలు వినిపిస్తూ, "బాధితులకు సరైన న్యాయ సహాయం దక్కటం లేదు. ప్రభుత్వం నుండి అందాల్సినవి అందటం లేదు. దీనివల్ల వారి కుటుంబాలు గౌరవంగా జీవించే హక్కును కోల్పోతున్నాయి. నల్సా పథకాన్ని రాష్ట్రాలు అమలుజేయాలని 2018లో సుప్రీం ఆదేశాలు జారీచేసింది. అయినా కేంద్రం, మరికొన్ని రాష్ట్రాలు ఆ ఆదేశాల్ని పట్టించుకోవటం లేదు" అని వివరించారు. వాదోపవాదనలు వింటూ సీజేఐ డి.వై.చంద్రచూడ్ కేంద్రం, రాష్ట్రాలకు నోటీసులు పంపుతామని చెప్పారు.

పిటిషన్‌లో ఎన్జీవో సంస్థ పేర్కొన్న అంశాలు ఈ విధంగా ఉన్నాయి. బాధిత మహిళలకు వెంటనే ఉపశమనం కలిగే చర్యల్ని అధికారులు చేపట్టాల్సి వుంటుంది. ముఖ్యంగా వైద్య సాయం వెంటనే ప్రారంభం కావాలి. నిర్దిష్ట కాలపరిమితిలో ఆర్థిక సాయం అందజేయలని కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్, 2006 చట్టం చెబుతోంది. బాధిత మహిళల పేదరికం, ఆర్థిక సమస్యల్ని ఆసరగా చేసుకొని, నేరస్థులు కేసును బలహీనపర్చే అవకాశముంది. ఈ తరహా కేసులు బీహార్, మధ్యప్రదేశ్‌లో చాలా ఉన్నాయి.

పేదరికం, నిరక్షరాస్యత కారణంగా బీహార్, ఢిల్లీలో బాధిత మహిళలకు న్యాయ సేవలు అందటం లేదు. నష్టపరిహారం దక్కటం లేదు. జాతీయ నేర గణాంకాల బ్యూరో లెక్కల ప్రకారం, గత రెండేండ్లలో దేశంలో లైంగికదాడి ఘటనలు 70.7శాతం పెరిగాయి. బాధిత మహిళల సంఖ్య ఏటా పెరుగుతోంది. నల్సా పథకం ప్రకారం ఆయా రాష్ట్రాల్లో బాధితులకు నష్టపరిహార పథకం సవరణలకు నోచుకోలేదు. కొన్ని రాష్ట్రాల్లో నష్టపరిహారం విషయంలో బాధితుల సంరక్షకుల నుంచి దరఖాస్తులు స్వీకరించటం లేదని ఎన్జీవో సంస్థ పిటిషన్‌లో పేర్కొంది.

పశ్చిమ బెంగాల్‌లో విశ్వభారతి
విద్యార్థులపై సస్పెన్షన్ ఎత్తేయాలి

లేదంటే ఆందోళనలు తీవ్రరూపం దాల్చుతాయి : ఎస్ఎఫ్ఐ



న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లోని విశ్వభారతి విశ్వవిద్యాలయం నిరసనలు, ఆందోళనలతో అట్టుడుకుతోంది. విద్యార్థులపై సస్పెన్షన్ ఎత్తేయాలని డిమాండ్ చేస్తూ వర్సిటీలోని ఎస్ఎఫ్ఐ నిరసనలు చేపట్టింది. ఈ సందర్భంగా చేపట్టిన నిరసన ప్రదర్శనలో వర్సిటీలోని విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వర్సిటీ కార్యదర్శిని ఎస్ఎఫ్ఐ నాయకుల బృందం కలిసింది. దాదాపు నాలుగు గంటలపాటు జరిగిన సమావేశంలో విద్యార్థుల సస్పెన్షన్ ఎత్తేయటంతోపాటు, మరికొన్ని డిమాండ్లపై చర్చించినట్టు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సృజన్ భట్టాచార్య తెలిపారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులు బేషరతుగా క్షమాపణలు చెబితేనే సస్పెన్షన్ ఎత్తేస్తామని విశ్వభారతి వర్సిటీ యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది.ఎస్ఎఫ్ఐ నిరసన ప్రదర్శనలో విద్యార్థుల పాదయాత్ర శాంతినికేతన్ పోస్టాఫీస్ జంక్షన్ వరకు కొనసాగింది. ర్యాలీ అనంతరం విశ్వభారతి వైస్ ఛాన్సలర్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఈ ర్యాలీలో రాష్ట్రంలోని ఇతర జిల్లాల నుంచి పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. నిరసన ర్యాలీలో ఎస్ఎఫ్ఐ ఆలిండియా ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిశ్వాస్, రాష్ట్ర అధ్యక్షుడు ప్రతీక్ ఉర్ రెహమాన్, ఇతర నాయకులు పాల్గొన్నారు. విద్యార్థుల సస్పెన్షన్‌పై బిశ్వాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "కేంద్ర ప్రభుత్వం మొత్తం దేశంలోని విద్యావ్యవస్థపై దాడి చేసింది. విశ్వభారతి అందుకు భిన్నంగా లేదు. ఈ వైస్ ఛాన్సలర్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి మేం ఇదే విషయాన్ని గమనిస్తున్నాం. నిరసనకు దిగే విద్యార్థుల్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఆరుగురుని సస్పెండ్ చేశారు. వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. లేదంటే విద్యార్థుల ఆందోళన తీవ్రరూపం దాల్చుతుంది' అని అన్నారు.

బొమ్మ దొరికింది..చిన్నారి నవ్వింది

- ఇంటికెళ్లి అందజేసిన రైల్వే అధికారులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



సాధారణంగా ప్రయాణాల్లో వస్తువులను మరచిపోవడం.. పోగొట్టుకోవడం సహజం. అట్లాగే రైలు ప్రయాణంలో ఓ పాప తనకు ఎంతో ఇష్టమైన బొమ్మను పోగొట్టు కున్నది. ఆ పాప పడిన బాధవర్ణాతీతం. ఆ చిన్నారిని బుజ్జగించడం తల్లిదండ్రులకు ఎంతో కష్టమైంది. ఇదంతా గమనించిన తోటి ప్రయాణికుడు రైల్వే అధికారులకు ఫిర్యాదు చేశాడు. రైల్వేశాఖ అధికారులు చాలెంజింగ్‌గా తీసుకుని మరీ బొమ్మను వెతికిపట్టుకున్నారు. ఊరు..పేరు..అడ్రస్ ఇలా ఏవీ తెలియకున్నా శోధించి మరీ చిన్నారికి బొమ్మను అందించారు.. పోయిన బొమ్మ దొరికడంతో ఆ చిన్నారి పొందిన సంతోషం, అనుభూతి వర్ణాతీతం. భూసిన్ పట్నాయక్ అనే వ్యక్తి ఈ నెల నాలుగో తేదీన సికింద్రాబాద్-అగర్తలా ప్రత్యేక రైలులోని కోచ్‌నెంబర్ బీ-2లో ప్రయాణం చేశాడు. అదే కోచ్‌లో తన పక్కబెర్తులో ఓ చిన్నారి కూర్చున్నది. అనుకోని పరిస్థితుల్లో ఆ చిన్నారి తనకు ఎంతో ఇష్టమైన బొమ్మను పోగొట్టుకున్నది. దాని కోసం ఎంతో ఏడ్చింది. ఆపడం తల్లిదండ్రులకు అసాధ్యమైంది. పక్కనే ఉన్న భూసిన్ మాత్రం ఆ పాప ఏడుపుచూసి చలించిపోయాడు. బొమ్మను ఎలాగైనా తిరిగి ఇవ్వాలని ఆలోచించాడు. రైల్వేలో మద్దద్ యాప్ ద్వారా 139 అనే నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. మానవతా దృక్పథంతో ఆలోచించిన రైల్వే శాఖ సిబ్బంది, ఫిర్యాదుదారుడు ఇచ్చిన సమాచారం మేరకు న్యూ జల్పైగురి స్టేషన్‌కు ముందుగా చిన్నారి పోగొట్టుకున్న బొమ్మ రైల్వే సిబ్బందికి దొరికింది. దానిని చిన్నారికి అందించాలని అధికారులు నిర్ణయించారు. సదరు చిన్నారి వివరాలను సికింద్రాబాద్ రైల్వే కౌంటర్ ద్వారా రిజర్వేషన్ చార్ట్ నుంచి అతి కష్టం మీద చిరునామా వెతికి పట్టుకోవడంలో రైల్వేసిబ్బంది సఫలీకృతమయ్యారు. చిన్నారి తల్లిదండ్రులు మోహిత్‌ర్మా, నస్రీన్ బేగం, గ్రామం ఖాజీ గావ్, ఉత్తర్ దినాజ్‌పూర్ జిల్లా అని గుర్తించారు. అలియాబరి స్టేషన్‌కు 20 కిలోమీటర్ల దూరంలోని గ్రామానికి వెళ్లి చిన్నారికి రైల్వే శాఖ అధికారులు బొమ్మను అందించారు. దీంతో ఆ చిన్నారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఆ పాప బొమ్మను చూసుకుని మురిసిపోయింది. ఈ సందర్భంగా చిన్నారి తండ్రి మోహిత్ మాట్లాడుతూ 'మా చిన్నారి(19 నెలలు) ఎంతో ఇష్టమైన బొమ్మను రైలులో పోగొట్టుకున్నది. ఎంతో రోధించింది. నాక్కూడా బాధైనా ఏమీ చేయలేక పోయాను. ఈ విషయంలో తనకు సహాయం చేస్తారని అనుకోలేదు. బొమ్మేకదా అని ఫిర్యాదూ చేయలేదు. చివరకు రైల్వే మంత్రి కార్యాలయం నుంచి ఫోన్ చేశారు. ఇంటికి సిబ్బంది వచ్చి బొమ్మను అందించారు. ఈ మధురమైన అను భూతి నన్ను మంత్రముగ్ధుడ్ని చేసింది' అన్నారు. రైల్వే సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. బొమ్మ కోసం రైల్వేశాఖకు ఫిర్యాదు చేసి ఆ బొమ్మను తిరిగి ఇప్పించడంలో కీలకపాత్ర పోషించిన భూసిన్ పట్నాయక్‌ను, రైల్వే సిబ్బంది కృషిని పలువురు అభినందించారు.

ఫాస్ట్ ట్రాక్ కోర్టులతో సత్వర న్యాయం

మహిళా కమిషన్ చైర్ పర్సన్ సునితా లక్ష్మారెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఫాస్ట్ ట్రాక్ కోర్టులతో సత్వర న్యాయమనే కల సాధ్యమనీ, సంచలన కేసుల్లో తక్షణ న్యాయం సాకారమవుతున్నదని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాకిటి సునిత లక్ష్మారెడ్డి తెలిపారు. మహిళలపై అఘాయిత్యాలు, క్రూరమైన హత్యలు తదితర కేసుల్లో దోషులు తప్పించుకునే వీలు లేకుండా కఠిన శిక్ష వేసేందుకు వీలు ంటుందని వివరించారు. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్, జాతీయ మహిళా కమిషన్ సారథ్యంలో "మహిళలకు న్యాయం అందించడంలో ఫాస్ట్ ట్రాక్ కోర్టుల పాత్ర" అనే అంశంపై శుక్రవారం హైదరాబాద్‌లోని రాజ బహదూర్ వెంకటరామరెడ్డి కళాశాలలో సెమినార్ నిర్వహించారు.కార్యక్రమానికి హాజరైన సునితా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఒక వ్యక్తి ఏ మతానికి చెందిన వారైనా, న్యాయం జరుగుతుందని భావించే ప్రదేశం కోర్టు అని వివరించారు. బాలల స్నేహ పూర్వక ఎజెండా దిశగా రాష్ట్రం ముందుకెళ్తున్నదని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ద్వారా పేద ప్రజలు, ఒంటరి మహిళలు, నిరక్ష్యరాస్యులు, ఆర్థికంగా వెనకబడిన వారు ఉచితంగా న్యాయ సేవలు పొందొచ్చని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు పార దర్శకమైన, ఖచ్చితమైన, సత్వర న్యాయాన్ని అందించేందుకు న్యాయశాఖ నిబద్ధతతో పని చేస్తున్నదని వివరించారు. సైబర్ నేరాలు పెరుగు తుండడంతో స్మార్ట్ ఫోన్ ద్వారా తమ వ్యక్తిగత డిటైల్స్ ఇతరులతో పంచుకోవద్దని విద్యార్థులకు సూచించారు. మ్యారేజీ యాక్టు ప్రకారం ప్రతి పెళ్లిని రిజిస్ట్రేషన్ చేయించు కోవాలనీ, గ్రామాల్లో పంచాయితీ కార్యదర్శులు ఆయా రిజిస్ట్రేషన్లపై మహిళలకు అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలకు ఏ సమస్య వున్న ధైర్యంగా ముందుకు రావాలని రాష్ట్ర మహిళా కమి షన్ అండగా ఉంటుందని గుర్తు చేశారు. రాష్ట్ర మహిళా కమిషన్ కార్యదర్శి కృష్ణ కుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మురళి మోహన్, మహిళా కమిషన్ సభ్యులు షాహిన్ ఆఫ్రోజ్, కటారి రేవతి రావు, ఆర్‌బీవీఆర్ఆర్ ప్రిన్సిపల్ అచ్యుత దేవి,రిసోర్స్ పర్సన్ రాజేశ్వరి సెమినార్‌లో పాల్గొన్నారు.

తునికాకు కూలీలకు బోనస్ డబ్బులు చెల్లించండి

- అధికారులను ఆదేశించిన మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజనులకు, కూలీలకు ఉపాధి కల్పించే తునికాకు (బీడీ ఆకు) సేకరణ బోనస్ (నెట్ రెవెన్యూ)ను చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని అరణ్య భవన్‌లో కూలీలకు తునికాకు సేకరణ పెండింగ్ బోనస్ చెల్లింపులు, ఈ సీజన్‌లో తునికాకు సేకరణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో 30 జిల్లాల పరిధిలోని 37 డివిజన్‌లలో విస్తరించిన అటవీ ప్రాంతాల్లో సేకరించిన బీడీ ఆకులను రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ద్వారా సేకరిస్తున్నామని అధికారులు మంత్రికి వివరించారు. రాష్ట్ర పునర్విభజన అనంతరం ఇరు రాష్ట్రాల నెట్ రెవెన్యూ వాటాలను తేల్చడం, కూలీలు వేర్వేరు ప్రాంతాల్లో ఉండటంతో వివరాల సేకరణలో ఆలస్యం అయిందని చెప్పారు. తునికాకు కూలీల పేర్లు, బ్యాంక్ ఖాతాల వివరాల సేకరణ పూర్తయిందనీ, దాదాపు రూ. 233 కోట్ల బోనస్ డబ్బులు చెల్లించాల్సి ఉందని చెప్పారు. సమావేశంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ... కూలీలకు బోనస్ చెల్లింపులో తీవ్ర జాప్యం జరగటం సరిగాదన్నారు.

వీలైనంత త్వరగా చెల్లించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వేసవిలో సుమారు 2.50 లక్షల మంది గిరిజన, గిరిజనేతర కూలీలకు ఆదాయం సమకూర్చిపెట్టే తునికాకు సేకరణకు ఆటంకాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అడవిపై స్థానిక ప్రజలకే పూర్తి హక్కులున్నాయనీ, అటవీ సంపదపై వచ్చే ఆదాయంలో రాయల్టీ డబ్బులను చెల్లించాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, అటవీ శాఖ స్పెషల్ సీఎస్ శాంతికుమారి, పీసీసీఎఫ్ ఆర్.ఎం. డోబ్రియల్, అటవీ అభివృద్ధి సంస్థ వీసీ, ఎండీ చంద్రశేఖర్ రెడ్డి, అదనపు పీసీసీఎఫ్ వినయ్ కుమార్ పాల్గొన్నారు.

జర్నలిస్టు రూపేశ్‌పై తప్పుడు కేసులు

- మానవ హక్కులపై చేసిన కృషికి ప్రతీకారం : ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సంస్థ

న్యూఢిల్లీ : జార్ఖండ్‌కు చెందిన జర్నలిస్టు రూపేశ్ కుమార్ సింగ్‌పై తప్పుడు కేసులు బనాయించారని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సంస్థ తెలిపింది. మానవ హక్కులపై ఆయన చేసిన కృషికి ప్రతీకారంగా ఆయనపై ఈ తప్పుడు కేసు పెట్టారని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల ప్రత్యేక ప్రతినిధి మేరీ లాలర్ అన్నారు. ఆయన జైలులోనే ఉన్నందున ఆయన ఆరోగ్యం ప్రమాదంలో పడొచ్చని తెలిపారు. మావోయిస్టులకు నిధులు సమకూర్చాడన్న ఆరోపణలపై ఇండిపెండెంట్ జర్నలిస్టు అయిన రూపేశ్ కుమార్ సింగ్‌ను జార్ఖండ్ పోలీసులు అరెస్టు చేసిన విషయం విదితమే. భారత ప్రభుత్వానికి గత 26న ఆమె రాసిన లేఖను ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సంఘం బహిర్గతం చేసింది. రూపేశ్ కుమార్ తీవ్ర నొప్పితో బాధపడుతున్నాడనీ, మానసిక ఒత్తిడి కారణంగా అది తీవ్రమవుతుందని యూఎన్ మానవ హక్కుల ప్రతినిధి ఆందోళన వ్యక్తం చేశారు.

సిద్ధిఖీ కప్పన్ సహ నిందితుడు విడుదల

- 27 నెలల తర్వాత జైలు నుంచి బయటకు

న్యూఢిల్లీ: కేరళ జర్నలిస్టు సిద్ధిఖీ కప్పన్‌తో అరెస్టయిన ట్యాక్సీడ్రైవర్ మొహమ్మద్ ఆలమ్ జైలు నుంచి విడుదలయ్యారు. 27 నెలల జైలు జీవితం తర్వాత ఆయన బయటకు వచ్చారు. రాంపూర్‌కు చెందిన ఈయనపై నమోదైన రెండు కేసులలో గతేడాది ఆగస్టు, అక్టోబరులో బెయిలు లభించిన విషయం తెలిసిందే. ఐటీ, రాజద్రోహం చట్టాల కింద ఢిల్లీ కేంద్రంగా పని చేసే జర్నలిస్టు సిద్ధిఖీ కప్పన్, మరో ఇద్దరు పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) సభ్యులు అతికూర్ రహ్మాన్, మసూద్ అహ్మద్‌లతో పాటు మొహమ్మద్ ఆలమ్‌లపై యూపీ పోలీసులు కేసులు నమోదు చేసిన విషయం విదితమే. ఈ కేసులలో పోలీసులు మొదటగా 2020 అక్టోబర్ 5న మొహ మ్మద్ ఆలమ్‌నే అరెస్టు చేశారు. యూపీలోని హత్రాస్‌లో సామూహిక లైంగిక దాడికి గురై చనిపోయిన దళితురాలి ఇంటికి కప్పన్‌తో పాటు మరో ఇద్దరు వెళ్తున్న సమయంలో ట్యాక్సీని ఆలమ్ నడుపుతున్నారు. అయితే, వారు బాధి తురాలి ఇంటికి చేరుకునేలోపే యూపీ పోలీసులు ఆ నలుగురిని అరెస్టు చేశారు.

111 జీవో పేరుతో భూముల వ్యాపారం

- ఎన్ని ప్రాజెక్టులు కట్టారో శ్వేతపత్రం విడుదల చేయండి : ఎంపీ, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు డాక్టర్ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో 111 జీవో ముసుగులో భూముల వ్యాపారం నడుస్తున్నదని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ఆరోపించారు. దమ్ముంటే రాష్ట్రంలో ఎన్ని కొత్త ప్రాజెక్టులు కట్టారనే విషయంపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులతో పెట్టుకున్న కేసీఆర్ ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. గ్రామసభ నిర్వహించి మాస్టర్‌ప్లాన్‌పై అభిప్రాయం తీసుకుంటే బాగుండేదన్నారు. రుణమాఫీ, దళితులకు మూడెకరాల భూపంపిణీ, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలో కేసీఆర్ పాలనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఏప్రిల్‌లో చార్జిషీట్ విడుదల చేస్తారని చెప్పారు. తెలంగాణలో క్షేత్రస్థాయిలో బలోపేతమయ్యేందుకు 10 వేల గ్రామాల్లో గ్రామసభలు పెడతామని తెలిపారు. మిషన్-90తో ముందుకెళ్తున్నామని చెప్పారు. తెలంగాణలో ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై మేధావులు స్పందించాలన్నారు. సంక్రాంతి తర్వాత మేధావులతో ఒక కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

ఇంటర్ విద్యార్థుల్లో ఆందోళన!

- ఇంకా గుర్తింపు రాని ప్రయివేటు కాలేజీలు 24
- దగ్గర్లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఫీజు చెల్లించండి : ఇంటర్ బోర్డు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని అనుబంధ గుర్తింపు రాని ప్రయివేటు జూనియర్ కాలేజీలు 24 వరకు ఉన్నట్టు సమాచారం. గుర్తింపు రాకపోవడంతో ఆయా కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. 'పరీక్షలు ఎలా రాయాలి, ఏ కాలేజీలో ఫీజు కట్టాలి, మా భవిష్యత్తు ఏంటి?'అన్న ప్రశ్నలతో మనోవేదనకు గురవుతున్నారు. విశ్వభారతి జూనియర్ కాలేజీ, గ్లోరీ జూనియర్ కాలేజీ (షాహీన్ నగర్), ఉర్వేస్ జూనియర్ కాలేజీ (మాదాపూర్), గౌతమి జూనియర్ కాలేజీ (హయత్‌నగర్), నోయిసిస్ జూనియర్ కాలేజీ, శ్రీఅరబిందో జూనియర్ కాలేజీ, మదీనా ఖురానిక్ మిషన్ జూనియర్ కాలేజీ, సెయింట్ డానియల్ జూనియర్ కాలేజీ వంటి కాలేజీలకు ఇంకా అనుబంధ గుర్తింపును ఇంటర్ బోర్డు ప్రకటించలేదని సమాచారం. అయితే విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఆయా కాలేజీల్లో చదువుతున్న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంటర్ బోర్డు ప్రత్యేక అవకాశాన్ని కల్పించినట్టు తెలిసింది. ఆయా కాలేజీలకు దగ్గరలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పరీక్ష ఫీజు చెల్లించాలంటూ ఆదేశాలు విడుదల చేసింది. ఆయా కాలేజీలకు షోకాజ్ నోటీసును జారీ చేసింది. ఆ విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఫీజు కట్టేలా డీఐఈవోలు, నోడల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

నేడు, రేపు ఫీజు చెల్లింపునకు అవకాశం

- ఆలస్య రుసుం రూ.వందకు కుదింపు
- మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ కాలేజీలపై ఇంటర్ బోర్డు నిర్ణయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ కాలేజీల్లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు శని, ఆదివారం ఫీజు చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మిక్స్‌డ్ ఆక్యుపెన్సీలో ఉన్న కాలేజీ యాజమాన్యాల విజ్ఞప్తి మేరకు ఇంటర్ బోర్డు చైర్మెన్, విద్యామంత్రి పి సబితా ఇంద్రారెడ్డి ఆదేశాల ప్రకారం ఆలస్య రుసుం రూ.వెయ్యి నుంచి రూ.వందకు కుదించామని తెలిపారు. విద్యార్థులు శని, ఆదివారాల్లో ఆలస్య రుసుం రూ.వందతో పరీక్ష ఫీజును చెల్లించాలని కోరారు. మిక్స్‌డ్ ఆక్యుపెన్సీలో 15 మీటర్ల వరకు ఉన్న కాలేజీలకు సడలింపునిస్తూ గతనెల 23న హోం శాఖ జీవో నెంబర్ 72ను విడుదల చేసిందని గుర్తు చేశారు. దానిప్రకారం కాలేజీలకు అనుబంధ గుర్తింపును ప్రకటించామని పేర్కొన్నారు. కాలేజీ యాజమాన్యాలు ఫీజులను వసూలు చేసి ఇంటర్ బోర్డుకు ఆదివారం నాటికి కట్టాలని ఆదేశించారు. ఫీజు చెల్లింపునకు గడువును పొడిగించబోమని స్పష్టం చేశారు. అయితే ఆయా కాలేజీల యాజమాన్యాలు ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని కలిసి ఆలస్య రుసుంను తగ్గించాలంటూ విజ్ఞప్తి చేసినట్టు సమాచారం. ఆయన వెంటనే స్పందించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు ఫోన్ చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఆయన ఆలస్య రుసుం రూ.వందకు తగ్గించాలంటూ ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను ఆదేశించారు. దీంతో ఈ ఆదేశాలు జారీ అయ్యాయి.

రాష్ట్రంలో కుల వృత్తులకు పూర్వ వైభవం..

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కుల వృత్తులకు పూర్వవైభవం తీసుకొస్తున్నామని మంత్రి వి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. కర్నాటక రాష్ట్ర పర్యటనలో భాగంగా దక్షిణ కన్నడ ప్రధాన కేంద్రం మంగళూరులో గీతవృత్తి పునరుద్ధరణ కోసం స్వామి ప్రణవానంద చేపట్టిన మహాపాదయాత్రను శుక్రవారం మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అమలవుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడా లేవని తెలిపారు. కర్ణాటకలో గీత వృత్తిని పునరుద్ధరించేందుకు తెలంగాణ గౌడ సంఘాలు.. కర్ణాటక ఈడిగ, గౌడ కులస్తులకు మద్దతుగా పోరాటం చేస్తారని మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో ప్రణవానంద శ్రీ నారాయణ గురు పీఠాధిపతి. జనార్దన పూజారి మాజీ కేంద్రమంత్రి, ప్రముఖ సినీ నటులు సుమన్ తల్వార్, నితిన్ గుత్తేదార్, బాలరాజ్ గుత్తేదారు, పల్లె లక్ష్మణరావు గౌడ్ , బాలగోని బాలరాజ్ గౌడ్, రామారావు గౌడ్ , వేములయ్య గౌడ్ పాల్గొన్నారు.

అత్యాధునిక వసతులతో...

- కోహెడలో చేపల హోల్‌సేల్ మార్కెట్ :
మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ వెల్లడి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అత్యాధునిక వసతులతో రంగారెడ్డి జిల్లా కోహెడలో హోల్ సేల్ చేపల మార్కెట్ నిర్మించనున్నట్టు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్ మాసాబ్‌ట్యాంక్‌లోని తన కార్యాలయంలో ఉన్నతస్థాయి అధికారులతో మంత్రి ఇదే అంశంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫిష్ ఫెడరేషన్ చైర్మెన్ దూదిమెట్ల బాలరాజ్‌యాదవ్, విజయ డెయిరీ చైర్మెన్ సోమా భరత్ కుమార్, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అధర్ సిన్హా, మత్స్య శాఖ కమిషనర్ లచ్చిరాంభూక్యా, డైరెక్టర్ రాంచందర్, టీఎస్-ఎల్‌డీఏసీఈవో మంజువాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సుమారు రూ. 50 కోట్ల అంచనా వ్యయంతో హైదరాబాద్ నగరానికి సమీపంలోని కోహెడలో 10 ఎకరాల విస్తీర్ణంలో చేపల హోల్‌సేల్ మార్కెట్‌ను నిర్మించడం జరుగుతున్నదని తెలిపారు. ఇందులో హోల్‌సేల్‌తోపాటు రిటైల్ మార్కెట్లు, కోల్డ్ స్టోరేజ్, క్యాంటీన్ వంటి సౌకర్యాలు కూడా కల్పించనున్నట్టు వివరించారు. రాష్ట్రంలో పెరిగిన మత్స్య సంపదను తక్కువ ధరకు అమ్ముకోవడం ద్వారా మత్స్యకారులు నష్టపోకుండా ఉండేందుకు మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించినట్టు పేర్కొన్నారు. ఈ హోల్ సేల్ మార్కెట్ అందుబాటులోకి వస్తే చేపలకు మంచి ధర లభించి మత్స్యకారులకు ఎంతో మేలు కలుగుతుందని పేర్కొన్నారు. ఆధునిక పద్ధతులతో మార్కెట్ ను నిర్మించేందుకు ఇతర రాష్ట్రాలలో ఉన్న మార్కెట్ లను పరిశీలించి అధ్యయనం చేయాలని మత్స్యశాఖ కమిషనర్ లచ్చిరాం భూక్యాను మంత్రి ఆదేశించారు. మత్స్యకారుల సభ్యత్వ నమోదు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా అర్హులైన మత్స్యకారుల స్కిల్ టెస్ట్‌లో అవసరమైన శిక్షణ ఇవ్వాలని చెప్పారు.

అన్ని జిల్లాల్లో గొర్రెలు, మేకల మార్కెట్ల నిర్మాణం

అన్ని జిల్లాల్లో గొర్రెలు, మేకల మార్కెట్ల నిర్మాణానికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని డైరెక్టర్ రామచందర్‌ను మంత్రి ఆదేశించారు. పెద్దపల్లి, ఖమ్మం, కామారెడ్డి తదితర జిల్లాల్లో స్థలాలను గుర్తించడం జరిగిందనీ, అక్కడ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మిగిలిన జిల్లాల్లో ఆయా జిల్లా కలెక్టర్ల సహకారంతో వారం రోజుల్లోగా స్థల సేకరణ చేయాలని సూచించారు. జీవాలకు సకాలంలో వ్యాక్సిన్లు, నట్టల నివారణ మందుల పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ఏ సమయంలో ఏయే జీవాలకు ఏయే మందులు వేయాలో గుర్తించేలా హెల్త్ క్యాలెండర్ రూపొందించినట్టు పేర్కొన్నారు. గొర్రెలకు నట్టల నివారణ మందుల పంపిణీ రెండో విడత కార్యక్రమాన్ని ఫిబ్రవరిలో ప్రారంభించనున్నట్టు తెలిపారు. సంచార పశు వైద్యశాలల (1962) ద్వారా జీవాలకు అందుతున్న వైద్య సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తిని పెంచేందుకు నాణ్యమైన పశుసంపద ఉత్పత్తి కోసం నిర్వహిస్తున్న కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటిస్థానంలో నిలిచిందని మంత్రి చెప్పారు. ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన మాంసం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయోగాత్మకంగా పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ కార్యాలయ ఆవరణలో ఒక అత్యాధునిక ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

టెన్త్ పరీక్షల్లో ఛాయిస్ పెంచాలి

- రోజువిడిచి రోజు
పరీక్షలు నిర్వహించాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఛాయిస్ ప్రశ్నలను పెంచాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రతిరోజూ పరీక్ష కాకుండా రోజు విడిచి రోజు నిర్వహించాలని కోరారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులను మానసిక ఒత్తిడికి దూరం చేసేలా ప్రశ్నాపత్రంలో 30 శాతం ఛాయిస్ ప్రశ్నలు పెంచాలని కోరారు. పేపర్ల సంఖ్యను ఆరుకు కుదించడం ఆహ్వానించదగ్గ విషయమని తెలిపారు. ఆబ్జెక్టివ్ ప్రశ్నలు రెండు మార్కులు, మూడు మార్కుల ప్రశ్నలకు ఎలాంటి ఛాయిస్ ఇవ్వలేదని పేర్కొన్నారు. వ్యాసరూప ప్రశ్నలు కూడా ఇచ్చిన సమయంలో అన్ని రాయాలంటూ చెప్పడం సరైంది కాదని తెలిపారు. ఈ పద్ధతి వల్ల సిలబస్ మొత్తం ఒకే పేపర్‌లో విద్యార్థులు రాయాలనీ, సమయం సరిపోదని వివరించారు. దీంతో పరీక్ష కఠినంగా ఉంటుందనీ, విద్యార్థులు ఒత్తిడికి గురయ్యే అవకాశముందని పేర్కొన్నారు. ఈ విద్యార్థులంతా కరోనా సమయంలో ఆన్‌లైన్‌లో సరిగ్గా డిజిటల్ విద్య అందుబాటులో లేని వారని వివరించారు. ఆ సమయంలో వారికి చదువుకోవడం ఇబ్బందికరంగా మారిందనీ, సరైన అభ్యాసన లేదని తెలిపారు. ఈ పరిస్థితి దృష్ట్యా కనీసం ఛాయిస్ లేకుండా చేస్తే విద్యార్థులు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నత విద్యలో ఛాయిస్ ఉందనీ, ఇంజినీరింగ్, మెడిసిన్‌లాంటి పరీక్షలు ఛాయిస్ ఇస్తున్నారని గుర్తు చేశారు. పదో తరగతికి ఈ నిబంధనను ఎందుకు పెట్టారో సమాధానం చెప్పాలని ఎస్-ఎస్‌సీ బోర్డు అధికారులను వారు డిమాండ్ చేశారు.

ప్రయివేటు విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్లను అరికట్టాలి : ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రయివేటు విద్యాసంస్థల్లో ముందస్తు అడ్మిషన్ల ప్రక్రియను అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు ప్రారంభమంటూ ప్రకటనలు ఇవ్వడం సరైంది కాదని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయివేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్లను ప్రారంభించినా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రయివేటు విద్యాసంస్థల పీఆర్వోలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం పూర్తికాక ముందే వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పుడే అడ్మిషన్లు ప్రారంభమంటూ పెద్ద పెద్ద హోర్డింగ్‌ల ద్వారా, ప్రచారం చేస్తూ ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు.

ఇప్పుడు అడ్మిషన్ తీసుకుంటే ఆఫర్ అంటూ మాయ మాటలు చెప్పి విద్యార్థుల తల్లిదండ్రులను ప్రలోభాలకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పీఆర్టీయూ తెలంగాణ డైరీని ఆవిష్కరించిన హరీశ్‌రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పీఆర్టీయూ తెలంగాణ నూతన సంవత్సరం డైరీని ఆర్థిక శాఖ మంత్రి టి హరీశ్‌రావు శుక్రవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కె జనార్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి, టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు దేవీప్రసాదరావు, పీఆర్టీయూ తెలంగాణ అధ్యక్షులు ఎం చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి ఎం అంజిరెడ్డి, నాయకులు కేశవులు, రాజిరెడ్డి, మోహన్‌రెడ్డి, శ్రీధర్, వెంకటరెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



సిరీస్ నీదా.. నాదా..!

- భారత్-శ్రీలంక చివరి టి20 నేడు
- రాత్రి 7.00గం॥లనుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

రాజ్‌కోట్: భారత్-శ్రీలంక జట్ల మధ్య జరుగుతున్న మూడు టి20ల సిరీస్ హోరాహోరీగా సాగుతుంది. తొలి టి20లో టీమిండియా 2 పరుగుల తేడాతో గెలిస్తే.. రెండో టి20లో శ్రీలంక జట్టు 16పరుగుల తేడాతో టీమిండియాపై విజయం సాధించింది. దీంతో ఇరుజట్ల మధ్య శనివారం జరిగిన మూడో, ఆఖరి టి20లో గెలుపు ఇరుజట్లను ఊరిస్తోంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు టైటిల్‌ను గెలుపొందనుండగా.. భారత బ్యాటర్స్ సమిష్టిగా రాణించాల్సిన అవసరమెంతైనా ఉంది. భారత యువ బౌలర్ శివమ్ మావి అరంగేట్రం మ్యాచ్‌లో రాణించినా.. రెండో మ్యాచ్‌లో చేతులెత్తేశాడు. హర్షల్ పటేల్, ఆర్షదీప్ సింగ్ ఆశించినస్థాయిలో రాణించలేకపోతున్నారు. పూణే వేదికగా జరిగే రెండో టి20లో శ్రీలంక జట్టు 200కు పైగా పరుగులు చేసి భారత్‌పై ఒత్తిడి పెంచింది. ఈ పిచ్ కూడా బ్యాటర్లకు స్వర్గధామం కాబట్టి బ్యాటర్లు, బౌలర్లు సమిష్టిగా రాణించాల్సిన అవసరం ఉంది. ఓపెనర్లు నిరాశపరుస్తుండడం టీమిండియాను కలవరపరుస్తోంది. సీనియర్ల విశ్రాంతితో యువ క్రికెటర్లపైనే టీమిండియా అభిమానులు గంపెడాశలు పెట్టుకున్నారు.

జట్లు..

ఇండియా: హార్దిక్(కెప్టెన్), ఇషాన్, సంజు(వికెట్ కీపర్లు), సూర్యకుమార్(వైస్ కెప్టెన్), గైక్వాడ్, శుభ్‌మన్, దీపక్ హుడా, త్రిపాఠి, సుందర్, చాహల్, అక్షర్, ఆర్షదీప్, హర్షల్, ఉమ్రన్, శివమ్ మావి, ముఖేష్ కుమార్.

శ్రీలంక: శనక(కెప్టెన్), నిస్సంక, అవిష్కా ఫెర్నాండో, సమరవిక్రమ, కుశాల్ మెండీస్, రాజపక్సె, అసలంక, ధనుంజయ, హసరంగ(వైస్ కెప్టెన్), భండార, తీక్షణ, కరుణరత్నే, మధుశనక, రజిత, వెల్లాలగె, మధుశూదన్, కుమార.

సెమీస్‌కు జకో, మెద్వదెవ్

- ఆడిలైడ్ ఓపెన్





సిడ్నీ: ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌కు ముందు జరిగే ఆడిలైడ్ ఇంటర్నేషనల్ టెన్నిస్ టోర్నీ సెమీఫైనల్లోకి టాప్‌సీడ్ నొవాక్ జకోవిచ్(సెర్బియా), 2వ సీడ్ డానియేల్ మెద్వదెవ్(రష్యా) దూసుకెళ్లారు. శుక్రవారం జరిగిన పురుషుల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో జకోవిచ్ 6-3, 6-4తో షపొవాలోవ్‌ను, మెద్వదెవ్ 6-3, 6-3తో కరెన్ ఖచనోవ్‌పై వరుససెట్లలో గెలిచారు. సెమీస్‌లో వీరిద్దరూ తలపడనుండగా.. గత ఏడాది కరోనా టీకా వేయించుకోని కారణంగా ఆస్ట్రేలియాన్ ఓపెన్ మధ్యలోనే అర్ధాంతరంగా జకోవిచ్ వైదొలిగిన సంగతి తెలిసిందే.

ఆటలు

టెస్ట్ సిరీస్ డ్రా

- సర్ఫరాజ్ సెంచరీ, చివర్లో నసీమ్ షా మెరుపులు
- పాకిస్తాన్, న్యూజిలాండ్ రెండో టెస్ట్ డ్రా



కరాచీ: పాకిస్తాన్-న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగిన రెండో, చివరి టెస్ట్ డ్రా అయ్యింది. 319పరుగుల లక్ష్యంతో ఐదోరోజు ఆటను కొనసాగించిన పాకిస్తాన్ జట్టును మాజీ వికెట్ కీపర్ సర్ఫరాజ్ అహ్మద్ సెంచరీకి తోడు చివర్లో యువ పేసర్ నసీమ్ షా అద్భుత బ్యాటింగ్‌తో మెరుపులతో న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టెస్ట్‌ను పాక్ జట్టు డ్రా చేసుకుంది. పాకిస్తాన్ 287పరుగులకు 9వికెట్లు కోల్పోయి ఓటమిదశలో ఉండగా.. నసీమ్ షా న్యూజిలాండ్ బౌలర్లకు అడ్డుగోడగా నిలిచి వికెట్ పడకుండా ఆడాడు. వికెట్ల చుట్టూ ఫీల్డర్లు పొంచి ఉన్నా.. వారి పైనుంచి బంతులను కొట్టి అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. దీంతో వెలుతురు లేమితో మ్యాచ్ నిలిచే సమయానికి పాక్ జట్టు 9వికెట్లు కోల్పోయి 304పరుగులు చేసింది. పాకిస్తాన్ ఓ దశలో 80పరుగులకే 5వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో సీనియర్ వికెట్ కీపర్ సర్ఫరాజ్(118) అద్భుత సెంచరీతో ఆదుకున్నాడు. 6వ వికెట్‌కు సర్ఫరాజ్ ఖాన్ షకీల్‌తో కలిసి 123పరుగులు, అఘా సల్మాన్‌తో కలిసి 7వి వికెట్‌కు 70పరుగులు చేశాడు. దీంతో ఛేదన దిశగా వెళ్తున్న పాకిస్తాన్‌ను.. న్యూజిలాండ్ బౌలర్లు కట్టడి చేశారు. చివర్లో 11వ వికెట్‌కు నసీమ్ షా(15నాటౌట్), అబ్రార్(7) కలిసి 21బంతుల్లో 17పరుగులు జతచేసి న్యూజిలాండ్ విజయానికి కళ్లెం వేశారు. చివర్లో 4ఓవర్లలో 15పరుగులు చేస్తే పాక్ గెలుస్తుందనుకున్న దశలో అంపైర్లు వెలుతురు లేమి కారణంగా మ్యాచ్‌ను నిలిపివేశారు. దీంతో ఇరుజట్ల మధ్య జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ 0-0తో డ్రా అయ్యింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ సర్ఫరాజ్ అహ్మద్‌కు లభించగా.. మూడు వన్డేల సిరీస్ 9నుంచి ప్రారంభం కానుంది.

ఆంధ్ర ఘన విజయం

హైదరాబాద్‌పై 154 పరుగుల తేడాతో గెలుపు



విజయనగరం: విజయనగరంలోని చింతల వలస పివిజి రాజు క్రికెట్ మైదానంలో జరుగుతున్న రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్-బిలో ఆంధ్రప్రదేశ్ జట్టు ఘన విజయం సాధించింది. 401పరుగుల లక్ష్య ఛేదనలో భాగంగా హైదరాబాద్ ఓవర్‌నైట్ స్కోర్ 2 వికెట్ల నష్టానికి 75 పరుగులతో శుక్రవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన 246పరుగులకు ఆలౌటైంది. దీంతో ఆంధ్రప్రదేశ్ జట్టు 154 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆంధ్ర జట్టు 135 పరుగులు, హైదరాబాద్ జట్టు 197 పరుగులు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌లో ఆంధ్ర జట్టు 462 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్‌లోనూ హైదరాబాద్ 246 పరుగులకే ఆలౌటైంది. ఆంధ్ర బౌలర్లలో కెవి శశికాంత్ ఐదు వికెట్లు, సుదర్శన్ మూడు వికెట్లు సాధించి ఆంధ్ర జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. 10నుంచి హైదరాబాద్-సౌరాష్ట్ర, ఆంధ్ర-ఢిల్లీ జట్ల మధ్య లీగ్ మ్యాచ్ జరగనున్నాయి.

మాస్టర్ ప్లాన్ రద్దుచేయాలని..

కామారెడ్డి బంద్ సక్సెస్

- ఎక్కడికక్కడ రైతుల అరెస్టులు
- మద్దతు తెలిపిన సీపీఐ(ఎం), కాంగ్రెస్, బీజేపీ



నవతెలంగాణ-కామారెడ్డిటౌన్

మాస్టర్ ప్లాన్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రైతు ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కామారెడ్డి నియోజకవర్గ బంద్‌కు పిలుపునివ్వగా.. బంద్ విజయవంతమైంది. బంద్‌లో భాగంగా నిరసన వ్యక్తం చేసేందుకు రోడ్లపైకి వచ్చిన రైతులను పోలీసులకు ఎక్కడికక్కడ అరెస్టులు చేస్తూ పోలీస్‌స్టేషన్లకు తరలించారు. కాగా బంద్‌కు సీపీఐ(ఎం), కాంగ్రెస్, బీజేపీతో పాటు వివిధ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. పలువురు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఇక వ్యాపారస్తులు, కిరాణా షాప్ యాజమానులు బంద్‌లో భాగంగా తమ వ్యాపార, దుకాణ సముదాయాలను స్వచ్ఛంధంగా మూసి ఉంచారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని, మాస్టర్ ప్లాన్ రద్దు చేసేంతవరకు తమ పోరాటాన్ని ఆపబోమని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చేవరకూ తమ పోరాటాన్ని రైతు ఐక్య కార్యచరణ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కాగా, బంద్‌లో భాగంగా రైతులకు మద్దతు తెలిపిన సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్, నాయకులు అరుణ్‌కుమార్, నర్సింలును, కాంగ్రెస్, బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి స్టేషన్‌లకు తరలించారు.

మెట్రో రైలుకు ఎదురుగా దూకి వ్యక్తి ఆత్మహత్య

- మూసాపేట్ మెట్రో స్టేషన్‌లో ఘటన

నవతెలంగాణ-కూకట్‌పల్లి

మెట్రో స్టేషన్‌లో రన్నింగ్‌లో ఉన్న రైలుకు ఎదురుగా వెళ్లి అకస్మాత్తుగా దూకి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జరిగింది. సీఐ నర్సింగ్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి మూసాపేట్ మెట్రో స్టేషన్ ప్లాట్ ఫామ్ వద్దకు చేరుకున్న ఓ వ్యక్తి రన్నింగ్‌లో ఉన్న మెట్రో రైలుకు ఎదురుగా వెళ్లి దూకేశాడు. ఈ దృశ్యాలు అక్కడి సీసీ కెమెరాలో నిక్షిప్తమయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని తీవ్రంగా గాయపడిన అతన్ని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని తనిఖీ చేయగా జేబులో రైలు టికెట్ సైతం లేదు. అతని గురించి ఎలాంటి వివరాలు దొరకలేదు. గుర్తు తెలియని శవంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

బాలికపై లైంగికదాడి యత్నం

నవతెలంగాణ-స్టేషన్ ఘనపూర్

జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలం రాఘవాపూర్ గ్రామంలో పదేండ్ల బాలికపై లైంగికదాడికి యత్నించిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సీఐ ఆలే రాఘవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సముద్రాల గ్రామానికి చెందిన పులి రజనీ కుమార్ (33) తనకు వరుసకు కోడలైన బాలికపై ఇంట్లో ఎవరూ లేని సమయంలో లైంగికదాడికి యత్నించగా, బాలిక ప్రతిఘటించి, అరవడంతో నిందితుడు పరారయ్యాడు. బాలిక తల్లిదండ్రులు పోలీసులు ఆశ్రయించగా, నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్టు సీఐ తెలిపారు.

ఎస్సై, కానిస్టేబుల్ తుది పరీక్షలకు అర్హత సాధించిన అభ్యర్థులు

1,11,209 మంది

- పీఎంటీ, పీఈటీ పరీక్షల్లో ఎలాంటి అవకతవకలూ జరగలేదు
- సాంకేతిక పరిజ్ఞానంతోటే అన్ని పరీక్షలు నిర్వహించాం : టీఎస్ఎల్‌పీఆర్‌బీ చైర్మెన్ వీవీ శ్రీనివాసరావు



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి: రాష్ట్రంలో ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులకు జరుగనున్న తుది అర్హతా పరీక్షలకు 1,11,209 మంది అభ్యర్థులు అర్హత సాధించారని రాష్ట్ర పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) చైర్మెన్ వీవీ శ్రీనివాసరావు తెలిపారు. గత నెల డిసెంబర్ 8 నుంచి ఈనెల 5 వరకు సాగిన పీఎంటీ, పీఈటీ పరీక్షలకు మొత్తం 2,07,106 మంది అభ్యర్థులు హాజరుకాగా.. ఇందులో 1,11,209 మంది అభ్యర్థులు తుది పరీక్షను రాయడానికి అర్హతను సాధించారని ఆయన తెలిపారు. ఎస్సై తత్సమాన పోస్టులు 554 పోస్టులు ఉండగా, కానిస్టేబుల్ తత్సమాన పోస్టులు 15644 లకు ఈ పరీక్షలు జరుగుతున్నాయి. కాగా, సివిల్ తత్సమాన కానిస్టేబుల్ పోస్టులకు పీఎంటీ, పీఈటీ పరీక్షల్లో జరిగిన పోటీలలో 90488 మంది అభ్యర్థులు నెగ్గగా ఇందులో పురుషులు 67606 మంది, మహిళలు 22882 మంది ఉన్నారు. కాగా ఎస్సై తత్సమాన పోస్టులకు జరిగిన పీఎంటీ, పీఈటీ పరీక్షలో 52786 మంది అభ్యర్థులు నెగ్గగా ఇందులో పురుషులు 41256 మంది, మహిళలు 11530 ఉన్నారని ఆయన తెలిపారు. మొత్తంమీద ఈ మారు 53.70 శాతం మంది అభ్యర్థులు తుది రాత పరీక్షకు ఎంపిక కాగా గతంలో నిర్వహించిన ఎస్సై, కానిస్టేబుల్ తుది రాత పరీక్షకు హాజరైన శాతం 51.95 శాతం మాత్రమే. అంటే ఈమారు 5.18 శాతం మంది అభ్యర్థులు ఎక్కువగా తుది రాత పరీక్షకు హాజరవుతున్నారని ఆయన చెప్పారు. అలాగే గతంలో ఈ పోస్టులకు నిర్వహించిన పరీక్షలలో కొన్నింటిని ఈ మారు తగ్గించడం జరిగిందని వివరించారు. ముఖ్యంగా పీఎంటీ, పీఈటీలో గతంలో ఐదు పరీక్షలు ఉండగా ఈ మారు మూడు మాత్రమే పరీక్షలను నిర్వహించామని ఆయన అన్నారు. అంతేగాక ఈ మారు పూర్తిగా పరీక్షలను పూర్తిగా సాంకేతికతపైనే ఆధారపడి నిర్వహించామని ఇందులో ఏమాత్రమూ అవకతవకలు చోటు చేసుకోలేదని శ్రీనివాసరావు వివరించారు. నిర్ణీత మార్చి 12వ తేదీ నుంచే ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులకు తుది రాత పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

తైవాన్ జలసంధి మీదుగా అమెరికా యుద్ధ నౌక !

- చైనా ఆగ్రహం



వాషింగ్టన్ : చైనా, తైవాన్ మధ్య మరింత ఉద్రిక్తతలు పెంచేందుకు ప్రయత్నిస్తున్న అమెరికా తాజాగా మరోసారి అందుకు తెగబడింది. తైవాన్ జలసంధి మీదుగా అమెరికా యుద్ధ నౌక గురువారం ప్రయాణించింది. ఇది రొటీన్ కార్యక్రమంగా అమెరికా మిలటరీ పేర్కొనగా, చైనా ఈ చర్య పట్ల ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇటీవలి సంవత్సరాల్లో అమెరికా యుద్ధ నౌకలే కాదు, మిత్ర దేశాలైన బ్రిటన్, కెనడా వంటి దేశాల యుద్ధ నౌకలు కూడా తైవాన్ జలసంధి మీదుగా ప్రయాణిస్తూ, చైనాను రెచ్చగొడుతున్నాయి. అర్లేగ్ బుర్కె తరగతికి చెందిన గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్ చుంగ్-హూన్ తైవాన్ జలసంధిలో ప్రయాణించిందని అమెరికా మిలటరీ ఒక ప్రకటనలో తెలియజేసింది. దీనిపై వాషింగ్టన్‌లోని చైనా ఎంబసీ ప్రతినిధి లియూ పెంగ్యూ ఒక ప్రకటన చేశారు. ఈ చర్యను చైనా తీవ్రంగా వ్యతిరేకిస్తోందని చెప్పారు. ఇటువంటి రెచ్చగొట్టే చర్యలను, ఉద్రిక్తతల పెంపును, తైవాన్ జలసంధి వ్యాప్తంగా శాంతి సుస్థిరతకు విఘాతం కలిగించడాన్ని తక్షణమే ఆపాల్సిందిగా అమెరికాను కోరారు. నౌకల స్వేచ్ఛా రాకపోకల పేరుతో అమెరికా యుద్ధ నౌక తరచుగా ఇటువంటి చర్యలకు దిగుతోందని, ఈ ప్రాంతాన్ని స్వేచ్ఛగా, పారదర్శకంగా వుంచడమంటే ఇది కాదని ఆ ప్రకటన పేర్కొంది. చైనా అప్రమత్తతను కొనసాగిస్తుందని, ఏ సమయంలోనైనా బెదిరింపులు, రెచ్చగొట్టే చర్యలకు దీటుగా స్పందించడానికి సిద్ధంగా వుందని పెంగ్యూ పేర్కొన్నారు. చైనా జాతీయ సార్వభౌమాధికారాన్ని, ప్రాదేశిక సమగ్రతను పరిరక్షించుకుంటామని చెప్పారు.





ఎల్బీ స్టేడియంలో కుస్తీ పోటీలు

హింద్ కేసర్...2022 ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు హైదరాబాద్ లాల్‌బహదూర్ స్టేడియంలో శుక్రవారం షురూ అయ్యాయి. పురుషులు,మహిళలు కూడా ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. పోటీలను తిలకించటానికి భారీ సంఖ్యలో సందర్శకులు తరలివచ్చారు.

నేటి నుంచి బీహార్‌లో కులాల సర్వే !

పాట్నా : బీహార్‌లో శనివారం నుంచి కులాల ఆధారిత సర్వే మొదటి దశ ప్రారంభం కానుంది. ఈ నెల 21వరకు ఈ దశ కొనసాగుతుంది. మొదటి దశలో రాష్ట్రంలోని మొత్తం కుటుంబాల సంఖ్య లెక్కించి, నమోదు చేస్తారు. రెండో దశలో కుటుంబాల్లో నివసించే వ్యక్తులు, వారి కులాలు, ఉప కులాలు, సామాజిక, ఆర్థిక పరిస్థితులు వంటి సమాచారాన్ని సేకరిస్తారు. ఏప్రిల్ 1 నుంచి 30వరకు రెండో దశ కొనసాగుతుంది. మొత్తంగా సర్వే మే 31తో ముగుస్తుంది. ప్రస్తుతం కొనసాగుతున్న తన సమాధాన్ యాత్రలో భాగంగా శుక్రవారం మీడియాతో ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మాట్లాడుతూ, ఈ సర్వేతో రాష్ట్రంలో కులాలు, కమ్యూనిటీలపై సవివరమైన రికార్డు వుంటుందని చెప్పారు. వారి అభివృద్ధికి ఇది సహాయపడుతుందన్నారు. రాష్ట్రంలో కులాల వారీగా సర్వే జరగాలన్న అఖిలపక్షం డిమాండ్‌ను గతేడాది జూన్ 2న రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది.

బస్సు డ్రైవర్‌కు గుండెపోటు

- చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన ట్రావెల్స్ బస్సు
- డ్రైవర్ మృతి.. 45 మంది యాత్రికులు క్షేమం

నవతెలంగాణ-వెంకటాపురం

మాలధారణ ముగించుకొని పుణ్యక్షేత్రాలకు వెళ్తున్న యాత్రికులు ప్రయాణం చేస్తున్న బస్సు డ్రైవర్‌కు గుండెపోటు రావడంతో సీట్లోనే కుప్పకూలాడు. దాంతో బస్సు అదుపుతప్పి చెట్లపొదల్లోకి దూసుకెళ్లింది. అయితే, యాత్రికులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఈ ఘటన ములుగు జిల్లా వెంకటాపురం మండలం వీరభద్రవరం గ్రామ సమీపంలో శుక్రవారం జరిగింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా కాణిపాకం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన 45మంది యాత్రికులు ఓంశక్తి మాల ధరించారు. దీక్ష అనంతరం కార్తీక్ ట్రావెల్స్‌కు చెందిన ప్రయివేటు బస్సులో తమిళనాడు రాష్ట్రంలోని మెల్ మాలక్‌తూర్‌లోని అమ్మవారిని దర్శించుకున్నారు. దీక్ష విరమణ అనంతరం తీర్థ యాత్రలకు బయలుదేరారు. భద్రాచలం రాముల వారిని దర్శించుకున్నారు. వెంకటాపురం మండలం మీదుగా శ్రీశైలం వెళ్తుండగా వెంకటాపురం మండలంలోని వీరభద్రవరం సమీపంలో డ్రైవర్ బాబు(50)కు గుండెపోటు వచ్చి సీట్లోనే కుప్పకూలాడు. దాంతో బస్సు అదుపుతప్పి పక్కనే ఉన్న పొదల్లోకి దూసుకువెళ్ళింది. చెట్లను ఢీకొని ఆగిపోయింది. డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. బస్సులో ప్రయాణిస్తున్న 45మంది యాత్రికులు సురక్షితంగా ఉన్నారు. సంఘటనా స్థలికి ఎస్ఐ సురేష్ చేరుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు.

యువ రైతు ఆత్మహత్య

నవతెలంగాణ-మొగుళ్ళ పల్లి

పురుగుల మందు తాగి యువ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జయశంకర్-భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలం రంగాపురం గ్రామంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సిరిబొమ్మల ప్రశాంత్(26) తన తండ్రి చనిపోవడంతో తల్లి స్వప్నతో ఉంటూ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వారికి ఉన్న నాలుగు ఎకరాల భూమిలో మిర్చి పంట సాగుచేయగా, పెట్టుబడి కోసం రూ.5 లక్షలు అప్పు చేశాడు. పంటకు తెగులు సోకి దిగుబడి తగ్గడంతో.. తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి స్వప్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఆరుగురు సభ్యులతో వైఎస్‌ఆర్‌టీపీ రాజకీయ కార్యాచరణ కమిటి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వైఎస్‌ఆర్‌టీపీ తెలంగాణ రాజకీయ కార్యాచరణ కమిటీని శుక్రవారం ఆ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రకటించారు. ఆరుగురు సభ్యులతో కూడిన ఈ కమిటీలో సభ్యులుగా కొండా రాఘవ రెడ్డి, గట్టు రామచందర్ రావు, పిట్ట రాంరెడ్డి, గడిపల్లి కవిత, ఏపురి సోమన్న, నీలం రమేష్‌కు స్థానం కల్పించారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.